ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 14.11.2025 | సంపుటి :12 సంచిక : 114 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## బంగ్లాదేశ్‌లో మళ్లీ ఆందోళనలు

- దేశవ్యాప్తంగా హైఅలర్ట్ ప్రకటన
- యూనస్ ఉగ్రవాదుల ఫ్రంట్‌మన్ : హసీనా

**ఢాకా(జనంసాక్షి):**బంగ్లాదేశ్‌లో మరోసారి హింస చెలరేగింది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినందుకుగానూ మాజీ ప్రధాని షేక్ హసీనాపై నమోదైన కేసుల విషయంలో నవంబర్ 17న తీర్పు వెలువడనుంది. ఈ తీర్పు రానున్న సమయంలో పలు చోట్ల దాడులు జరుగుతున్నాయి. గత పరిణామాలను దృష్టిపెట్టుకొన్న ప్రభుత్వం రాజధాని నగరం ఢాకాలో భద్రత పెంచింది. మరీ ముఖ్యంగా తీర్పును వెలువరించే ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ చుట్టూ సెక్యూరిటీని కట్టుదిట్టం చేశారు.హసీనా పార్టీ అవామీ లీగ్ ఢాకాలో లాక్‌డౌన్‌కు పిలుపునిచ్చింది. దాంతో గురువారం పోలీసులు, బోర్డర్ గార్డ్ సెక్యూరిటీని భారీ స్థాయిలో మోహరించారు. మిగతా 9లో..

## తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల

### 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో టెట్ నోటిఫికేషన్ విడుదలయింది. నవంబర్ 15వ తేదీ నుంచి అభ్యర్థుల నుంచి ఈ దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ దరఖాస్తులు మిగతా 2లో..

# హైదరాబాద్ సురక్షిత నగరం

## పెట్టుబడులతో రండి..



ఢిల్లీలో నిర్వహించిన యూఎస్-ఇండియా వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో వివిధ మల్టీ నేషనల్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమై ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### నగరంలో రోడ్లకు ప్రముఖ కంపెనీల పేర్లు

- ఇక్కడ పెట్టుబడులకు భద్రతకు ప్రభుత్వం హామీ
- వేగవంతమైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ
- అధికారంలో ఎవరున్నా వన్నె తగ్గని హైదరాబాద్ బ్రాండ్
- అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటుకు హైదరాబాద్ అనుకూలం
- ఢిల్లీ యూఎస్-ఇండియా వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో మల్టీనేషనల్ కంపెనీలకు సీఎం రేవంత్ ఆహ్వానం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** హైదరాబాద్ ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఎటువంటి ఢోకా లేకుండా భౌగోళికంగా కేంద్ర స్థానంలో హైదరా బాద్ ఉందన్నారు. భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖ ద్వారమని సీఎం తెలిపారు. జీసీసీలకు గృమస్థానంగా ఉన్న హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. దేశంలోనే పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ అని ముఖ్యమంత్రి అన్నారు. ఢిల్లిలో గురువారం జరిగిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు-భారతదేశం వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగించారు. తెలంగాణలో గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌తో పాటు అనేక పార్టీలు ప్రభుత్వాలకు సారథ్యం వహించినా పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు అందరూ మద్దతుగా నిలిచారని ముఖ్యమంత్రి వివరించారు. మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.గత 23 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ భారత దేశంలోనే నూతన నగరంగా మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే మిగతా 2లో..

# నేడు జూబ్లీహిల్స్ ఓట్ల లెక్కింపు

## • కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన ఈసీ • 10 రౌండ్లలో తేలనున్న భవితవ్యం

- కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్
- గెలుపుపై ఎవరి అంచనాలు వారివే
- ఎగ్జిట్ పోల్ సర్వేతో కాంగ్రెస్‌లో ఉత్సాహం

**హైదరాబాద్(జనంసాక్షి):**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కౌంటింగ్ కు సర్వం సన్నద్ధం చేశామని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ తెలిపారు. నేడు ఎన్నిక కౌంటింగ్ నేపథ్యంలో గురువారం యూసఫ్ గూడ కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలోని మీడి యా సెంటర్ లో పాత్రికేయులకు కౌంటింగ్ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి వివరించారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ చేస్తామన్నారు. నోటా తో కలిపి 59 మంది అభ్యర్థులు బరిలో ఉన్నందున ఈసీఐ నుండి ప్రత్యేక అనుమతి తీసుకుని ఈసారి 42 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గరిష్టంగా 10 రౌండ్లు చేస్తారని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియను ఈసీఐ సాధారణ పరిశీలకులు , ఈసీఐ బృందం పరిశీలి స్తారని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియకు 186 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. వీరిలో కౌంటింగ్ మిగతా 2లో..






కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలోనీ మీడియా సెంటర్‌లో ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు చేసిన అధికారులు

# ప్రజలకే జవాబుదారీగా ఉంటాం

- ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వాన్ని వారికే అంకితం చేసాం
- మహిళలంతా ఆత్మగౌరవంతో బతకాలని వడ్డీ లేని రుణాలు
- ఐదు సంవత్సరాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తాం
- విద్యారంగానికి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు
- ప్రతి పైసా ప్రజల అవసరాలకు ఖర్చు పెడతాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**ఖమ్మం(జనంసాక్షి):**ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ప్రభుత్వాన్ని ప్రజలకే అంకితం చేసాం, ప్రజలకే జవాబుదారీగా ఉంటాం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం లోని ముదిగొండ మండలంలో కాకతీయ నాటి శివాలయం పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా స్థానికంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మిగతా 2లో..

# వరుస పేలుళ్లకు ఉగ్రవాదుల కుట్ర



### 32 కార్లతో భారీ మారణహోమానికి సిద్ధమైన ముష్కరులు

### డిసెంబర్ 6న దాడులకు పన్నాగం.. ఇంటెలిజెన్స్ వర్గాల వెల్లడి

- ఎర్రకోట ఘటన దర్యాప్తులో వెలుగులోకి వస్తున్న సంచలన విషయాలు
- పేలిన కారులో ఉన్నది ఉమర్ నబీయే
- ఎన్‌ఎతో పోల్చి చూసి గుర్తింపు
- పేలుడు ఘటనకు ముందు అక్కడే తచ్చాడినట్లు వెల్లడి
- ఫరీదాబాద్ మాడ్యూల్‌లో మరో డాక్టర్ అరెస్టు
- డాక్టర్ మహ్మద్ ఆరిఫ్‌ను కాన్పూరులో అదుపులోకి తీసుకున్న అధికారులు
- పరారీలో కశ్మీర్ వైద్యుడు డా.ముజఫ్ఫర్
- రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించిన పోలీసులు
- 13కు చేరిన మృతుల సంఖ్య
- చికిత్స పొందుతూ మరొకరు మృతి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడు ఘటన దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పేలుడు కేవలం ఒక చిన్న సంఘటన కాదని, దీని వెనుక దేశ వ్యాప్తంగా భారీ ఉగ్ర దాడులకు ప్రణాళిక వేసినట్లు భద్రతా ఏజెన్సీలు గుర్తించాయి. ఈ కుట్రలో వైట్‌కాలర్ ఉగ్రవాదులు పాల్గొన్నట్లు దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. భారీ ఉగ్రదాడి చేసేందుకు.. పేలుడు పదార్థాలు నింపిన 32 కార్లను సిద్ధం చేసేందుకు అనుమానిత ఉగ్రవాదులు ప్లాన్ చేసినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ 6న దాడులకు పాల్పడాలని ఉగ్రవాదులు భావించారని విచారణలు తేలింది. అందుకోసమే ఈ 32 కార్లను కూడా సిద్ధం చేసుకున్నారని దర్యాప్తులో తేలింది. ఈ 32 కార్లతో ఢిల్లీతో సహా దేశంలోని పలు నగరాల్లో ఏకకాలంలో దాడుల కోసం ఉపయోగించాలని అనుమానిత ఉగ్రవాదులు భావించినట్లు అధికారులు గుర్తించారు. నిందితులు దాడుల కోసం ఐ20, ఎకోస్పోర్ట్ వంటి కార్లను ఎంపిక చేసుకుని.. వాటిని పేలుడు పదార్థాలను నింపేందుకు వీలుగా మాడిఫై చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సీరియల్ పేలుళ్లకు పాల్పడాలన్నదే వారి ప్రధాన ఉద్దేశమని భద్రతా ఏజెన్సీల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ఇప్పటి వరకు నాలుగు కార్లను గుర్తించారు. ఇవన్నీ పాత కార్లుగా తేలాయి. దాడుల కోసం పాత కార్లను ఉగ్రవాదులు కొనుగోలు చేసినట్లు అధికారులు మిగతా 2లో..

### ఢిల్లీ పేలుడు ఘటన ముమ్మాటికి ఉగ్రదాడే

ఘటనపై దర్యాప్తులో భారత్‌కు ఎవరిసాయం అవసరం లేదు: మార్కో రూబియో

2లో..

## ఐదు రాష్ట్రాల్లో ఎన్ఐఏ సోదాలు




### అల్‌ఖైదాతో సంబంధం ఉన్న బంగ్లాదేశీయుల గుర్తింపు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**జాతీయ దర్యాప్తు సంస్థ గురువారం ఐదు రాష్ట్రాల్లో దాడులు నిర్వహించింది. అల్ ఖైదా గుజరాత్ ఉగ్రవాద కుట్రలో అక్రమ బంగ్లాదేశ్ వలసదారుల ప్రమేయం ఉన్నట్లుగా అనుమానిస్తున్నారు. ఐదురాష్ట్రాల్లోని దాదాపు పది చోట్ల ఎన్ఐఏ తనిఖీలు నిర్వహించింది. పశ్చిమ బెంగాల్, త్రిపుర, మేఘాలయ, హర్యానా, గుజరాత్‌లలో అనుమానితులు, వారి సహచరులకు సంబంధించిన స్థలాల్లో ఎన్ఐఏ మిగతా 2లో..

## వామ్మో.. చలి



- రాత్రి వేళల్లో పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- సిర్పూర్‌లో కనిష్టంగా 7.1 డిగ్రీలు నమోదు

**హైదరాబాద్/ఆదిలాబాద్(జనంసాక్షి):**రాష్ట్రంలో చలి తీవ్రత రోజురోజుకు పెరిగిపోతున్నది. రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో చలిలో ప్రజలు వణికిపోతున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. గురువారం ఉదయం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో రాష్ట్రంలోనే అత్యంత కనిష్ఠంగా 7.1 డిగ్రీలుగా నమోదయింది. ఇక తిర్యాణిలో 8.2 డిగ్రీలు నమోదయింది. దీంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు మిగతా 2లో..

## సోయాబీన్, మొక్కజొన్న, పత్తి కొనుగోళ్లలో సడలింపులివ్వండి

- మొంథా తుపాను, అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం జరిగింది
- కేంద్రానికి మరోసారి లేఖ రాసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్(జనంసాక్షి):**సోయాబీన్, మొక్కజొన్న, పత్తి కొనుగోళ్లలో సమస్యలపై కేంద్రానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి లేఖ రాశారు. 'మొంథా' తుఫాను, అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం జరిగిందని, రైతులకు ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని కేంద్రానికి ఆయన విజ్ఞప్తి చేశారు. అలానే సోయాబీన్ ఎఫ్ఏక్యూ ప్రమాణాల్లో సడలింపు ఇవ్వాలని మంత్రి తుమ్మల కోరారు. వర్షాల ప్రభావంతో గింజల్లో రంగు మారడం, ముడతలు వచ్చాయి. సంస్థలకు పంటల నాణ్యత సడలింపు ఆదేశాలు ఇవ్వాలని కేంద్రాన్ని మంత్రి తుమ్మల కోరారు.రాష్ట్రంలో 3.66 లక్షల ఎకరాల్లో సోయాబీన్ సాగు చేశారని, ఎకరాకు 7.62 క్వింటాళ్ల సగటు దిగుబడి వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 48,757 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేయడంతో 14,519 మంది రైతులకు లాభం చేకూ



రిందని మంత్రి తెలి పారు. కనీస మద్దతు ధ ర కింద మొత్తం 16.85 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు కు సంస్థలకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పత్తి కొనుగోళ్లలో ఎకరాకు 7 క్వింటాళ్ల పరిమితి అనేది రైతులకు నష్టం చేకూరుస్తుందని, ఆ పరిమితిని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పత్తి తేమ శాతం సడలించి, ఎకరాకు 11.74 క్వింటాళ్ల దిగుబడి ఆధారంగా కొనుగోలు కొనసాగించాలని కేంద్రానికి సూచించారు. పత్తి మొక్కజొన్న, సోయాబీన్ రైతులకు రక్షణ కల్పించేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు విజ్ఞప్తి చేశారు.

మంత్రి కొండా సురేఖ క్షమాపణలు

## పరువునష్టం కేసు ఉపసంహరించుకున్న నాగార్జున

**హైదరాబాద్(జనంసాక్షి):** మంత్రి కొండా సురేఖపై వేసిన పరువు నష్టం దావా కేసును ప్రముఖ సినీ హీరో నాగార్జున వెనక్కి తీసుకున్నారు. తమ కుటుంబంపై సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ వేసిన పరువు నష్టం దావా కేసును ఉపసంహరించుకున్నట్లు నాగార్జున వెల్లడించారు. గతంలో నాగచైతన్య- సమంత విడాకులపై మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2 అక్టోబరు 2024న హైదరాబాద్ మీడియాతో మాట్లాడిన మంత్రి సురేఖ.. నాగచైతన్య- సమంత విడాకులకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ మిగతా 2లో..

# అమెరికా పౌరులకు శిక్షణ ఇచ్చి తిరిగి వెళ్లాల్సిందే..

### విదేశీ కార్మికుల అవసరంపై యుఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బీసెంట్

**వాషింగ్టన్(జనంసాక్షి):**

విదేశీ కార్మికులు అవసరం తమ దేశానికి ఉందని ట్రంప్ ప్రకటన చేసి 24 గంటలైనా గడవక ముందే యుఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బీసెంట్ ట్రంప్ హెచ్-1బీ వీసా కొత్త విధానం ఉద్దేశ్యం బయటపెట్టారు. అమెరికా పౌరులను ఉన్నతమైన ఉద్యోగాలలో నియమించేందుకు విదేశాల నుంచి వలస కార్మికులు తాత్కాలికంగా అమెరికా వచ్చి ఆ దేశ పౌరులకు శిక్షణ ఇచ్చి తిరిగి తమ దేశాలకు వెళ్లాలన్నారు. తద్వారా అమెరికన్స్ ఉన్నతమైన ఉద్యోగాలు చేసే అవకాశం ఉంటుందన్నారు. ట్రంప్ హెచ్-1బీ వీసా విధానం ఉద్దేశ్యం ఇదే అయిఉండొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.ట్రంప్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆ దేశంలో తాత్కాలికంగా స్థిరపడిన విదేశీయులు, చదువుకోసం అమెరికాకెళ్లిన విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఏ సమయంలో మిగతా 2లో..



### ముగిసిన షట్‌డౌన్

అమెరికా చరిత్రలో అత్యధిక కాలం 43 రోజుల పాటు సుదీర్ఘంగా కొనసాగిన ప్రక్రియకు ముగింపు

2లో..

## భారత్,ఆఫ్ఘన్ రెండింటితో యుద్ధం చేస్తాం

ఆ సత్తా మాకు ఉంది

పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు

ఖండించిన భారత్

**ఇస్లామాబాద్(జనంసాక్షి):** పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి తలబిరుసు వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ అటు భారత్, ఇటు ఆఫ్ఘానిస్థాన్ రెండు దేశాలతో ఏక కాలంలో యుద్ధం చేసేందుకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందన్నారు.పాకిస్థాన్ లో జరిగిన ఓ పబ్లిక్ మీటింగ్ లో ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ అంటేనే వివాదాస్పద వ్యాఖ్యలకు, ఉత్తుత్తి మాటలకు పెట్టింది పేరు. ఆపరేషన్ మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org
శుక్రవారం 14.11.2025

## భారత్,ఆఫ్ఘన్ రెండింటితో యుద్ధం చేస్తాం

సిందూర్ సమయంలో సైతం భారత్‌పై ఎన్నో సార్లు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఆయన పాకిస్థాన్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ప్రసంగిస్తూ పడమర దిక్కున భారత్‌తో, తూర్పు దిక్కున అఫ్గానిస్తాన్‌తో ఏకకాలంలో యుద్ధం చేయడానికి పాకిస్థాన్ సిద్ధంగా ఉందన్నారు."తొలిరౌండ్‌లో అల్లా మాకు సహాయం చేశారు. రెండో రౌండ్‌లోనూ ఆయన మాకు అండగా ఉంటార"ని తెలిపారు. కాబూల్‌లోని పాలకులు తలచుకుంటే పాకిస్థాన్ లోని టెర్రరిజాన్ని ఆపవచ్చు కానీ వారు అలా చేయడం లేదని.. దీనికి తగిన రీతిలో బదులిస్తామని హెచ్చరించారు. మంగళవారం పాకిస్థాన్‌లో జరిగిన బాంబుదాడిలో 12 మంది మరణించారు. అది తమ చర్యేనని పాకిస్థాన్ తాలిబన్ గ్రూప్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఖవాజా ఈ వ్యాఖ్యలు చేశారు.ఖండించిన భారత్ అయితే ఖవాజా తాజా వ్యాఖ్యలను భారత్ ఖండించింది. ఆసిఫ్ తన వ్యాఖ్యలతో పరిస్థితుల నుంచే తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, ఆయన స్వరం ఇస్లామాబాద్ భయాన్ని తెలియజేస్తోందన్నారు. ఇటీవల భారత్ లో జరిగిన ఎర్రకోట బాంబ్ బ్లాస్ట్ విషయంలో సైతం ఖవాజా ఆసిఫ్ తలబిరుసుగా మాట్లాడారు. ఆ ప్రమాదం గ్యాసు లీకు వల్ల జరిగిందని, ఆ దాడిని భారత్ రాజకీయం చేస్తోందని వ్యాఖ్యానించారు. పేలుడు పదార్థాల వల్లే ఎర్రకోట కారు పేలుళ్లు జరిగాయని ఫోరెన్సిక్ నివేదికలు ఇచ్చిన సంగతి తెలిసిందే.

## అమెరికా పౌరులకు శిక్షణ ఇచ్చి తిరిగి వెళ్లాల్సిందే..


తమను దేశం వదిలి వెళ్లమంటారో అని కంగారుపడుతున్నారు. ఈనేపథ్యంలో ఇటీవల ఆ దేశం ఆమోదించిన హెచ్-1బీ వీసా బిల్లు దానికి మరింత బలాన్ని చేకూర్చింది. హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుమును లక్షడాలర్లకు పెంచి ఆ దేశంలోకి వచ్చేవారి అవకాశాలను మరింత కఠినతరం చేశారు. అయితే అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బిసెంట్ ఫాక్స్ న్యూస్ కిచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ హెచ్-1బీ పాలసీ వ్యూహం బహిర్గతం చేశారు. అమెరికన్స్ గత 20-30 ఏళ్లుగా తయారీరంగంలోని ఉన్నతమైన ఉద్యోగాలలో లేరు, ఓడలు, సెమీకండక్టర్స్ నిర్మించలేదు. ఆ రంగాలలో వారికి తగినంత ప్రతిభ లేదు. కనుక విదేశాలనుంచి నైపుణ్యత కలిగిన కార్మికులు అమెరికాకు వచ్చి రెండు, ఐదు, ఏడు సంవత్సారాలపాటు అమెరికాలో ఉండి ఆ దేశ కార్మికులకు శిక్షణ ఇచ్చి వెళ్లాలని.. ట్రంప్ నూతన పాలసీ విధానం ఉద్దేశ్యం ఇదే అయి ఉండవచ్చని బీసెంట్ అన్నారు.అలా శిక్షణ పొందిన అనంతరం తిరిగి ఆ ఉద్యోగాలను టేకాఫ్ చేసుకుంటారని అన్నారు. వలస కార్మికులు ఆ దేశంలో ఉండడంతో ఒక్క అమెరికన్ ఉద్యోగం పొందలేకపోతున్నారని తెలిపారు. ట్రంప్ ప్రభుత్వం అమెరికన్ల క్షేమం కొరకే పనిచేస్తుందని లక్ష డాలర్లు లోపల ఆదాయం ఉన్న కుటుంబాలకు పన్నులో రెండువేల డాలర్లు రాయితీ ఇచ్చే అంశం చర్చిస్తున్నామన్నారు. కాగా నిన్న ఫాక్స్ న్యూస్ కిచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ అమెరికన్లకు మ్యానుఫాక్చరింగ్ సెక్టార్ లో తగినంత నైపుణ్యత లేదని ఆ రంగాలలో విదేశీయులను నియమించుకునే అవసరముందని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

## వామ్మో.. చలి

రావాలంటేనే భయపడుతున్నారు. ఉదయం 8 గంటలు దాటినప్పటికీ చలి తీవ్రత తగ్గకపోవడంతో స్కూళ్లు, కార్యాలయాలు, రోజువారీ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. ఇక హైదరాబాద్‌లో అతితక్కువగా హెచ్‌సీయూలో 11.8 డిగ్రీలు రికార్డయింది. రాజేంద్రనగర్‌లో 12.9, మారేడుపల్లిలో 13.6 డిగ్రీల రికార్డయింది. ఉదయం 6 గంటల సమయంలో నగర శివార్లలోని ఇబ్రహీంపట్నంలో 11.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, మరో నాలుగు ఐదు రోజుల్లో చలి తీవ్రత మరింత పరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలో ఎన్నడూ లేనట్టుగా చలి తీవ్రత బాగా పెరిగింది. ఒక్కసారిగా కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మరికొన్ని రోజులూ ఇదే పరిస్థితి ఉంటుందని, చలి మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణ రాష్ట్రం తీవ్ర చలి ప్రభావిత జోన్‌లో ఉందని ఈసారి కూడా అదే పరిస్థితి ఉంటుందని వాతావరణ నిపుణులు తెలిపారు. కనిష్ట ఉష్ణోగ్రతలు 8.5 డిగ్రీల వరకు పడిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇక చలి వాతావరణంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. .రాష్ట్రంలో మరో మూడు నాలుగు రోజుల పాటు చలి తీవ్రత మరింతగా పెరుగుతుందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రతలు 8.5 డిగ్రీల నుంచి 12.5 డిగ్రీల మధ్య నమోదవుతాయని పేర్కొంది. చలి తీవ్రతకు సంబంధించి మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపునకు పడిపోవచ్చని హెచ్చరించింది. మిగతా అన్ని జిల్లాల్లో 10-12.5 డిగ్రీల మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయంటూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కాగా, చలి తీవ్రతతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏజెన్సీ గ్రామాలు వణికిపోతున్నాయి. ఉదయం 9 గంటల వరకు కూడా పొగ మంచు కమ్ముకుంటోంది. ఁూష్ట్రంలో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖ హెచ్చరించింది. రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్లు, సీజనల్ ఫ్లూ పెరిగే అవకాశం ఉండటంతో అలర్ట్‌గా ఉండాలని సూచించారు. జ్వరం, దగ్గు, గొంతు తడి ఆరిపోవడం, నొప్పులు ఉంటే నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. గర్భిణులు, ఐదేండ్లలోపు చిన్నారులు, వృద్ధుల్లో సీజనల్ ఫ్లూ లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని దవాఖానలను సందర్శించాలని కోరారు. అధిక జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటే తక్షణమే దగ్గరలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాలని సూచించారు.


# హైదరాబాద్ సురక్షిత నగరం

లండన్, టోక్యో, దుబాయి, సియోల్ రివర్‌ఫ్రంట్‌ల మాదిరే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని సీఎం అన్నారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, ట్రిపుల్ ఆర్ మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల పురోగతిని వివరించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చైనా 1 మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ అవుతుందని అన్నారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే తక్కువ ఖర్చు, సులభమైన వీసా విధానాలతో దక్షిణాది దేశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రపంచ స్థాయి విద్యా సంస్థలను ఆహ్వానించారు. భారతదేశంలో రోడ్లకు ఎక్కువగా నేతల పేర్లు ఉంటాయని హైదరాబాదులో ఆ ట్రెండ్ ను మార్చాలని తాము అనుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ముఖ్యమైన రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీ పేర్లను పెడతామని సీఎం అన్నారు. హైదరాబాద్‌లో రోడ్లకు నేతల పేర్లు పెట్టే ట్రెండ్ మార్చి.. ప్రముఖ కంపెనీల పేర్లు పెట్టాలని భావిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి విశ్వవిద్యాలయాలు తెలంగాణలో క్యాంపస్‌లు



ఏర్పాటు చేయాలని సీఎం ఆహ్వానించారు. అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన మొదటి ప్రాధాన్యత అని వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా మారనుందన్నారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని పేర్కొన్నారు. మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గత 23 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎం వివరించారు. అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సదస్సు ప్రారంభంలో తెలంగాణరైజింగ్ 2047 విజన్ ను ప్రదర్శించారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం ఢిల్లీలో వార్షిక సమావేశంలో విశేష ఆదరణ పొందింది. గ్లోబల్ ఇన్వెస్టర్లకు పెట్టుబడుల అవకాశాలు వివరించిన సీఎం ప్రసంగం, అంతర్జాతీయ వ్యాపార వర్గాలను ఆకట్టుకుంది. రేవంత్ రెడ్డి విజన్ బోల్డ్, క్లియర్, అచీవబుల్ అని సిస్కో మాజీ సీఈఓ, టెక్ దిగ్గజం జాన్ ఛాంబర్స్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ విజన్ పారదర్శకంగా, సాహసోపేతంగా, సాధించగలిగేలా ఉంది. ఆయన చెప్పిన ప్రాజెక్టులు, వాటి సామాజిక ప్రభావం ఎంతో ప్రేరణాత్మకంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు మా సభ్యులలో అత్యధికులం డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవుతాం అనిడా. ముఖేష్ ఆఘి అన్నారు. తెలంగాణ విజన్‌ను దగ్గరగా తెలుసుకోవాలని మేమంతా ఆసక్తిగా ఉన్నాం. . డిసెంబరు 8,9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కానున్నట్లు అమెరికా-భారత్ వ్యూహాత్మక ఫోరం అధ్యక్షుడు ముఖేష్ ఆఘి తెలిపారు.

## పరువునష్టం కేసు ఉపసహరించుకున్న నాగార్జున



ప్రెసిడెంట్ కేటీఆరే కారణమం టూ సంచలన కామెంట్స్ చేశా రు. తెలంగాణ రాజకీయాల్లో ఈ కామెం ట్స్ తీవ్ర దుమారం రేపాయి. మంత్రి వ్యాఖ్యలపై సీరియస్ అయిన నటుడు నాగార్జున పరువు నష్టం దావా కేసు వేశారు. క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషన్ వేశారు. కేసుపై నాంపల్లి స్పెషల్ కోర్టు గురువారం విచారణ చేపట్టింది. అయితే, కొండా సురేఖ బహిరంగ క్షమాపణ చెప్పడంతో కేసును విత్ డ్రా చేసుకున్నారు నాగార్జున. కాగా, ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా అక్కినేని కుటుంబానికి రెండుసార్లు క్షమాపణ చెప్పారు మంత్రి కొండా సురేఖ.ఈ క్రమంలో మంత్రి కొండా సురేఖపై వేసిన క్రిమినల్ దావాను ప్రముఖ నటుడు నాగార్జున ఉపసంహరించుకున్నారు. నాగార్జున కుటుంబంపై తాను గతంలో చేసిన వ్యాఖ్యలపై చింతిస్తున్నానని మంత్రి కొండా సురేఖ ఎక్స్‌లో పోస్టు చేశారు. నాగార్జున, ఆయన కుటుంబాన్ని బాధ పెట్టాలనే ఉద్దేశంతో నేను ఆ వ్యాఖ్యలు చేయలేదు. వారిని ఇబ్బందిపెట్టాలని కాని, వారి పరువు-ప్రతిష్టలకు భంగం కలిగించాలన్నది కాని నా ఉద్దేశం కాదు. నాగార్జున కుటుంబంపై నేను చేసిన వ్యాఖ్యల్లో ఏదైనా పొరపాటు ఉంటే అందుకు చింతిస్తున్నా. నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని పేర్కొన్నారు. ఈ క్రమంలో మంత్రిపై దాఖలు చేసిన పరువునష్టం కేసును ఉప సంహరించుకుంటున్నట్టు నాగార్జున తెలిపారు.

## ప్రజలకే జవాబుదారీగా ఉంటాం



పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన వారు తాము లేకపోతే కరెక్టే ఉండదు రాష్ట్రం అంధకారమవుతుందని అన్న విషయాన్ని గుర్తు చేశారు.రాష్ట్రంలో ఎంత విద్యుత్తు డిమాండ్ పెరిగినా ఎలాంటి ఇబ్బంది లేకుండా కరెంటు సరఫరా చేసే వ్యవస్థను నెలకొల్పాం, ఈఈ రాష్ట్రంలో కరెంటు ఉత్పత్తి చేసింది రైతులకు ఉచితంగా ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలే అని అన్నారు. 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు ఇస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వమే అని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎంత త్వరితగతిన ఇల్లు నిర్మించుకుంటే అంత వేగంగా బిల్లులు మంజూరు చేసుకుంటూ పోతాం అన్నారు. ఎన్నికలకు ముందు తాను చేపట్టిన పీపుల్స్ పాదయాత్రలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక మందిని కలిసి మాట్లాడినట్టు తెలిపారు. ఇల్లు లేని పేదలు 10 సంవత్సరాల పాటు టిఆర్ఎస్ పాలనలో ఎదురుచూసి కళ్ళు కాయలు కాసి అలసిపోయామని ప్రజలు తన చేయి పట్టుకొని తెలిపిన విషయాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గుర్తు చేశారు. ఆనాడే పాదయాత్ర సందర్భంగా తన చేయి పట్టుకొని ముదిగొండ మండలంలో ఆవేదన వ్యక్తం చేసిన ప్రియాంక అనే ఆడబిడ్డకు తాను హామీ ఇచ్చాను, నీ ఒక్కదానికే కాదు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇల్లు లేని పేదలందరికీ ఐదు లక్షలతో ఇల్లు నిర్మిస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే రాష్ట్రవ్యాప్తంగా ఇల్లు లేని వాళ్ళందరికీ ఇల్లు నిర్మిస్తున్నాం, ఆనాడు పాదయాత్రలో ఇచ్చిన మాట మేరకు ముదిగొండ మండలానికి చెందిన ప్రియాంకకు ఇల్లు కేటాయించామని తెలిపారు. ఒకటి కాదు రెండు కాదు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మొదటి దశలో 3500 చొప్పున నాలుగున్నర లక్షల ఇళ్లు నిర్మిస్తున్నాం అని డిప్యూటీ సీఎం వివరించారు. ఈరోజు తాను వచ్చే క్రమంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుని కలిసి వారితో ఆనందాన్ని పంచుకున్న విషయాన్ని వివరించారు. ఈ ప్రభుత్వం ప్రతి పైసా ప్రజల అవసరాలకు ఖర్చు పెడుతుంది, ఎట్టి పరిస్థితుల్లో దోపిడీకి గురి కానివ్వం, ప్రజల సొమ్ము దోపిడికి గురైతే అత్యంత ప్రమాదకరం అన్నారు. మధిర నియోజకవర్గం లోని బోనకల్లు మండలం లక్ష్మీపురంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు వడివడిగా సాగుతున్నాయి మధిర నియోజకవర్గంలో 60 వేల మంది మహిళా సభ్యులు ఉన్న ఇందిరా మహిళ డైరీ దేశానికి తలమానికంగా ఉండబోతోందనీ డిప్యూటీ సీఎం వివరించారు. నియోజకవర్గంలోని ఒక్కొక్క మహిళకు రెండు గేదలు పంపిణీ చేసి దేశంలోనే ప్రతిష్టాత్మక డెయిరీనీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దశలవారీగా గేదెల కొనుగోలు కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. దేశం అంతా మధిర నియోజకవర్గానికి రావాలి ఇక్కడ మహిళలు నిర్వహించే డెయిరీ నీ సందర్శించాలి అన్నారు. రెండు సంవత్సరాల్లో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసాం, లక్షలాది సంఖ్యలో ప్రైవేటు ఉద్యోగాల భర్తీ కోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జాబ్ మేళాలు నిర్వహిస్తోందనీ డిప్యూటీ సీఎం తెలిపారు. గుడి, బడి, మార్కెట్ కు మహిళలు ఎక్కడికి వెళ్లినా రూపాయ ప్రయాణం ఖర్చు లేకుండా ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉచిత రవాణా సౌకర్యం కల్పించామని తెలిపారు. రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలు ఉండగా 96 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, ఈ సన్న బియ్యం బహిరంగ మార్కెట్లో కిలో 55 రూపాయలు పలుకుతుంది అన్నారు. ప్రతి ఒక్కరికి ఆరు కేజీల చొప్పున ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఆరు కిలోలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్లు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో ఈ ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు.ఎక్కడ ఉన్న ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాను, మధిర నియోజకవర్గ ప్రజలు వేసిన ప్రతి ఓటుకు గౌరవం తీసుకువస్తాను అన్నారు. మధిర ప్రజల ఇంటి బిడ్డగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తానని తెలిపారు.

## ఐదు రాష్ట్రాల్లో ఎన్ఐఏ సోదాలు

**అల్‌ఖైదాతో సంబంధం ఉన్న బంగ్లాదేశీయుల గుర్తింపు**

బృందాలు సోదాలు చేసినట్లుగా ఎన్ఐఏ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఈ కేసు 2023లో నమోదైంది. నలుగురు బంగ్లాదేశ్ జాతీయులు మొహమ్మద్ సోజిబ్ మియాన్, మున్నా ఖలీద్ అన్సారీ, అజ్రుల్ ఇస్లాం, అబ్దుల్ లతీఫ్ పేర్లు ఇందులో ఉన్నాయి. నిందితులు ఫేక్ ఐడీలను ఉపయోగించి బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించారు. వారికి నిషేధిత అల్ ఖైదా ఉగ్రవాద సంస్థతో సంబంధం కలిగి ఉన్నట్లుగా గుర్తించారు. బంగ్లాదేశ్‌లోని అల్-ఖైదా కార్యకర్తలకు నిధులు సేకరించడం, బదిలీ చేసినట్లుగా తేలింది. ముస్లిం యువతను ఉగ్రవాదం వైపు ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించారు. ఎన్ఐఏ నవంబర్ 10, 2023న అహ్మదాబాద్‌లోని ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. గతంలో మహారాష్ట్ర యాంటీ-టెర్రరిజం స్క్వాడ్ నిషేధిత ఉగ్రవాద సంస్థలు అల్-ఖైదా, భారత ఉపఖండంలోని అల్-ఖైదాతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ పుణెళికు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను అరెస్టు చేసింది. ఏటీఎస్ థానేకు చెందిన ఓ ఉపాధ్యాయుడిని ప్రశ్నించింది. అక్టోబర్ 27న ఏటీఎస్ 37 ఏళ్ల జుబైర్ హంగర్గేకర్‌ను అరెస్టు చేసింది. అతను నిషేధిత సంస్థలతో సంబంధం కలిగి ఉన్నాడని, రాడికలైజేషన్ కార్యకలాపాల్లో పాల్గొన్నాడని ఆరోపణలున్నాయి. దర్యాప్తులో ఏటీఎస్ అతని పాత్రతో పాటు పాకిస్తానీ కాంటాక్ట్ నంబర్‌ను గుర్తించారు.

# నేడు జూబ్లీహిల్స్ ఓట్ల లెక్కింపు

సూపర్ వైజర్‌లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, కౌంటింగ్ మైక్రో అబ్జర్వర్స్ ఉంటారని అన్నారు. ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా, ఈసీ యాప్ ద్వారా అప్డేట్ ఇస్తామని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు, వారి ఏజెంట్లకు, కౌంటింగ్ ఏజెంట్ లకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఇతరులకు ప్రవేశం ఉండదని జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ స్పష్టం చేశారు.జాయింట్ సిపి తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ.. నేడు కౌంటింగ్ కోసం ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అన్ని విభాగాల పోలీసు బృందాలు అందుబాటులో ఉంటాయని, కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, రిటర్నింగ్ అధికారి పి సాయిరాం, విజిలెన్స్ అదనపు ఎస్పీ నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గెలుపుపై ఎవరి అంచనాలు వారివే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం మరో 24 గంటల్లో తేలనుంది.అధికార, విపక్షాల మధ్య నువ్వా నేనా అన్నట్లు సాగిన సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోవాలని బీఆర్ఎస్, ఎలాగైనా జూబ్లీహిల్స్‌పై జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డి పోరాడాయి. సుమారు నెలరోజుల పాటు పార్టీలు తమ నాయకత్వాన్ని నియోజకవర్గంలో మోహరించాయి. విమర్శలు, ప్రతివిమర్శలు, సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ రేపిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలిచేదెవరో శుక్రవారం తేలనుంది. ఎగ్జిట్ పోల్ సర్వేతో కాంగ్రెస్‌లో ఉత్సాహం నెలకొంది. పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయమని ధీమాలో అధికార కాంగ్రెస్ ఉంది. అధికార, విపక్షాల మధ్య నువ్వా నేనా అన్నట్లు సాగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం రాజకీయ పార్టీల భవిష్యత్ తేల్చనుంది. సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోవాలని బీఆర్ఎస్ , ఎలాగైనా జూబ్లీహిల్స్‌పై జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డి పోరాడాయి. బిజెపి కూడా గెలిచి తీరాలన్న పట్టుదలతో పోరాడింది. సుమారు నెలరోజుల పాటు పార్టీలు తమ నాయకత్వాన్ని నియోజకవర్గంలో మోహరించాయి. సాధారణంగా ఎక్కడైనా ఉప ఎన్నికలో భారీగా పోలింగ్ శాతం నమోదు అవుతుంటుంది. కానీ జూబ్లీహిల్స్‌లో మాత్రం ఒక్క శాతమే ఓటింగ్ పెరగడంతో.. గెలుపు ఎవరిని వరిస్తుందా అనేది తెలియని పరిస్థితి. తామే గెలుస్తామంటూ కాంగ్రెస్ పార్టీ, కాదు కాదు తామే గెలుస్తామంటూ బీఆర్ఎస్ పార్టీ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. సర్వేలు అన్నీ తమ వైపే ఉన్నాయని కాంగ్రెస్ నేతలు చెబుతుండగా.. సైలెంట్ ఓటింగ్ జరిగిందని.. తద్వారా తమ విజయం ఖాయమని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. మొత్తంగా శుక్రవారం మధ్యాహ్నం తుది ఫలితం వెల్లడయ్యే వరకు ఉత్కంఠ తప్పని పరిస్థితి. ఇప్పటికే అధికారులు ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తిచేశారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో లెక్కింపు ప్రారంభం కానుంది. పది రౌండ్లలో లెక్కింపు పూర్తి చేయాలని నిర్ణయించారు.



ఉప ఎన్నికలో లక్షా 94 వేల 632 ఓట్లు పోలయ్యాయి. వీటిని పది రౌండ్లుగా 42 టేబుళ్లపై లెక్కింపు జరుపనున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్, ఆ తర్వాత 103 హోం ఓటింగ్‌లను లెక్కించిన తర్వాత ఈవీఎంల్లోని ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. సాధారణంగా 14 టేబుళ్లపై కౌంటింగ్ జరుగుతుంది. ఉప ఎన్నిక కావడం, ఉద్యోగులు అందుబాటులో ఉండడంతో ఎక్కువ టేబుళ్లు ఏర్పాటు చేసి త్వరగా లెక్కింపు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఉదయం 8.45 గంటలకల్లా తొలి రౌండ్ ఫలితం వెల్లడి కానుంది. మధ్యాహ్నం ఒంటి గంటలోపే తుది ఫలితాన్ని ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని మొత్తం 10 రౌండ్లుగా కొనసాగించనున్నారు. ఒక్కో రౌండ్ వారీగా ఫలితాలను వెల్లడించనున్నారు. ఎన్నికల బరిలో 58 అభ్యర్థులతో పాటు నోటాకు పోలైన ఓట్ల సంఖ్యను అధికారులు వెల్లడించనున్నారు. కాగా కౌంటింగ్ కేంద్రంలో పటిష్టమైన మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. దీనికితోడు సీసీ కెమెరాలతో పర్యవేక్షణ, సాయుధ బలగాలతో 24గంటల పహారా ఉండనుంది. స్టేడియానికి 100 మీటర్ల మేరలో ఆంక్షలు ఆమల్లో ఉంటాయని అధికారులు తెలిపారు.

# వరుస పేలుళ్లకు ఉగ్రవాదుల కుట్ర

గుర్తించారు. ఇప్పటికే బ్రెజ్జా, స్విఫ్ట్, ఎకోస్పోర్ట్ వంటి కార్లను పోలీసులు గుర్తించారు. బ్రెజ్జా కారు హర్యానాలోని ఫరీదాబాద్‌లోని అల్-ఫలా హ్ స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ క్యాంపస్‌లో కనుగొనబడింది. అలానే ఎకోస్పోర్ట్ కారు బుధవారం రాత్రి హర్యానాలోని ఫరీదాబాద్‌లో కనుగొనబడింది. మరోవైపు ఈ 32 కార్ల ద్వారా నాలుగు వేర్వేరు లొకేషన్లలో దాడులకు వినియోగించాలని మొత్తం ఎనిమిది మంది అనుమానిత ఉగ్రవాదులు ప్రణాళిక వేసినట్లు ఇంటెలిజెన్స్ అధికారులు వెల్లడించారు.

**ఫరీదాబాద్ మాడ్యూల్‌లో మరో డాక్టర్**

ఫరీదాబాద్ మాడ్యూల్‌కు సంబంధించి మరో డాక్టర్‌ను భద్రతాధికారులు అరెస్టు చేశారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన కార్డియాలజిస్ట్ విద్యార్థి డాక్టర్ మహ్మద్ ఆరిఫ్‌ను కాన్పూరులో అదుపులోకి తీసుకున్నారు. ఇతడికి ఇటీవల అరెస్టయిన డాక్టర్ షాహిన్‌తో దగ్గర సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిద్దరూ నిత్యం టచ్‌లో ఉండినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు.

**పేలిన కారులో ఉన్నది ఉమర్ నబీయే**

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడుకు సంబంధించి మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. బాంబు పేలుడు సంభవించిన ఐ20 కారులో ఉన్నది డాక్టర్ ఉమర్ నబీ అని తేలింది. కారులో లభించిన నమూనాలతో అతని డీఎన్ఏ సరిపోలడంతో కారు నడిపింది నబీయేనని అధికారులు నిర్ధారణకు వచ్చారు.

**డాక్టర్ షాహీన్ వ్యవహారంపై కుటుంబం ఆశ్చర్యం**

ఢిల్లీ పేలుళ్ల ఘటనకు కారణమైన కీలక నిందితుల్లో ఒకరైన డాక్టర్ షాహీన్ పట్ల ఆమె కుటుంబ సభ్యులు మాట్లాడిన తీరు విస్మయం వ్యక్తం చేస్తోంది. షాహీన్‌కు ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే విషయాన్ని నమ్మలేకపోతున్నామని.. కనీసం అలాంటి సంఘటనకు సంబంధించిన ఆనవాళ్లు కూడా తెలియవని ఆమె కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ప్రస్తుతం తాము లక్నోలోని దాలిగంజ్ ప్రాంతంలోని ఓ ఇరుకైన సందులో నివాసముంటున్నామని, తాముండే ప్రాంతానికి ఢిల్లీకి సుమారు 550 కిలోమీటర్ల దూరం ఉంటుందని షాహీన్ తండ్రి సయ్యద్ అహ్మద్ అన్సారీ అన్నారు.

**పేలుడు ఘటనలో 13కు చేరిన మృతుల సంఖ్య**

దేశ రాజధాని ఢిల్లీలో పేలుడు ఘటనలో మృతుల సంఖ్య పెరిగింది. లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో వ్యక్తి మరణించారు. దీంతో పేలుడు ఘటనలో మరణించిన వారి సంఖ్య 13కి పెరిగింది. సోమవారం సాయంత్రం ఢిల్లీలోని చారిత్రక కట్టడం ఎర్రకోట సమీపంలో భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. సాయంత్రం 7 గంటల సమయంలో భారీ శబ్దంతో పేలుడు జరిగింది. ఈ ఘటనలో అక్కడికక్కడే తొమ్మిది మంది మరణించారు. మరో 20 మంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరుసటి రోజు ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. ఇప్పుడు మరో వ్యక్తి మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. మిగతావారికి ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది.

**పరారీలో కశ్మీర్ వైద్యుడు డా.ముజఫ్ఫర్**

దిల్లీలోని ఎర్రకోట సమీపంలో పేలుడు ఘటనతో ముడిపడి ఉన్న ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే టెర్రర్ మాడ్యూల్‌తో సంబంధం ఉన్న, జమ్మూకశ్మీర్‌లోని కాజీగుండ్‌కు చెందిన డా.ముజఫ్ఫర్‌పై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని ఇంటర్‌పోల్ ను ఆశ్రయించారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు వైద్యులు సహా ఎనిమిది మంది అరెస్టయ్యారు. వారిలో డా.ఆదిల్ ఒకడు. అతడి సోదరుడే డా.ముజఫ్ఫర్.నిందితులను విచారిస్తున్న క్రమంలో ముజఫ్ఫర్ పేరు బయటకు వచ్చింది. 2021లో తుర్కియేను సందర్శించిన డా.ముజమ్మిల్, డా.ఉమర్ నబీ తదితర వైద్యుల బృందంలో ఇతడు కూడా ఉన్నట్లు నిందితులు తెలిపారు. ఈ బృందం తుర్కియేలో 21 రోజుల పాటు ఉంది. ఎర్రకోట వద్ద పేలుడుకు కారణమైన కారును డా.ఉమర్ నబీనే నడుపుతున్నట్లు సీసీటీవీ దృశ్యాలను అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే.

## ఢిల్లీ పేలుడు ముమ్మాటికి ఉగ్రదాడే

**వాషింగ్టన్(జనంసాక్షి):** దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట బాంబు సంచలనంగా మారింది. తాజాగా ఢిల్లీ పేలుళ్ల ఘటనపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సంచలన వ్యాఖ్యలు చేశారు.ఇది ముమ్మాటికి ఉగ్రదాడే అని తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు నిర్వహించడంలో భారత్‌కు ఎవరి సాయం అవసరం లేదు.. అధికారుల పనితీరు ప్రశంసనీయం అని కొనియాడారు.అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో బుధవారం కెనడాలో జరిగిన జీ-7 విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మార్కో రుబియో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన.. పేలుడుకు సంబంధించి దర్యాప్తునకు సాయం చేసేందుకు తాము ముందుకొచ్చామని, కానీ ఆ అవసరం భారత్‌కు లేదని వ్యాఖ్యానించారు. భారత అధికారులు అసాధారణమైన వృత్తి నైపుణ్యంతో దర్యాప్తు చేస్తున్నట్లు కనిపిస్తోంది అంటూ వ్యాఖ్యలు చేశారు.ఇక, కెనడాలో జరుగుతున్న జీ-7 సమావేశాల సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, మార్కో రూబియోతో భేటీ అయ్యారు. ఇరువురి మంత్రులు అనేక ద్వైపాక్షిక, ప్రపంచ సమస్యలపై చర్చించారు. ఢిల్లీ పేలుడు విషయం కూడా వారు చర్చించినట్లు.. రూబియోతో భేటీ గురించి జైశంకర్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.ఇదిలా ఉండగా.. ఢిల్లీలోని ఎర్రకోట పేలుడు ఘటనలో 12 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో గాయపడిన మరో 17 మందికి లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ఆస్పత్రి ఆస్పత్రిలో చికిత్స అందుతోంది.

## ముగిసిన షట్‌డౌన్

**వాషింగ్టన్(జనంసాక్షి):** అగ్రరాజ్యం అమెరికాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా చరిత్రలో అత్యధిక కాలం 43 రోజుల పాటు సుదీర్ఘంగా కొనసాగిన ఆర్థిక 'షట్‌డౌన్'కు ముగింపు పడింది.అమెరికాలో షట్‌డౌన్‌ను ఎత్తివేసే ప్రభుత్వ ఫండింగ్ బిల్లుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం రాత్రి (అమెరికా కాలమానం ప్రకారం) సంతకం చేశారు. దీంతో షట్‌డౌన్‌కు అధికారికంగా ముగింపు లభించిందిఇక, అ?ంతకుముందు.. అమెరికా ప్రతినిధుల సభ షట్‌ధౌన్ ఎత్తివేతకు సంబంధించి బిల్లును ఆమోదించింది. ప్రతినిధుల సభలో 222-209 తేడాతో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. అనంతరం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం కోసం బిల్లును పంపింది.ఈ షట్‌డౌన్ 2025 అక్టోబర్ 1 నుంచి అమెరికాలో ఆర్థిక వృద్ధి, ఫెడరల్ సర్వీసులు, ప్రజల జీవనాలపై తీవ్ర ప్రభావం చూపింది. డెమొక్రటిక్ పార్టీ ఆఫర్డబుల్ కేర్ యాక్ట్ (ఏసిఏ) సబ్సిడీల విస్తరణ కోరినప్పటికీ, రిపబ్లికన్ నేతలతో సమన్వయం చేసుకుని ఈ డీల్ సాధ్యమైంది. ఈ ఆమోదం ద్వారా దేశం మొత్తం స్థిరత్వాన్ని పొందుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.ఈ షట్‌డౌన్ కారణంగా సుమారు 1.4 మిలియన్ ఫెడరల్ ఉద్యోగులు ఫర్లో చేయబడి, వారికి జీతాలు ఆలస్యం అయ్యాయి. సప్లిమెంటల్ న్యూట్రిషన్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ (ఎస్ఎన్ఏపి) వంటి ఆహార సహాయ పథకాలు 42 మిలియన్ అమెరికన్లకు ఆటంకం కలిగించాయి.

## తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల

స్వీకరణకు తుది గడువు నవంబర్ 29వ తేదీతో ముగియనుంది. జనవరి 3 నుంచి 31వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాగా.. 2025 ఏడాదికి సంబంధించి తొలి విడత టెట్ నోటిఫికేషన్ గత జూన్‌లో విడుదల చేశారు. ఇప్పటికే పరీక్షలు పూర్తి చేయగా.. జులై 22న ఫలితాలు సైతం వెల్లడించారు. తాజాగా రెండో విడత టెట్ నోటిఫికేషన్ గురువారం విడుదల చేశారు. ఇక ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు సైతం టెట్‌లో అర్హత సాధించాలంటూ ఇప్పటికే సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో తమ ఉద్యోగాల్లో కొనసాగాలంటే.. టీచర్లంతా ఈ టెట్ పాస్ కావాల్సి ఉంది. ఈ పరీక్షకు శుక్రవారం ( నోటిఫికేషన్ విడుదల చేస్తారు. శనివారం నుంచి నవంబర్ 29 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహించాల్సి ఉండగా.. ఈ ఏడాది జూన్‌లో తొలి విడత పరీక్షలు నిర్వహించి.. జులై 22న ఫలితాలు వెల్లడించిన విషయం తెలిసిందే. రెండో విడత టెట్‌కు శనివారం నుంచి దరఖాస్తుల పక్రియ మొదలుకానుంది.

# జూబ్లీహిల్స్‌లో ధర్మమే గెలుస్తుంది

- రియల్ ఎస్టేట్‌ను సర్వనాశనం చేశారు
- రూ.3.48వేల కోట్ల అప్పులతో ఆర్థిక అత్యాచారం
- సిఎం రేవంత్‌పై ఎమ్మెల్సీ దాసోజు విమర్శలు




హైదరాబాద్, నవంబర్13 (జనంసాక్షి) : ఎన్ని అక్రమాలు చేసినా జూబ్లీహిల్స్‌లో ధర్మమే గెలుస్తుందని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కీలక వ్యాఖ్యలు చేశారు. బైపోల్స్‌లో ఎంఐఎం కూడా అక్రమాలకు పాల్పడి కాంగ్రెస్‌కు సహకరించిందని ఆరోపించారు. పోలీసులు బోగస్ ఓటింగ్‌కు సహకరించటం ప్రత్యక్షంగా చూశామన్నారు. కాగ్ రిపోర్ట్ సీఎం రేవంత్ రెడ్డి బట్టలు విప్పేసిందన్నారు. అప్పులు భారీగా తెచ్చిన రేవంత్.. ఆర్థిక అత్యాచారానికి పాల్పడ్డారంటూ వ్యాఖ్యలు చేశారు. అనుభవం లేని ముఖ్యమంత్రి ఉంటే.. ఇంతకంటే ఏం జరుగుతుందన్నారు. రేవంత్ రెడ్డి.. రియల్ ఎస్టేట్‌ను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. హైడ్రా పేరుతో ఆర్ఆర్ టాక్స్‌తో దోపిడీ జరుగుతుందని ఆరోపణలు గుప్పించారు. రెండేళ్ళల్లో రూ.3.48వేల కోట్ల అప్పులు తెచ్చారన్నారు. పార్టీ ఫిరాయింపుల విచారణ సందర్భంగా సందర్శకులు, మీడియాపై నిషేధం సరికాదని అన్నారు. ఇది అసెంబ్లీ స్పీకర్, ముఖ్యమంత్రి రేవంత్ సొంత వ్యవహారం కాదని చెప్పుకొచ్చారు. దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్లు ఉంది వ్యవహారం అంటూ కామెంట్స్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు , మాజీ ఎంపీలు మాజీ ఎమ్మెల్సీలకు ప్రవేశాన్ని నిషేధించడం ఏంటని ప్రశ్నించారు. కేసు వాదిస్తున్న అడ్వకేట్లను సెల్ ఫోన్‌లు తీసుకురావద్దని హుకుం జారీ చేయటం సరికాదన్నారు. స్పీకర్ కార్యాలయం విడుదల చేసిన బులెటిన్ రాజ్యాంగ విరుద్ధమన్నారు. సుప్రీంకోర్టులో ఫుల్ బెంచ్ వాదనలు జరిగినప్పుడు కూడా సెల్ ఫోన్లు అనుమతిస్తారని తెలిపారు. తక్షణమే బులెటిన్ ఎత్తి వేయాలని స్పీకర్‌కు లేఖ రాసినట్లు చెప్పారు. ఫిరాయింపు విచారణను లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ప్రజలు ప్రత్యక్ష్యంగా వీక్షించే అవకాశమివ్వాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల వాదనల గురించి ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరముందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ వ్యాఖ్యలు చేశారు.

# ప్రాణాలు తీసిన ఇసుక లారీ

- ఇసుక లారీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి





మంగపేట నవంబర్ 13(జనంసాక్షి) : ఇసుక లారీ ఢీ కొట్టడంతో దుర్గం బాలకృష్ణ (35) అనే యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కమలాపురం ఆటో స్టాండ్ సమీపంలోనీ ఫాతిమా చికెన్ సెంటర్ వద్ద సాయంత్రం 6 గంటలకు చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలకృష్ణ రోజువారి పనులలో భాగంగానే తాను కమలాపురం శివారులోని కవ్వాలకుంట వద్ద నుండి పొలం పనులు ముగించుకొని తిరిగి వస్తున్న క్రమంలో మండలంలోని వాడగూడెం, చుంచుపల్లి, ఏటూరునాగారం మల్లూరు ఇసుక క్వారీల నుంచి ఇసుకను తీసుకెళ్తున్న గుర్తు తెలియని లారీ అతి వేగంతో బాలకృష్ణను ఒక్కసారిగా ఢీ కొట్టడంతో ఎడమ చేయి, తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. మృతుడిని అక్కడి నుండి పోస్టుమార్టం నిమిత్తం సామాజిక ఆసుపత్రికి తరలించారు.

# 18న రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మెన్ కరీంనగర్ పర్యటన



కరీంనగర్ (జనంసాక్షి) : ఈ నెల 18న రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ ఆజ్మతుల్లా హుస్సేన్ కరీంనగర్ పర్యటన సందర్భంగా జిల్లా వక్ఫ్ బోర్డు ప్రొటెక్షన్ అండ్ డెవెలప్ మెంట్ కమిటీ చైర్మన్ సమద్ నవాబ్ నగరంలోని హోటల్ మైత్రిలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వక్ఫ్ బోర్డు ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ సమద్ నవాబ్ మాట్లాడుతూ ఈ నెల 18న రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ ఆజ్మతుల్లా హుస్సేన్, వారి కమిటీ సభ్యులు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించి పర్యటనలో భాగంగా నగరంలోని కరీంనగర్ ఫంక్షన్ హాల్ లో ఉమిద్ పోర్టల్ వక్ఫ్ కు సంబంధించిన మూడు అంశాల మీద చర్చ నిర్వహించనున్నారు. వాటికి సంబంధించి ఈ సమావేశానికి హాజరయ్యే సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంతో పాటు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ అవగాహన సదస్సుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఈద్గా, దర్గా, ఖబ్రస్తాన్ ,మజీద్, మదర్సా కమిటీ అధ్యక్షులు, సభ్యులు, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ నేతలు మైనారిటీ ప్రజలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ పత్రిక విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి తాజుద్దీన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు యం.డి. లయిక్, అబ్దుల్ రెహమాన్, ఎండి చాంద్, ఇర్ఫాన్, మొహమ్మద్ ఖలీముద్దీన్, మహమ్మద్ ఆమేర్, మన్సూర్, తవక్కలి తదితరులు పాల్గొన్నారు

# ఎయిర్‌పోర్ట్ పనుల్లో జాప్యం జరగకూడదు

- చిన్న చిన్న సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలి
- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- మామునూరు ఎయిర్పోర్ట్ స్థల విస్తరణ పనుల పరిశీలన



వరంగల్ ఈస్ట్, నవంబర్ 13 (జనంసాక్షి) : ఓరుగల్లు ప్రజల విమానాశ్రయం కల త్వరలోనే నెరవేరబోతోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ సత్య శారద, ఇరిగేషన్, ఆర్ అండ్ బి అధికారులతో కలసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మామునూర్ ఎయిర్ పోర్టు స్థల విస్తరణ పనులు పరిశీలించారు. నక్కల పల్లి చెరువు, గాడిపల్లి చెరువులతో పాటు ఎయిర్ పోర్ట్ కు వెళ్ళే రోడ్లను ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్వయంగా సందర్శించి పరిశీలించారు. మామునూరు ఎయిర్పోర్ట్ పనుల్లో ఎక్కడ జాప్యం లేకుండా చూడాలని అధికారులకు ఎంపీ సూచించారు. అనంతరం అధికారులు మ్యాప్ ద్వారా స్థల విస్తరణ పనులను ఎంపీ కి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్యగారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ప్రత్యేక చొరవతో విమనాశ్రయం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. మామునూరులో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు ప్రణాళిక రూపకల్పన చేయడం జరిగిందని అన్నారు. ప్రయాణికుల సేవలతో పాటు కార్గో సేవలను సైతం అందించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్‌ను రాష్ట్ర రెండో రాజధానిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు పక్కనే ఉన్నందున ఎయిర్ పోర్ట్ సర్వీసులు ప్రారంభమైతే వరంగల్ ప్రగతి లో దూసుకుపోతుందన్నారు.

# పేదల తిరుపతి మీసాల రాయుడు

- కురుమూర్తి స్వామి వారి సేవలో స్పీకర్ ప్రసాద్, అనిల్ కుమార్ యాదవ్



హైదరాబాద్ (జనంసాక్షి) : కురుమూర్తి స్వామి ఆశీస్సులు ప్రజా ప్రభుత్వంపై ఉండాలని శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బ్రహ్మోత్సవం సందర్భంగా స్పీకర్‌తోపాటు మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం స్పీకర్ విలేకరులతో మాట్లాడారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో ఆ భగవంతుడు ముఖ్యమంత్రి, ప్రజా ప్రభుత్వం కి శక్తి ప్రసాదించాలని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మరియు రెండోవ సారి అధికారంలోకి రావాలని కోరినట్లు తెలిపారు. దేవరకద్ర నియోజకవర్గంకి విచ్చేసిన స్పీకర్ ప్రసాద్ కుమార్, అనిల్ కుమార్ యాదవ్ లను టీపీసీసీ కార్యదర్శి సామల్ కార్తీక్ నివాసంలో స్థానిక ఎంఎల్ఏ జీఎంఆర్ సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు మేఘ రెడ్డి, ఎన్నం శ్రీనివాస్ రెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# డీజీ స్మైల్ స్కూల్ యజమాని మండ శ్రీనివాస్‌పై దాడి గర్హనీయం

- పెప్సీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్

వరంగల్ (జనంసాక్షి) : హన్మకొండలోని డిజీ స్మైల్ పబ్లిక్ స్కూల్ యజమాని, స్వసంఘీయులు, పెరిక కుల బిడ్డ మండ శ్రీనివాస్ వర్మ పై పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు చేసిన దాడిని పెరిక కుల ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పెప్సీ) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ తీవ్రంగా ఖండించారు. ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు లేక,పొట్టకూటి కోసం పాఠశాల నడుపుతూ, ఎంతోమంది బడుగులకు ఉచిత విద్య అందించిన మండ శ్రీనివాస్ పై అకారణంగా చెయ్యి చేసుకొని, మానవ సంబంధాలు మంట కల్పినారని ఆవేదన వ్యక్తం చేసారు. అభ్యుదయ భావాలతో, విద్యార్థి చైతన్యం కోసం పనిచేస్తున్న సంస్థకు చెడ్డ పేరు తెచ్చారని,వారిపై రాష్ట్ర కమిటీ విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సంఘానికి విజ్ఞప్తి చేసారు. నిజంగానే మహాసభ పేరుతో సామరస్యంగా అడగాల్సిన చందాలు రసాభసా చేసే హక్కు ఎవరిచ్చారని పెప్సీ, వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సంఘని మల్లేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిప్పన సిద్ధులు, రాష్ట్ర కోశాధికారి అప్పని సతీష్ కుమార్,జిల్లా అధ్యక్షులు ఆక రాధకృష్ణ, ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారి శ్రీరాం వీరయ్య సంయుక్త ప్రకటనలో ప్రశ్నించారు.

# ప్రభుత్వ పథకాలను అర్హులైన పేదలకు అందిస్తాం

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ఖానాపూర్ నవంబర్ 13 (జనం సాక్షి) : ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందేలా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తో కలిసి నియోజకవర్గానికి సంబంధించి వివిధ అభివృద్ధి పనులు, పథకాల అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు మార్గ నిర్దేశం చేస్తున్నామన్నారు. వివిధ శాఖల ఇంజనీరింగ్, ఏజెన్సీల ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తే సదరు కాంట్రాక్టర్ ను మార్చేందుకు వెనకడుగు వేయవద్దని పేర్కొన్నారు. ప్రజలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, త్రాగునీరు, వంతెనలు, గృహాలు, విద్యుత్ అందించి, వారి జీవన ప్రమాణాలు పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏ కారణాల చేతనైనా అభివృద్ధి పనులు ఆగితే, వెంటనే తమ దృష్టికి తేవాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ మాట్లాడుతూ పథకాల ద్వారా పేదల అభ్యున్నతి సాధించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. ఇండ్లు లేని నిరుపేదలందరికీ సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించిందని గుర్తు చేశారు. మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ వెంటనే పూర్తి చేయాలని అన్నారు. నియోజకవర్గంలోని మండలాలలో మంజూరైన ఇండ్లు, నిర్మాణంలో ఉన్న ఇండ్లకు సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# ఢిల్లీలో మరోమారు పేలుడు శబ్దం

- బస్సు టైర్ పేలినట్లు అధికారుల గుర్తింపు

న్యూఢిల్లీ, నవంబర్13 (జనంసాక్షి) : ఢిల్లీలో పేలుడు ఘటనతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ఘటనతో ఢిల్లీ వాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భారీ కుట్రకు ఉగ్రవాదులు ప్లాన్ చేశారని తేలడంతో నగర వాసులు భయంతో వణికిపోతున్నారు. ఈ క్రమంలో ఎలాంటి పేలుడు శబ్దం వినిపించినా ఉలిక్కి పడుతున్నారు. తాజాగా ఢిల్లీలో తాజాగా భారీ శబ్దం కలకలం రేపింది. గురువారం ఉదయం ఢిల్లీలోని మహిపాల్‌పూర్ ప్రాంతంలో రాడిసన్ హోటల్ సమీపంలో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.

# సుప్రీం ఆదేశాలను పాటించని స్పీకర్

- ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో పూర్తికాని విచారణ
- మరోమారు సుప్రీంలో కేసు వేసిన బిఆర్ఎస్
- సోమవారం విచారణ చేపడతామన్న సుప్రీం



న్యూఢల్లీ, నవంబర్13 (జనంసాక్షి) : తెలంగాణ రాజకీయాల్లో మరోమారు ఉత్కంఠత మొదలయ్యింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ విచారణలో స్పీకర్ కోర్టు ధిక్కరణకు పాల్డ్డారని బిఆర్ఎస్ సుప్రీంలో కేసు దాఖలు చేసింది. అయితే అంతకు ముందే ఎమ్మెల్యేల ఫిరాయింపు విచారణపై స్పీకర్ సుప్రీంను గడువు కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో పార్టీ మారిన ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుతో పాటు అన్నింటిపై సోమవారం విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ కేసు రాష్ట్ర రాజకీయ భవిష్యత్తును, శాసనసభ పటిష్టతను ప్రభావితం చేయనుంది అనడంలో సందేహం లేదు. గతంలో ఒక పార్టీ నుంచి గెలిచి, మరో పార్టీలో చేరిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ కేసులో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రస్తావన కూడా ఉండడం, ఈ విచారణకు మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది. సోమవారం విచారణకు రానున్న ఈ కేసులో.. ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై రాజకీయ వర్గాల్లో భారీ ఉత్కంఠ నెలకొంది. ఈ తీర్పు.. భవిష్యత్తులో రాజకీయ నాయకులు పార్టీలు మారే విధానాన్ని, ఫిరాయింపులకు పాల్పడే ధోరణిని పూర్తిగా మార్చేసే అవకాశం ఉంది. కేసు ప్రాధాన్యత నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇవ్వబోయే తుది తీర్పు.. ఫిరాయింపులను ప్రోత్సహించే పార్టీలకు, ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలకు ఒక కఠినమైన హెచ్చరికగా మారుతుందో లేదో వేచి చూడాలి.

# ఉగ్రకుట్రకు కేరాఫ్ అల్ ఫలాహ్ వర్సిటీ

- విధ్వంస రచనకు రూమ్ నంబర్ 17
- ఇక్కడి నుంచే ముష్కరుల పథక రచన

న్యూఢిల్లీ, నవంబర్13 (జనంసాక్షి) : ఢిల్లీ బాంబు పేలుడుఘటన నేపథ్యంలో అల్ ఫలాహ్ వర్సిటీ పేరు తెరపైకి వచ్చింది. ఈ వర్సిటీలో పనిచేస్తున్న డాక్టర్లు, ప్రొఫెసర్లు ఉగ్ర కుట్రలో భాగం కావడంతో దర్యాప్తు సంస్థల దృష్టి ఈ వర్సిటీపై పడింది. దర్యాప్తు అధికారులు వర్సిటీకి చేరుకొని ముమ్మరంగా సోదాలు చేస్తున్నారు. ఈ దర్యాప్తులో కీలక ఆధారాలు బయటపడ్డట్లు తెలుస్తోంది. మెడికల్ కాలేజీలోని బాయ్స్ హాస్టల్ ఉండే 17వ నంబర్ భవనం వీరి ఉగ్ర కార్యకలాపాలకు అడ్డాగా ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈ భవనంలోని 13వ నంబర్ గది కీలకంగా మారింది. ముజమ్మిల్‌కి చెందిన ఈ గది వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కు రహస్య సమావేశ కేంద్రంగా పనిచేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఢిల్లీ, సమీప రాష్ట్రాల్లో పేలుళ్లకు ఈ గది నుంచే కుట్ర చేసినట్లు తేలింది. యూనివర్సిటీ ల్యాబ్ నుంచి కొన్ని రసాయనాలను తీసుకురావాలని ఉమర్, ముజమ్మిల్ ప్లాన్ వేసినట్లుగా సమాచారం. ఈ గదిలో సోదాలు చేపట్టిన దర్యాప్తు అధికారులు కొన్ని కెమికల్స్ తోపాటూ పెన్‌డ్రైవ్‌లు, పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ముజమ్మిల్ గదితో పాటు ఉమర్‌కు చెందిన 4వ నంబరు గది నుంచి మూడు డైరీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందులో కీలక విషయాలు ఉన్నట్లు దర్యాప్తు వర్గాలు తెలిపాయి. డైరీల్లో భారీ ఉగ్ర ప్లాన్లను గుర్తించినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. మొత్తం 32 వాహనాల్లో పేలుడు పదార్థాలను నింపాలని అనుమానిత ఉగ్రవాదులు ప్లాన్ చేసినట్లు ఇంటెలిజెన్స్ అధికారులు పేర్కొ న్నారు. మొత్తం 8 మంది అనుమానితులు సుమారు నాలుగు లొకేషన్లలో పేలుడుకు పాల్పడాలని భావించినట్లు తెలుస్తున్నది. పేలుడు పదార్థాలను కొనుగోలు చేసేందుకు వైట్‌కాలర్ డాక్టర్లు సుమారు 26 లక్షల నిధి సేకరించినట్లు తెలుస్తున్నది. అనుమానితులు డాక్టర్ ముజమ్మిల్ గన్నై, డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్, డాక్టర్ షహీన్ సయ్యిద్, డాక్టర్ ఉమర్ నబీ ఆ డబ్బును పోగు చేశారు. అయితే ఆపరేషన్స్ నిర్వహించేందుకు ఆ డబ్బును డాక్టర్ ఉమర్ వాడినట్లు తెలుస్తున్నది. ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్, ఎర్రకోట పేలుడు ఘటనల్లో తీగ లాగే కొద్దీ భారీ ఉగ్ర కుట్ర బయటపడుతోంది. వీరు దేశవ్యాప్తంగా నాలుగు నగరాల్లో దాడులకు పన్నాగం పన్నినట్లు తెలిసింది. ఇందుకోసం 8 మంది సూసైడ్ బాంబర్లను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ కేసుల్లో నిందితులు డాక్టర్ ఉమర్ నబీ, డాక్టర్ ముజమ్మిల్ డైరీల్లో భారీ ఉగ్ర ప్లాన్లను గుర్తించినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ పేలుడు ఘటన పై దర్యాప్తు చేపట్టిన అధికారులు హరియాణాలోని ఫరీదాబాద్‌లో గల అల్‌-ఫలా యూనివర్సిటీని జల్లెడ పడుతున్నారు. ఇక్కడి మెడికల్ కాలేజీలోని బాయ్స్ హాస్టల్ ఉండే 17వ నంబరు భవనం వీరి ఉగ్ర కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఇందులో ముజమ్మిల్‌కు చెందిన 13వ నంబరు గదిలోనే ఉగ్ర కుట్రలకు పథక రచన చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. యూనివర్సిటీ ల్యాబ్ నుంచి కొన్ని రసాయనాలను తీసుకురావాలని ఉమర్, ముజమ్మిల్ ప్లాన్ చేసినట్లు తెలిసింది. ఈ గదిలో పోలీసులు సోదాలు జరిపి కొన్ని కెమికల్స్, డిజిటల్ పరికరాలు, పెన్‌డ్రైవ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇక, ముజమ్మిల్ గదితో పాటు ఉమర్‌కు చెందిన 4వ నంబరు గది నుంచి మూడు డైరీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందులో కీలక విషయాలు ఉన్నట్లు దర్యాప్తు వర్గాలు తెలిపాయి. ఆ డైరీల్లో 25 మంది వ్యక్తుల పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. వారంతా జమ్మూకశ్మీర్, ఫరీదాబాద్‌కు చెందిన వారని గుర్తించారు. దీంతోపాటు నవంబరు 8 నుంచి 12 వరకు తేదీలను ప్రస్తావించినట్లు సమాచారం. దీన్నిబట్టి చూస్తే వీరు దాడులకు పక్కా ప్రణాళిక రచించినట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా నాలుగు కీలక ప్రాంతాల్లో ఒకేసారి దాడులు జరపాలని నిందితులు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఐ20, ఎకోస్పోర్ట్‌తో పాటు మరో రెండు పాత కార్లను కూడా సిద్ధం చేయాలని వారు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఎకోస్పోర్ట్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగతా రెండు కార్ల కోసం అన్వేషణ కొనసాగుతోంది. ఈ ప్లాన్‌ను అమలుచేసేందుకు 8 మందిని సిద్ధం చేసినట్లు ఆ డైరీల సమాచారంతో అధికారులు గుర్తించారు. ఒక్కో ప్రాంతానికి ఇద్దరు చొప్పున వెళ్లి పేలుళ్లు జరపాలని వీరు పన్నాగం పన్నినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఈ ఎనిమిది మందిలో ఉమర్, ముజమ్మిల్‌తో పాటు డాక్టర్ అదిల్, డాక్టర్ షాహీన్ కూడా ఉన్నట్లు తెలిపాయి. ఈ ఉగ్ర కుట్రను అమలుచేసే బాధ్యతను ప్రధానంగా ఉమర్‌కు అప్పగించినట్లు సమాచారం.

# భారత్ అరుదైన ఖనిజ విప్లవం - ప్రపంచ సరఫరా దిశగా

*శుభ్రమైన శక్తి ఆధారిత ప్రపంచ వ్యవస్థలో అరుదైన భూమి మూలకాలు అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. విద్యుత్ వాహనాలు, గాలి చక్రాలు, సూక్ష్మ చిప్‌లు, రక్షణ పరికరాలు వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో ఇవి తప్పనిసరిగా అవసరమైనవి. వాటి తవ్వకం, శుద్ధీకరణ అధికంగా చైనాపైనే ఆధారపడిన స్థితి కొనసాగుతోంది. ప్రపంచ తవ్వకాలలో దాదాపు అరవై తొమ్మిది శాతం, శుద్ధీకరణలో తొంబై శాతం కంటే ఎక్కువ చైనాలోనే జరుగుతున్నది. ఈ ఆధిపత్యం ప్రపంచ సరఫరా వ్యవస్థ స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తోంది.*

2025 అక్టోబర్ 30న దక్షిణ కొరియాలోని బుసాన్ పట్టణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సమావేశమై అరుదైన భూములపై తాత్కాలిక విరమణ ఒప్పందం కుదుర్చుకున్నారు. దాని ప్రకారం చైనా అక్టోబర్ తొమ్మిదో తారీఖున విధించిన ఎగుమతి నిషేధాన్ని ఒక సంవత్సరం పాటు నిలిపివేసింది. ప్రతిగా అమెరికా తన మాదక పదార్థాల పన్నులను సగం తగ్గించి చైనా వస్తువులపై శాతం వంద సుంకం విధించే యోచనను నిలిపివేసింది. ట్రంప్ దీన్ని ప్రపంచానికి లాభదాయకమైన ఒప్పందంగా పేర్కొన్నా నిపుణుల దృష్టిలో ఇది తాత్కాలిక విరామమే. చైనా ఈ ఏడాది ఏప్రిల్‌లో విధించిన ఏడు రకాల అరుదైన మూలకాల నిషేధం యథాతథంగా కొనసాగుతుంది. ఈ పరిణామం భారతదేశానికి విశేషమైన అవకాశాన్ని అందించింది. ప్రపంచ అరుదైన ఖనిజాల నిల్వలలో ఎనిమిది శాతం భారత్‌దే అయినప్పటికీ ఉత్పత్తిలో దాని వాటా ఒక శాతానికి కూడా చేరలేదు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, కేరళ తీరప్రాంతాల్లోని ఇసుకల్లో సుమారు ఏడు మిలియన్ల టన్నుల అరుదైన ఆక్సైడ్లు ఉన్నాయని అంచనా. ఇప్పటి వరకు భారత్ ముడి పదార్థాలను మాత్రమే ఎగుమతి చేస్తూ తయారైన వస్తువులను దిగుమతి చేసుకుంటూ ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్ అరుదైన అయస్కాంతాల యాభై మూడు వేల టన్నులు దిగుమతి చేసుకుంది.

ఈ ఆధారతను తగ్గించేందుకు ప్రభుత్వం మూడు లక్షల నలభై మూడు వందల కోట్ల రూపాయల వ్యయంతో జాతీయ అత్యవసర ఖనిజ మిషన్ అనే కార్యక్రమాన్ని ఆమోదించింది. ఏడేళ్ల వ్యవధిలో ఈ మిషన్ వెయ్యి రెండు వందల దేశీయ అన్వేషణ ప్రాజెక్టులు, యాభై విదేశీ ఆస్తుల కొనుగోలు, ఐదు ప్రధాన అరుదైన మూలకాలలో స్వయం సమృద్ధి లక్ష్యాలను చేరుకోవడమే ఉద్దేశం. అమెరికా 2026 జనవరి నుండి అమలు చేయనున్న కొత్త పన్ను చట్టం భారతీయ సమాచార సాంకేతిక రంగం, సూక్ష్మచిప్ రంగం ఎగుమతులపై ప్రతికూల ప్రభావం చూపనుంది.




అందువల్ల అరుదైన ఖనిజాలు, సూక్ష్మచిప్ తయారీ విలువ గొలుసును బలపరచడం భారత ఆర్థిక స్వాధీనం కోసం అవసరమైంది. చైనా ఇటీవల తక్కువ శాతం అరుదైన మూలకాలున్న వస్తువులపైనా నిషేధం విధించడంతో ప్రపంచ ధరలు పదిహేనుశాతం పెరిగాయి. ఫలితంగా భారత విద్యుత్ వాహనాల ప్రోత్సాహక పథకాలు ఆలస్యమయ్యాయి. చైనాపైన ఎనభై శాతం సరఫరా ఆధారపడే భారత్‌కు ఇది 2030 నాటికి విద్యుత్ వాహన వినియోగం లక్ష్యాన్ని కష్టతరం చేసింది.

ఈ సవాళ్ల నడుమ భారత్ ముడి పదార్థాల ఎగుమతిదారుని నుండి విలువ సృష్టించే దేశంగా మారే ప్రయత్నం ప్రారంభించింది. ఈ మిషన్‌లో పదహారు వేల మూడు వందల కోట్ల ప్రభుత్వ పెట్టుబడి, పదెనిమిది వేల కోట్ల ప్రజా రంగ పెట్టుబడి ఉంది. దేశీయంగా రెండు నుండి మూడు వేల టన్నుల అరుదైన ఆక్సైడ్లు ఉత్పత్తి చేయడం లక్ష్యంగా ఉంది. ఒడిశాలోని చత్రపూర్ ప్రాంతంలో ఉన్న ఓరిసా ఇసుక సముదాయం దీనికి కేంద్రంగా నిలుస్తోంది. భారత అరుదైన భూముల సంస్థ సంవత్సరానికి ఏడు మిలియన్ టన్నుల ఇసుకను ప్రాసెస్ చేస్తూ ఆరు లక్షల టన్నుల పారిశ్రామిక ఖనిజాలను ఉత్పత్తి చేస్తోంది. 2024లో ప్రారంభమైన సముద్రజల శుద్ధి కేంద్రం పరిశ్రమలకూ గ్రామాలకూ నీటి అవసరాలను తీర్చుతోంది. ఒడిశా పరిశ్రమల అభివృద్ధి సంస్థతో కలసి ఏర్పడిన అరుదైన భూములు %-% ఐడికాల్ సంస్థ పూరీ జిల్లాలో కొత్త తవ్వకాలు చేపడుతోంది. బాబా అణు పరిశోధనా కేంద్రం, రక్షణ లోహ పరిశోధనా ప్రయోగశాలల సహకారంతో స్వదేశీ సాంకేతికతల అభివృద్ధి కొనసాగుతోంది. విశాఖపట్నంలోని అయస్కాంత తయారీ కేంద్రం, భోపాల్‌లో ప్రతిపాదిత అరుదైన మూలకాలు - టైటానియం పార్క్ భారత ఆత్మనిర్భరతకు ప్రతీకగా నిలుస్తున్నాయి. ఈ మిషన్‌లో పాత పరికరాల నుండి అరుదైన ఖనిజాలను తిరిగి పొందడంపైనా దృష్టి పెట్టబడింది. స్థిరమైన వ్యవస్థ కోసం పునర్వినియోగ ఆర్థిక సూత్రాలను అనుసరించడం అవసరమని ప్రభుత్వం భావిస్తోంది.

భారత ఆకాంక్షలకు పలు అడ్డంకులు ఎదురవుతున్నాయి. నైపుణ్యం లోపం, భారీ పెట్టుబడి అవసరం, పర్యావరణ ప్రమాదాలు, అంతర్జాతీయ రాజకీయ అస్థిరత ప్రధాన అవరోధాలు. సూక్ష్మచిప్ రంగంలో ప్రస్తుతం ఇరువై రెండు లక్షల మంది మాత్రమే పనిచేస్తున్నారు. 2027 నాటికి మూడులక్షల నైపుణ్య కార్మికుల కొరత ఏర్పడే అవకాశం ఉంది. హార్డ్వేర్ తయారీ, వాఫర్ ప్రాసెసింగ్, చిప్ ప్యాకేజింగ్ రంగాల్లో శిక్షణ తక్కువగా ఉంది. డెబ్బై ఆరు వేల కోట్ల వ్యయంతో అమలవుతున్న భారత సూక్ష్మచిప్ మిషన్ 2030 నాటికి స్వదేశీ ఎకోసిస్టమ్‌ను నెలకొల్పడమే లక్ష్యంగా ఉన్నప్పటికీ నైపుణ్య వనరులు లేకుంటే పురోగతి నెమ్మదించవచ్చు.

అరుదైన ఖనిజాల శుద్ధీకరణ, సూక్ష్మచిప్ తయారీ రెండూ అధిక వ్యయం కలిగిన ప్రక్రియలు. టాటా పవర్‌చిప్ ధోలేరా ప్రాజెక్టు పురోగమిస్తున్నప్పటికీ భారత్ ఇంకా అంతర్జాతీయ ప్రమాణాలకు చేరలేదు. విద్యుత్ సరఫరా, నీటి వనరులు, రవాణా మౌలిక సదుపాయాలు సమన్వయంగా పనిచేయడం అత్యంత అవసరం. తీర తవ్వకాలు పర్యావరణానికి ముప్పు కలిగించే అవకాశం ఉన్నందున పారదర్శక అనుమతులు, సమాజ భాగస్వామ్యం తప్పనిసరి. తవ్వకం, శుద్ధీకరణ, అయస్కాంత తయారీ, తుద ఉత్పత్తి అంశాలు సమన్వయంగా పనిచేసే పరిశ్రమ సముదాయాలు సమర్థతను పెంచుతాయి.

విశ్వసనీయ విద్యుత్ వనరులు, నీటి అందుబాటు, పోర్టులు, ప్రోత్సాహక విధానాలు విదేశీ పెట్టుబడులను ఆకర్షించే ప్రధాన అంశాలుగా మారుతాయి. బహుళ దేశ వేదికల ద్వారా భారత్ ఇతర దేశాలతో సహకారాన్ని పెంపొందించుకోవచ్చు. ప్రపంచ అరుదైన ఖనిజ పోటీ వేగంగా సాగుతున్నా భారత్‌కు ఇప్పుడు అరుదైన అవకాశం లభించింది. ఖనిజాలు, సూక్ష్మచిప్ రంగాలను సమన్వయపరిచి భారత్ ప్రపంచ సరఫరా వ్యవస్థలో ప్రధాన శక్తిగా ఎదగగలదు. పెట్టుబడి, పర్యావరణ సవాళ్లు ఉన్నప్పటికీ దిశ స్పష్టంగా ఉంది. నియోడియమియం ధూళిలోని మెరుపు, డైస్ప్రోసియం లోహపు కాంతిలో భారత పునరుజ్జీవనానికి సంకేతం దాగి ఉంది. సరైన వ్యూహం, పెట్టుబడి, దౌత్యంతో భారత్ కీలక ఖనిజాలు, ఆధునిక తయారీ రంగాలలో బహుళ ధ్రువ ప్రపంచానికి ఆధారస్తంభంగా నిలవగలదు.

**భారత్‌కు ఇప్పుడు అరుదైన అవకాశం లభించింది. ఖనిజాలు, సూక్ష్మచిప్ రంగాలను సమన్వయపరిచి భారత్ ప్రపంచ సరఫరా వ్యవస్థలో ప్రధాన శక్తిగా ఎదగగలదు. పెట్టుబడి, పర్యావరణ సవాళ్లు ఉన్నప్పటికీ దిశ స్పష్టంగా ఉంది. నియోడియమియం ధూళిలోని మెరుపు, డైస్ప్రోసియం లోహపు కాంతిలో భారత పునరుజ్జీవనానికి సంకేతం దాగి ఉంది.సరైన వ్యూహం, పెట్టుబడి, దౌత్యంతో భారత్ కీలక ఖనిజాలు, ఆధునిక తయారీ రంగాలలో బహుళ ధ్రువ ప్రపంచానికి ఆధారస్తంభంగా నిలవగలదు.**



డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# ఉగ్రవాద దాడులకు - దేశంలో ఎన్నికలకు సంబంధం ఉందా?

భారతదేశంలో ఎన్నికల సమయానికి (సాధారణంగా 6 నెలల్లోపు) ముందు జరిగిన కొన్ని ముఖ్య ఉగ్రవాద దాడులు ఇక్కడ తేదీలు, స్థలాలు, మరణాలు మరియు ఎన్నికల సంబంధం సహా ఉదాహరణలుగా ఇస్తున్నాను. ఇవి చారిత్రక రికార్డులు మరియు విశ్వసనీయ మూలాల ఆధారంగా. ఈ లిస్ట్ క్రమానుసారంగా (కాలక్రమంలో) ఉంది, మరియు అన్నీ పాకిస్తాన్ సపోర్టెడ్ గ్రూపులతో (లష్కర్-ఎ-తొయిబా వంటివి) సంబంధం ఉన్నాయని అధికారిక అంచనాలు.

**ఫిబ్రవరి 14, 1998 - కోయింబతూరు సీరియల్ బ్లాస్టులు:**
స్థలం: తమిళనాడు, కోయింబతూరు.
మరణాలు: 58 మంది, 200 మంది గాయాలు.
వివరాలు: బీజేపీ నేత ఎల్‌కే అద్వానీ సభ ముందు బాంబు దాడులు.
**ఎన్నికల సంబంధం:** 1998 లోక్‌సభ ఎన్నికలు (ఫిబ్రవరి 16 – మార్చి 7) ముందు 2-3 వారాలకు జరిగి, ఓటర్లలో భయం పెంచడానికి ఉద్దేశించినట్టు అనుమానం.

**జూన్ 15, 1991 - పంజాబ్ ట్రెయిన్ బాంబు దాడి:**
స్థలం: పంజాబ్.
మరణాలు: 126 మంది, 200 మంది గాయాలు.
వివరాలు: ఖలిస్తాన్ ఉగ్రవాదులు ట్రెయిన్‌లో బాంబు పేల్చారు.
ఎన్నికల సంబంధం: పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు (జూన్ మధ్యలో) ముందు రోజులకు జరిగి, ఓటింగ్‌ను భయపెట్టడానికి ప్రయత్నం.

**నవంబర్ 26, 2008 - ముంబై 26/11 దాడులు:**
స్థలం: మహారాష్ట్ర, ముంబై (హోటల్స్, స్టేషన్).
మరణాలు: 166 మంది (విదేశీయులు సహా), వందలాది గాయాలు.
వివరాలు: లష్కర్-ఎ-తొయిబా ఉగ్రవాదులు సముద్ర మార్గం నుండి వచ్చి దాడి.
ఎన్నికల సంబంధం: 2009 లోక్‌సభ ఎన్నికలు (ఏప్రిల్-మే) ముందు 5 నెలలకు జరిగి, జాతీయ భద్రతను ఎన్నికల అజెండాగా మార్చింది.

**అక్టోబర్ 27, 2013 - పట్నా సీరియల్ బ్లాస్టులు:**
స్థలం: బీహార్, పట్నా (రాహుల్ గాంధీ సభలు).
మరణాలు: 6 మంది, 80 మంది గాయాలు.
వివరాలు: ఇండియన్ ముజాహిద్దీన్ బాంబులు పేల్చారు.
ఎన్నికల సంబంధం: 2014 లోక్‌సభ ఎన్నికలు (ఏప్రిల్-మే) ముందు 6 నెలలకు జరిగి, కాంగ్రెస్ ప్రచారాన్ని లక్ష్యం చేసుకున్నట్టు.

**డిసెంబర్ 2, 2014 - జమ్మూ కాశ్మీర్ ఆర్మీ క్యాంప్ దాడి :**
స్థలం: జమ్మూ కాశ్మీర్.
మరణాలు: 11 భద్రతా సిబ్బంది, 5 ఉగ్రవాదులు.
వివరాలు: లష్కర్ ఉగ్రవాదులు క్యాంప్‌పై దాడి.
ఎన్నికల సంబంధం: జమ్మూ %ఒ% కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు (నవంబర్-డిసెంబర్ 2014) మధ్యలో జరిగి, ఓటర్లను భయపెట్టడానికి ఉద్దేశించినట్టు.

**జనవరి 2, 2016 - పఠాంకోట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ దాడి:**
స్థలం: పంజాబ్, పఠాంకోట్.
మరణాలు: 5 ఉగ్రవాదులు, 6 భద్రతా సిబ్బంది.
వివరాలు: జైష్-ఎ-మహ్మద్ ఉగ్రవాదులు బేస్‌పై దాడి.
ఎన్నికల సంబంధం: 4 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు (ఫిబ్రవరి-మార్చి 2016) ముందు 1-2 నెలలకు జరిగి, భద్రతా విషయాలను ఎన్నికల్లో హైలైట్ చేసింది.

**ఫిబ్రవరి 14, 2019 - పుల్వామా దాడి:**



స్థలం: జమ్మూ కాశ్మీర్, పుల్వామా.
మరణాలు: 40 సీఆర్‌పీఎఫ్ జవాన్లు.
వివరాలు: జైష్-ఎ-మహ్మద్ వాహన బాంబ్ దాడి.
ఎన్నికల సంబంధం: 2019 లోక్‌సభ ఎన్నికలు (ఏప్రిల్-మే) ముందు 2 నెలలకు జరిగి, బాలకోట్ స్ట్రైక్‌కు దారితీసి ఎన్నికల ప్రచారంలో జాతీయవాదాన్ని బలపరిచింది.

**అక్టోబర్ 2019 - ఎలోసీలో పాకిస్తాన్ షెల్లింగ్:**
స్థలం: జమ్మూ కాశ్మీర్, లైన్ ఆఫ్ కంట్రోల్.
మరణాలు: 2 భారతీయ సైనికులు, 1 పౌరుడుబీ 5 పాకిస్తాన్ సైనికులు (భారత దాడుల్లో).
వివరాలు: పాకిస్తాన్ ఆర్మీ షెల్లింగ్, భారత్ రెస్పాన్స్‌తో.
ఎన్నికల సంబంధం: మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలు (నవంబర్ 2019) ముందు 1 నెలకు జరిగి, "సర్జికల్ స్ట్రైక్"గా ప్రచారం చేసి దృష్టి మళ్లించారని విమర్శలు.

**మే 5, 2024 - ఐఏఎఫ్ కాన్వాయ్ అంబుష్:**
స్థలం: జమ్మీ కాశ్మీర్, షాహ్‌సితార్ సమీపంలో.
మరణాలు: 1 ఐఏఎఫ్ సిబ్బంది, 4 మంది గాయాలు.
వివరాలు:లష్కర్-ఎ-తొయిబా ఉగ్రవాదులు కాన్వాయ్‌పై దాడి.
ఎన్నికల సంబంధం: 2024 లోక్‌సభ ఎన్నికలు (ఏప్రిల్-జూన్) 5వ దశ ముందు (మే 20) జరిగి, జిహాదిస్ట్ ప్రచారంలో భాగంగా భద్రతను ప్రభావితం చేసింది.

**మే 18, 2024 - అనంత్‌నాగ్ టూరిస్ట్ క్యాంప్ దాడి :**
స్థలం: జమ్మూ కాశ్మీర్, పహల్‌గాం సమీపంలో.
మరణాలు: రాజస్థాన్ టూరిస్ట్ జంట (తబ్రీజ్, ఫర్హా) గాయాలు.
వివరాలు: ఇస్లామిక్ మిలిటెంట్స్ టూరిస్ట్ క్యాంప్‌పై దాడి.
ఎన్నికల సంబంధం: 2024 లోక్‌సభ ఎన్నికలు 5వ దశ (మే 20) ముందు 2 రోజులకు జరిగి, ఓటర్లు మరియు టూరిజాన్ని లక్ష్యం చేసుకున్నట్టు.

**మే 18, 2024 - షోపియాన్ బీజేపీ నేత దాడి:**
స్థలం: జమ్మూ కాశ్మీర్, హిర్పోరా గ్రామం.
మరణాలు: మాజీ సర్పంచ్ అయిజాజ్ అహ్మద్ షేక్ మరణం.
వివరాలు: ఇస్లామిక్ మిలిటెంట్స్ షూటింగ్.
ఎన్నికల సంబంధం : 2024 లోక్‌సభ ఎన్నికలు 5వ దశ ముందు 2 రోజులకు జరిగి, రాజకీయ నాయకులను భయపెట్టడానికి. ఈ దాడులు ప్యాటర్న్‌ను సూచిస్తాయి, ఎక్కువగా జమ్మూ కాశ్మీర్‌లో జరిగి, ఎన్నికల ప్రచారాన్ని జాతీయ భద్రతపై కేంద్రీకరిస్తాయి. ఈ ఉగ్రవాదులు ఎప్పుడు ఎక్కడ ఎలా దాడిచేశారు? ఎందరు చనిపోయారు? ఆ సమయం సందర్భం లో ఎన్నికల్లో లబ్ధి చేకూరిందో ఎన్నికల ఫలితాలను బట్టి మీరే నిర్ధారణ కు రావచ్చు. (కొద్దిగా లోతుగా బుర్ర పెట్టి ఆలోచిస్తే..)



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్
9849328496

## ఉదయించే కిరణాలు బాలలు




ఉదయించే కిరణాలు బాలలు
బడికి వెలుగులు బాలలు
చదువుల తల్లి బిడ్డలు
చిరునవ్వుతో చిందులేస్తుండే
బాలలు
సంతోషానికి మారుపేరు బాలలు!!

ప్రగతికి బాటలు బాలలు
భరతమాత ముద్దుబిడ్డలు
ఎదుగుతున్న పిల్లలు
భావితరానికి వెలుగు దివ్వెలు!!

బాలలు బంగారు కిరణాలు
అవనిలో వెలిసిన చిరు మొగ్గలు
స్వచ్ఛమైన మనసుకు చిరునామా
బంగారు భవితకు పునాదులు
చిరునవ్వుకు చిరునామా బాలలు!!



దేవులపల్లి రమేశ్
సిద్దిపేట,నంగునూర్
9963701294

## అందెశ్రీ

పాటలకు చెమట అద్దిన
పాటలకు ఎరుపునడకల పసనేర్పిన యే
మాటైనపాటల దరువు
సాటిమనిషిగోసలయలు జనఅందెశ్రీ

రేడియమ్
9291527757

(అందెశ్రీ గారికి ఓ ఆత్మీయ పద్యాంజలి)

# లైబ్రరీలలో (ఏఐ) ఆధారిత పరిశోధన
# అనువర్తనాలలో నైతిక విలువల పరిరక్షణలు

లైబ్రరీలు జ్ఞాన భాండాగారాలు. అక్కడ పుస్తకాలు, పత్రికలు, డిజిటల్ డేటా ఉంటాయి. ఇప్పుడు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాంకేతికత లైబ్రరీలలోకి ప్రవేశిస్తోంది. ఏఐ సహాయంతో పుస్తకాలను వర్గీకరించడం, శోధనలు సులభం చేయడం జరుగుతోంది. కానీ ఈ ఏఐ ఉపయోగంలో నైతిక సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ వ్యాసంలో ఆ సమస్యలను సరళంగా విశ్లేషిస్తాం.

**డేటా గోప్యత - ప్రధాన సమస్య :** లైబ్రరీలో పాఠకులు ఏఏ పుస్తకాలు తీసుకుంటారో రికార్డులో ఉంటుంది. ఏఐ ఈ డేటాను విశ్లేషించి సిఫారసులు ఇస్తుంది. ఉదాహరణకు "మీరు చరిత్ర పుస్తకాలు ఇష్టపడతారు." కానీ ఈ డేటా లీక్ అయితే? పాఠకుల గోప్యత దెబ్బతింటుంది. అమెరికాలో 2023లో ఒక లైబ్రరీ ఏఐ సిస్టమ్ హ్యాక్ అయింది.వేలాది మంది పాఠకుల డేటా బహిర్గతమైంది. అందుకే జీడీపీఆర్ (జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్), సీసీపీఏ (కాలిఫోర్నియా కన్స్యూమర్ ప్రైవసీ యాక్ట్) వంటి చట్టాలు అవసరం మన దేశంలో కూడా ఉంది. లైబ్రరీలు డేటాను గుప్తీకరించాలి. పాఠకుల అనుమతి లేకుండా సమాచారాన్ని లీక్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవటం తప్పనిసరి.

**బయాస్ - అన్యాయమైన సిఫారసులు :** ఏఐ మోడళ్లు శిక్షణ డేటాపై ఆధారపడతాయి. శిక్షణ డేటాలో బయాస్ ఉంటే సిఫారసులు అన్యాయంగా ప్రతిఫలిస్తాయి. ఉదా: ఒక ఏఐ సిస్టమ్ శ్వేతజాతి రచయితల పుస్తకాలనే సిఫారసు చేసింది. భారతదేశంలో తెలుగు, హిందీ పుస్తకాల కంటే ఇంగ్లీష్ పుస్తకాలు ఎక్కువ సిఫారసు అయ్యాయి.ఇది సాంస్కృతిక వైవిధ్యాన్ని దెబ్బతీస్తుంది. దీనికి పరిష్కారం: విభిన్న డేటాతో ఏఐకి శిక్షణ ఇవ్వాలి. తెలుగు, తమిళం, బెంగాలీ గ్రంథాలను డిజిటైజ్ చేయాలి. లైబ్రరీలను బయాస్ ఆడిట్ చేయాలి.

**ఉద్యోగ నష్టం - మానవ ఉద్యోగుల స్థానంలో ఏఐ :** ఏఐ చాట్‌బాట్లు పాఠకుల ప్రశ్నలకు సమాధానం ఇస్తాయి. కేటలాగింగ్, వర్గీకరణ ఏఐ చేస్తుంది.ఫలితంగా పెద్ద సంఖ్యలో లైబ్రేరియన్ల ఉద్యోగాలు తగ్గుతాయి. అమెరికా లైబ్రరీ అసోసియేషన్ 2024 నివేదిక ప్రకారం, 12 శాతం ఉద్యోగాలు ఏఐ వల్ల ప్రమాదంలో ఉన్నాయి. కానీ ఏఐ మనిషికి పూర్తి ప్రత్యామ్నాయం కాదు.మానవ లైబ్రేరియన్లు సంక్లిష్ట ప్రశ్నలకు సహనంతో సమాధానాలు చెపుతారు, సామాజిక సేవలు అందిస్తారు.దీనికి పరిష్కారం ఏమిటంటే ఏఐని లైబ్రేరియన్ లకు సహాయకంగా ఉపయోగించాలి. లైబ్రేరియన్లకు ఏఐతో కలిసి పనిచేసేలా శిక్షణ ఇవ్వాలి.

**కాపీరైట్ ఉల్లంఘన సమస్య - మేధో ఆస్తి సమస్యలు ఉన్నాయి :** ఏఐ పుస్తకాలను స్కాన్ చేసి సారాంశాలు ఇస్తుంది. కొన్ని ఏఐ టూల్స్ పూర్తి పుస్తకాలను జనరేట్ చేస్తాయి. ఇది రచయితల హక్కులను దెబ్బతీస్తుంది. 2024లో భారతదేశంలో ఒక ఏఐ టూల్ తెలుగు నవల సారాంశం ఇచ్చింది. రచయిత ఫిర్యాదు చేశాడు. **పరిష్కారం:** లైబ్రరీలు కాపీరైట్ ఉల్లంఘనలను నివారించాలి. ఓపెన్ యాక్సెస్ గ్రంథాలను మాత్రమే ఏఐలో ఉపయోగించాలి.రచయితల అనుమతి తీసుకోవాలి.

**డిజిటల్ డివైడ్ - సమాన అవకాశాలు :** గ్రామీణ లైబ్రరీలలో ఏఐ సౌకర్యాలు లేవు. ఇంటర్నెట్, కంప్యూటర్లు లేకపోతే ఏఐ ఉపయోగం కష్టం. భారతదేశంలో 65 శాతం గ్రామీణ ప్రాంతాలలో ఇంటర్నెట్ లేదు (2025 డేటా).ఫలితం: నగర పాఠకులు మాత్రమే ఏఐ ప్రయోజనం పొందుతారు. పరిష్కారం ఏమిటంటే ప్రభుత్వం గ్రామీణ లైబ్రరీలకు ఏఐ టూల్స్ అందించాలి. ఆఫ్‌లైన్ ఏఐ మోడళ్లు అభివృద్ధి చేయాలి.

**పారదర్శకత - ఏఐ నిర్ణయాలు ఎలా తీసుకుంటుంది?** : ఏఐ సిఫారసు చేసినప్పుడు కారణం చెప్పాలి. ఉదా: "ఈ పుస్తకం సిఫారసు ఎందుకు చేస్తున్నాదో తగిన వివరణ ఇవ్వాలి. ఇప్పుడు చాలా ఏఐ మోడళ్లు బ్లాక్ బాక్స్‌లాంటివి. పాఠకులు నమ్మకం కోల్పోతారు. దీనికి పరిష్కారం, ఎక్స్‌ఏఐ (ఎక్స్‌ప్లెయినబుల్ ఏఐ) టూల్స్ ను ఉపయోగించాలి. లైబ్రరీలు ఏఐ నిర్ణయాలను ఆడిట్ చేయాలి.

సామాజిక ప్రభావం - జ్ఞాన వ్యాప్తి : ఏఐ సరైన సమాచారం ఇస్తే జ్ఞానం వ్యాపిస్తుంది. తప్పు సమాచారం ఇస్తే హాని జరుగుతుంది. ఉదా: ఒక ఏఐ చరిత్ర పుస్తకంలో తప్పు వాస్తవాలు సిఫారసు చేసింది. పరిష్కారం: ఏఐ ఫ్యాక్ట్-చెక్ టూల్స్‌తో ఇంటిగ్రేట్ చేయాలి. లైబ్రరీలు నమ్మకమైన డేటాబేస్‌లను ఉపయోగించాలి. ఏఐ లైబ్రరీలను ఆధునికీకరిస్తోంది. కానీ నైతిక సమస్యలను విస్మరించకూడదు. డేటా గోప్యత, బయాస్, కాపీరైట్, ఉద్యోగాలు, డిజిటల్ డివైడ్ ఈ సమస్యలన్నీ పరిష్కరించాలి. లైబ్రరీలు ఏఐని బాధ్యతాయుతంగా ఉపయోగించాలి. ప్రభుత్వం, లైబ్రరీ సంఘాలు, సాంకేతిక నిపుణులు కలిసి పనిచేయాలి. అప్పుడే ఏఐ లైబ్రరీలను నీతివంతంగా, సమాన ప్రాతిపదికన అందరికీ అందుబాటులో ఉంచుతుంది. జ్ఞానం పొందటం అందరి హక్కు . ఏఐ దానిని కాపాడాలి.



డాక్టర్.జీ.రాధికారాణి
అసిస్టెంట్ ప్రొఫెసర్
హెడ్, డిపార్ట్మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్,
కాకతీయ యూనివర్సిటీ,
వరంగల్

# బీహార్ రాజకీయాలు, ఎన్నికలపై జననాయక్ ప్రభావం


కర్పూరీ ఠాకూర్, బీహార్ రాజకీయాలలో కేవలం ఒక ముఖ్యమంత్రిగా మాత్రమే కాక, సామాజిక న్యాయం, సమానత్వం అంకితభావంగల చిహ్నంగా నిలిచారు. 1970లలో ఆయన నాటిన పరివర్తనాత్మక నిశ్చయాత్మక చర్య విత్తనాలు, దశాబ్దాలు గడిచినా, నేటికీ బీహార్ ఎన్నికల రాజకీయాలపై చెరగని ముద్ర వేస్తున్నాయి. ముఖ్యంగా ఆయన ప్రవేశపెట్టిన ఓబీసీ ఉప-వర్గీకరణ ఫార్ములా, ప్రస్తుత కుల సమీకరణలు, రాజకీయ పొత్తులకు ప్రధాన కేంద్రంగా మారింది.

ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఠాకూర్ స్వస్థలమైన సమస్తిపూర్ నుండి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడం, ఆయనకు భారతరత్న పురస్కారాన్ని మరణానంతరం ప్రదానం చేయడం, కేవలం గౌరవించడం మాత్రమే కాదు, ఠాకూర్ వారసత్వాన్ని సొంతం చేసుకోవడానికి, వెనుకబడిన వర్గాల ఓటర్లను ఆకట్టుకోవడానికి జాతీయ పార్టీలు చేస్తున్న ప్రయత్నాలను స్పష్టంగా సూచిస్తుంది. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం బీహార్‌లో జరుగుతున్న (లేదా జరగబోయే) ఎన్నికలలో కర్పూరీ ఠాకూర్ ప్రభావం, ఆయన విధానాలు ఏ విధంగా పనిచేస్తాయో వివరంగా విశ్లేషిద్దాం.

**కర్పూరీ ఫార్ములా పునరుజ్జీవం :** ఠాకూర్ అత్యంత విప్లవాత్మకమైన విధానం 1977లో ప్రవేశపెట్టిన గ్రేడెడ్ రిజర్వేషన్ ఫార్ములా. ఇది ఓబీసీలను రెండు ప్రధాన వర్గాలుగా విభజించింది. ఈబీసీలు (అత్యంత వెనుకబడిన తరగతులు - 12% రిజర్వేషన్) : నాయీ (మంగలి), ధోబీ, బడాయి (వడ్రంగి), లోహర్ (కమ్మరి) వంటి చేతివృత్తుల మరియు సేవా కులాలు. బీసీలు (వెనుకబడిన తరగతులు - 8% రిజర్వేషన్): యాదవులు, కుర్మీలు, కోయిరిలు వంటి వ్యవసాయ పరంగా బలంగా ఉన్న ఓబీసీలు. ఈ ఉప-వర్గీకరణ ద్వారా, రిజర్వేషన్ ఫలాలను అనుభవిస్తున్న బలమైన వ్యవసాయ ఓబీసీల నుండి, తక్కువ స్థాయిలో ఉన్న అత్యంత వెనుకబడిన కులాలకు (ఈబీసీలు) వాటాను అందించాలని ఠాకూర్ లక్ష్యంగా పెట్టుకున్నారు.

**ప్రస్తుత ఎన్నికలపై ప్రభావం :** నేటి బీహార్ రాజకీయాల్లో, ఈబీసీలు (అత్యంత వెనుకబడిన తరగతులు) అతిపెద్ద, అత్యంత నిర్ణయాత్మక ఓటు బ్యాంకుగా పరిగణించబడుతున్నాయి. యాదవులు వంటి ప్రధాన ఓబీసీ కులాలు రాజకీయంగా బలంగా ఉన్నందున, ఈబీసీ లు తరచుగా వారిని నిరోధించే శక్తిగా మారాయి. కేంద్రంలో బీజేపీ, దాని మిత్రపక్షాలు, యాదవేతర/ఈబీసీ ఓటర్లను ఆకర్షించడానికి కర్పూరీ ఠాకూర్ వారసత్వాన్ని (ముఖ్యంగా భారతరత్న ద్వారా) ఒక ముఖ్య సాధనంగా ఉపయోగిస్తున్నాయి. కర్పూరీ ఠాకూర్, స్వయంగా నాయీ (ఈబీసీ) కులానికి చెందినవారు కాబట్టి, ఆయన పేరును ఉపయోగించడం ద్వారా ఈబీసీలలో తమకు బలమైన స్థావరాన్ని ఏర్పరచుకోవాలని ఆశిస్తున్నారు.

నితీష్ కుమార్ వంటి నాయకులు,




దశాబ్దాలుగా ఈబీసీలను, మహిళలను లక్ష్యంగా చేసుకుని తమ రాజకీయ వ్యూహాలను రూపొందించారు. ఠాకూర్ ఉప-వర్గీకరణ సూత్రం, ఈబీసీలను ఏకీకృతం చేయడానికి, రాష్ట్రంలో మెజారిటీ ఓటు బ్యాంకుగా మార్చడానికి నితీష్‌కి సహాయపడింది. బీహార్ ఎన్నికలలో, ఈబీసీ ఓటర్లు ఏ కూటమికి మద్దతు ఇస్తారనేది ఫలితాలను నిర్ణయిస్తుంది. ఠాకూర్ ఫార్ములా స్ఫూర్తి (అంటే ఈబీసీ లకు ప్రాధాన్యత) ఎన్నికల ప్రసంగాలలో, పొత్తుల కూర్పులో ప్రధానంగా ఉంటుంది.

**రిజర్వేషన్ల పెంపు :** కుల జనాభా లెక్కల ఆధారంగా బీహార్ ప్రభుత్వం రాష్ట్రంలో రిజర్వేషన్ల కోటాను పెంచింది. ఈ చర్య ప్రధానంగా బలహీన వర్గాల ప్రజలను ఆకర్షించడానికి మరియు ఠాకూర్ సామాజిక సమానత్వ ఆశయాలకు కట్టుబడి ఉన్నామని నిరూపించుకోవడానికి ఉపయోగపడుతుంది. ఎన్నికల ప్రచారంలో, ఈ రిజర్వేషన్ల పెంపు ఒక ముఖ్యమైన హామీగా ఉంటుంది.

**ప్రధాన వర్గాల సవాలు :** ఠాకూర్ నాటిన విత్తనాలు, సామాజిక న్యాయం అనేది ప్రధాన ఓబీసీ కులాల నుండి ఇతర వెనుకబడిన కులాలకు విస్తరించాలని రాజకీయ పార్టీలపై ఒత్తిడి తెస్తున్నాయి. యాదవులు, కుర్మీలు వంటి కులాలపై మాత్రమే దృష్టి పెట్టే పార్టీలు, ఈబీసీ ల మద్దతును కోల్పోకుండా ఉండటానికి ప్రయత్నించాలి.

**సిద్ధాంతపరమైన సోషలిజం, నిజాయితీ :** ఠాకూర్ తన జీవితకాలంలో సూత్రప్రాయమైన సోషలిజంకు అంకితమయ్యారు. ఆయన నైతిక విలువలు, ముఖ్యమంత్రి అయినప్పటికీ పేదరికంలో జీవించడం మరియు అధికారం కోసం సిద్ధాంతాన్ని రాజీపడకపోవడం వంటివి ఆయనకు 'జననాయక్' అనే బిరుదును సంపాదించిపెట్టాయి.

**సంకీర్ణ రాజకీయాలు :** ఠాకూర్ మొదటి పదవీకాలం పెళుసుగా ఉన్న సంకీర్ణాలు, ఫిరాయింపుల కారణంగా అస్థిరంగా ఉండేది. నేటి బీహార్ రాజకీయాలు కూడా తరచుగా బలహీనమైన పొత్తులు, పార్టీల మార్పులతో కూడి ఉన్నాయి. ఠాకూర్ చరిత్ర, రాజకీయ స్థిరత్వం ప్రాముఖ్యతపై మరియు సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరంపై ప్రజలకు ఒక పాఠంగా నిలుస్తుంది.

**మద్యపాన నిషేధం ప్రభావం :** ఠాకూర్ తన రెండవ పదవీకాలంలో ప్రవేశపెట్టిన మద్యపాన నిషేధం, ఆయన వారసత్వంలో ముఖ్యమైన అంశం. ఆ తర్వాత రద్దు చేయబడినప్పటికీ, దశాబ్దాల తర్వాత నితీష్ కుమార్ తిరిగి ఈ విధానాన్ని అమలు చేశారు.

**మహిళా ఓటర్లు :** మద్యపాన నిషేధం అనేది బీహార్‌లోని మహిళా ఓటర్లను ప్రభావితం చేసే ఒక భావోద్వేగ అంశం. ఠాకూర్ వారసత్వాన్ని సమర్థించే పార్టీలు, మహిళల భద్రత, సామాజిక సంక్షేమం పట్ల ఆయనకున్న నిబద్ధతను ఈ నిషేధం ద్వారా హైలైట్ చేస్తాయి. ప్రస్తుత ఎన్నికలలో మహిళా ఓటు బ్యాంకు కీలకమైనది కాబట్టి, ఈ అంశం కచ్చితంగా ప్రచారంలో ఉంటుంది.

**ప్రస్తుత ఎన్నికలలో జననాయక్ ప్రభావం**
- ఈబీసీ ఓటు బ్యాంకును లక్ష్యంగా చేసుకుని జాతీయ, ప్రాంతీయ పార్టీలు పోటీపడటం.
- కుల జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలపై హామీలు ఇవ్వడం.
- రాజకీయ ప్రత్యర్థులు ఠాకూర్ నిజాయితీ, పేదరికం పట్ల నిబద్ధత ప్రమాణాల ఆధారంగా ఒకరినొకరు విమర్శించుకోవడం.

ఠాకూర్ ఉప-వర్గీకరణ విధానం, బీహార్‌లో సమానత్వం కోసం జరిపిన పోరాటంలో ఒక ముఖ్యమైన మలుపు. అందువల్ల, ఏ పార్టీ ఆయన వారసత్వాన్ని సమర్థవంతంగా, నమ్మకంగా ముందుకు తీసుకువెళుతుందో, ఆ పార్టీకి ఈ ఎన్నికలలో విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయి. కర్పూరీ ఠాకూర్ పేరు, బీహార్ రాజకీయాలలో ఈబీసీల రాజకీయ శక్తికి, బహుళ-కుల సంకీర్ణాలకు ఒక తిరుగులేని మంత్రంగా మిగిలిపోయింది.



డాక్టర్ జంపాల రాజేష్
ఓబీసీ స్టూడెంట్స్ జేఏసీ చైర్మన్

# దేశంలో ప్రత్యామ్నాయం కమ్యూనిజమే..

- ప్రజా సమస్యల పరిష్కారం ఎర్రజెండాలతోనే సాధ్యం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




**కాప్రా, నవంబర్ 13 (జనం సాక్షి) :** భారత దేశంలో ప్రత్యామ్నాయం కమ్యూనిజమేనని,ప్రజా సమస్యల పరిష్కారం ఎర్రజెండాలతోనే సాధ్యమని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి,శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సమితి సమావేశం ఈసీఐఎల్ లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కూనంనేని హాజరయ్యారు. సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు కమ్యూనిజం పై ప్రజల నమ్మకం పెరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయని దానికి నిదర్శనం వరుసగా శ్రీలంక దేశంలో,న్యూయార్క్ లో కమ్యూనిజం అధికారంలోకి రావడం,ఇప్పుడు నేపాల్ లో అన్ని కమ్యూనిస్టులు ఐక్యం నిదర్శనం మని అన్నారు.మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు, ధరలు తగ్గిస్తాం, ఏటా 2 కోట్లు ఉద్యోగాలు ఇస్తాం లాంటి ప్రజాకర్షక నినాదాలతో అధికారంలోకి వచ్చిన బీజేపీ అవేమి అమలు చేయలేదన్నారు. దేశంలో ప్రజల మధ్య మత విద్వేషాలు, భావోద్వేగాలు రెచ్చగొడుతూ వరుసగా అధికారం నిలబెట్టుకుంటున్నదని ఆరోపించారు. 6 దశాబ్దాలుగా ప్రజల, కార్మికుల త్యాగాలతో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను ఎల్ఐసి, బ్యాంకులు, టెలికాం, గనులు, చివరికి రక్షణ రంగ పరిశ్రమలను సైతం ప్రైవేట్కు కట్టబెట్టిన చరిత్ర బీజేపీ ది అని వారు ఉద్ఘాటించారు. దేశ సంపదను అదానీ, అంబానీ, కార్పోరేట్ పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని, సంపన్నులు మరింత సంపన్నులవుతుంటే. పేదలు మరింత పేదలుగా అవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులను, కార్మికులను పెట్టుబడిదారులకు కట్టుబానిసలుగా మార్చే చట్టాలు తెచ్చారని, వీటి రద్దు కొరకు సిపిఐ పోరాడుతున్నదన్నారు. దేశంలో కమ్యూనిస్టుల ఐక్యత, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత గురించి సిపిఐ నిరంతరం కృషి చేస్తున్నదని అందుకే రానున్న రోజుల్లో ప్రజలను కమ్యూనిస్టు భావజాలం వైపు ఆకర్షితులను చేయడానికి పోరాటాలు నిర్మిస్తామని వారు అన్నారు. ఖమ్మంలో డిసెంబర్ 26న సీపీఐ వందేళ్ల పండగను నిర్వహించనున్నట్లు, ఈ ముగింపు సభకు 40 దేశాల నుంచి వామపక్ష ప్రతినిధులు హాజరవుతారని, ఐదు లక్షల మంది హాజరుకానున్నారని అన్నారు.ఈ ముగింపు సభకు రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాదిగా తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. కేంద్ర విధానాలతో రైతులకు గిట్టు బాటు ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఎక్కువ.. బీజేపీయేతర పాలిత రాష్ట్రాలకు తక్కువగా నిధులు ఇస్తున్నారని విమర్శించారు. దీంతో అనేక రాష్ట్రాల్లో అభివృద్ధి. కుంటుపడుతుందన్నారు.రాష్ట్రంలో బీజేపీని అడ్డుకోవడానికి కాంగ్రెస్తో పొత్తు పెట్టుకున్నామని, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకున్నామన్నారు. రాష్ట్రంలో ప్రజావ్యతిరేక విధానాలను కాంగ్రెస్ అవలంభించినప్పుడు వాటిని సరిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. అధికార కాంగ్రెస్తో పొత్తు ఉన్నా ప్రజా సమస్యలపై పోరాటం ఆపడం లేదని. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్. బోస్,జాతీయ సమితి సభ్యులు యూసఫ్, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దామోదర్ రెడ్డి,సాయిలు గౌడ్, కల్లూరు ధర్మేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, లక్ష్మి,స్వామి, కిషన్,శంకర్ రావ్,హరినాథ్ రావ్,కృష్ణ, సత్యప్రసాద్, యాదయ్య గౌడ్,లొట్టి ఈశ్వర్, సల్మాన్ బేగ్, పరమేశ్వర, మాధవి, ప్రమీల, రమేష్, నరేంద్ర ప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కలెక్టర్‌కు వినతి

- భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ నేతలు



**తాండూరు, నవంబర్ 13 (జనంసాక్షి) :** పట్టణంలోని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గురువారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ ను బిజెపి పట్టణ శాఖ నాయకులు కలిసి తాండూరు పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్లో గల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని కొందరు అవకాశవాదులు ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి ప్రభుత్వ స్థలాలను కాజేయాలని చూస్తున్నారు. .దానికి ఎటువంటి అనుమతులు కూడా ఇవ్వకుడదని కోరారు. దీంట్లో తాండూరు డివిజన్ రెవెన్యూ డిపార్ట్మెంట్, మున్సిపాలిటీ డిపార్ట్మెంట్ మరియు ఎస్ఆర్ఓ దీంట్లో ఇన్వాల్వ్ అయినట్టు తెలుస్తుంది కాబట్టి అందరిపై ఎంక్వయిరీ చేసి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, జిల్లా సీనియర్ నాయకులు అంతరం లలిత, జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, తాండూరు పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం తదితరులు ఉన్నారు.

## 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు పోరాడుతాం

- సీఎం రేవంత్ రెడ్డి అఖిలపక్షాలతో ఢిల్లీ వెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచాలి
- వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ చట్టాన్ని అమలు చేయాలి
- జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్



**తాండూరు, నవంబర్ 13 (జనంసాక్షి) :** బీసీలకు విద్య ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను సాధించేవరకు ఉద్యమం కొనసాగుతుందని జాతీయ బీసీ సంఘం కార్యవర్గ సభ్యులు, తాండూర్ నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్ కుమార్ అన్నారు. గురువారం తాండూర్ పట్టణం అంబేద్కర్ కూడలి వద్ద తాండూర్ నియోజవర్గ బీసీ సంఘం ఆధ్వర్యంలో బీసీల ధర్మ పోరాట దీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ రిజర్వేషన్లు సాధించే వరకు బీసీ ఉద్యమం నిరంతరంగా కొనసాగుతుందన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పూర్తి బాధ్యత తీసుకొని, అన్ని రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి తెచ్చి ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా బీసీల రిజర్వేషన్ల అంశంపై సానుకూలంగా స్పందించి వెంటనే వాటిని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. బీసీలది ఆత్మగౌరవ పోరాటం అని 60 శాతం జనాభా ఉన్న బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అడ్డుకోవడం అన్యాయమని బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో న్యాయబద్ధమైన హక్కులు సాధించడానికి ధర్మబద్ధంగా పోరాటం చేస్తుంటే, కొంతమంది అక్రమంగా, అధర్మంగా అడ్డుకుంటున్నారు. బీసీలు రాజకీయంగా ఎదగడం జీర్ణించుకోలేక కొంతమంది కోర్టుల్లోకి వెళ్ళారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు, మహిళా ప్రతినిధులు, యువజన నాయకులు మాట్లాడుతూ తాండూర్ నుండి ఢిల్లీ వరకు బీసీల రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. బీసీ హక్కుల సాధన వరకు ఈ పోరాటం ఆగదు అని పలువురు స్పష్టం చేశారు. ఈ దీక్ష లో రాష్ట్ర నాయకులు సయ్యద్ సుకుర్, జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్, మహిళా సంఘం అధ్యక్షురాలు కార్యదర్శులు అనిత, మంజుల, నరసమ్మ, విజయలక్ష్మి, శివలీల,యాలాల్, పెద్దేముల్, తాండూర్ మండలల అధ్యక్షులు చెన్నారం లక్ష్మణ చారి, శ్రవణ్ కుమార్, బసంత్ కుమార్, మీడియా ఇంచార్జ్ బసవరాజ్, విద్యావంతుడు పర్యాద రామకృష్ణ, స్వేరోస్ మరియు యువతరం ఫౌండేషన్ నాయకులు, అరుణ్ రాజ్ ,శివ, నాయి బ్రాహ్మణ సమాజం సభ్యులు పరమేష్, ఆర్టీసీ నాయకులు, బీసీ సంఘం నాయకులు, రాము ముదిరాజ్, మంతటి రాజు, పరమేష్, జోసఫ్, రాజు,ప్రవీణ్, పండు గౌడ్, దుబాయ్ వెంకట్, నరసింహ, జగన్, నరహరి, కార్తీక్, కిరణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# మధుమేహంలో తెలంగాణ నాలుగో స్థానం

- జయంతి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శరత్ చంద్ర

**హైదరాబాద్, నవంబర్ 13 (జనం సాక్షి) :** మధుమేహంతో జాగ్రత్తగా ఉండాలని జయంతి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ కే శరత్ చంద్ర తెలిపారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ఎస్ఆర్ నగర్ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మధుమేహం (డయాబెటీస్) కేసులు వేగంగా పెరుగుతున్నాయన్నారు. దీనివల్ల గుండె, మెదడు, మూత్రపిండాలు వంటి అవయవాలపై తీవ్రమైన ప్రభావం పడుతుందన్నారు. ఈ కార్యక్రమం ప్రతి సంవత్సరం నవంబర్ 14న జరుపుకునే ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ రోజు ఇన్సులిన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త డాక్టర్ చార్లెస్ బాంటింగ్ జన్మదినం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా పాటించబడుతుందన్నారు. ఒకప్పుడు 'డయాబెటీస్ రాజధాని'గా పిలువబడిన భారతదేశంలో ప్రస్తుతం సుమారు 10 కోట్ల మంది పెద్ద వారిలో ఈ వ్యాధి ఉన్నట్లు అంచనా అన్నారు. మధుమేహ రోగుల్లో 80 శాతం మందికి రక్తపోటు కూడా ఉంటుందన్నారు. తెలంగాణ, హైదరాబాద్‌లలో ఇలాంటి ఉద్యోగులు అధికంగా ఉన్నందున, మధుమేహం వచ్చే అవకాశం కూడా ఎక్కువగా ఉందన్నారు. రాష్ట్రంలో మధుమేహం వ్యాప్తి శాతం 14 నుంచి 18.1 శాతం వరకు ఉందన్నారు. దేశంలో 20 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల పెద్దలలో జాతీయ సగటు కేవలం 8.7 శాతం మాత్రమేనన్నారు. ఈ పెరుగుదలకు పట్టణ జీవన శైలి, ఆహారపు అలవాట్ల లోపం, శారీరక శ్రమలేని జీవన విధానమని తెలిపారు. జయంతి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఎట్టా మాట్లాడుతూ మధుమేహం కిడ్నీ వ్యాధులకు ప్రధాన కారణమన్నారు. అవుట్‌పేషెంట్ విభాగంలో చూసే కిడ్నీ రోగులలో దాదాపు 50 శాతం మంది మధుమేహంతో ఉన్నారన్నారు. జయంతి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి న్యూరాలజిస్ట్ డాక్టర్ ప్యానమ్ ప్రణుతి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మరణాలకు, శాశ్వత వైకల్యాలకు స్ట్రోక్ ప్రధాన కారణమని చెప్పారు. ప్రతి సంవత్సరం భారతదేశంలో ప్రతి లక్ష జనాభాలో 100 నుంచి 150 మంది స్ట్రోక్‌కు గురవుతున్నారని తెలిపారు. వీరిలో సుమారు 65 శాతం మంది



మధుమేహ రోగులు ఉన్నారన్నారు. జయంతి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సుందర్ సింగ్ మాట్లాడుతూ జీవనశైలిలో మార్పులు, ఆహార నియంత్రణ, ధ్యానం, వైద్య చికిత్స ద్వారా మధుమేహాన్ని, దాని నుంచి వచ్చే సంక్లిష్టతలను సమర్థంగా నియంత్రించవచ్చని చెప్పారు. ముఖ్యంగా తక్కువ కార్బోహైడ్రేట్లు, 20 నుంచి 25 శాతం ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు (హెల్తీ ఫ్యాట్) ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. మైదా పదార్థాలను పూర్తిగా నివారించాలన్నారు.

## రోడ్డుపై చెత్త వేసిన వారికి జరిమానా తప్పదు

**నిజాంపేట, నవంబర్ 13 (జనం సాక్షి) :** కుతుబుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ పరిధిలో బహదూర్ పల్లి వార్డ్ డబుల్ బెడ్ రూమ్ వెళ్ళే రోడ్డుపైన చెత్త వేస్తున్న వారిని గుర్తించి, గురువారం మున్సిపల్ అధికార సిబ్బంది జరిమానా విధించడం జరిగింది, ఇద్దరు వద్ద వెయ్యి రూపాయలు జరిమానా విధించడం, మరికొందరికి చెత్త వేయెద్దు చెత్త వేయడం వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ ప్రజలు మన పరిసరాలను పరిశుభ్రంగా చూసుకుంటూ అవగాహన లేని వారికి తెలియచేయాలని, ముఖ్యంగా మున్సిపల్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయుట నేరము, అలా చెత్త వేసిన వారిని సీసీ కెమెరాలలో గుర్తించి వారికి పెనాల్టీ విధించబడుననీ, కావున మున్సిపల్ ప్రజలందరూ అర్థం చేసుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం, అని తెలుపుతూ చెత్తను. తడి చెత్త పొడి చెత్తగా వేరుచేసి మీ ఇంటి దగ్గరికి వచ్చే స్వచ్ఛ ఆటోలలో మాత్రమే వేయండి ని కమిషనర్ తెలిపారు, ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ సుభాష్ ,ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సాత్విక్, జవాన్ సురేందర్ పాల్గొన్నారు.




## రైతుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ఎనలేని కృషి

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి



**బొంరాస్‌పేట, నవంబర్ 13 (జనం సాక్షి) :** రైతుల సంక్షేమానికి రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఏర్పుమల్ల గ్రామంలోని ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.అనంతరం మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుకొళ్ళు చేయాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలు గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్,సీనియర్ నాయకులు అంజిల్ రెడ్డి, రామచంద్రారెడ్డి, మల్లేష్, ప్రవీణ్, సీసీ సునీత,గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి కోశాధికారి లలిత, నర్సమ్మ, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవరెడ్డి, ఎల్లప్ప గౌడ్, మహిపాల్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి,వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

## అదిబట్ల మున్సిపల్ ఆఫీసులో ఏసీబీ రైడ్స్

- ఏసీబీకి చిక్కిన టౌన్ ప్లానింగ్ అధికారి వరప్రసాద్



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 13 (జనం సాక్షి) :** లంచం తీసుకుంటూ అవినీతికి పాల్పడిన ఓ తిమింగలం ఏసీబీ వలలో చిక్కింది. ఆదిభట్ల మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పట్టణ ప్రణాళిక అధికారి వరప్రసాద్, అతని సహాయకుడు (అవుట్సోర్సింగ్) వంశీ ఏసీబీ వలకు అడ్డంగా దొరికిపోయారు. గురువారం నిందితుడు టౌన్ ప్లానింగ్ అధికారి బందెల వరప్రసాద్ లంచం తీసుకుంటుండగా ఆయనను ఏసీబీ అధికారులు పథకం ప్రకారం పట్టుకున్నారు. బందెల వరప్రసాద్ అవుట్సోర్సింగ్ అసిస్టెంట్ పడాల వంశీకృష్ణ జి ప్లస్ ఫోర్ భవన నిర్మాణ అనుమతి కోసం ఫిర్యాదుదారుని వద్ద రూ. 75 వేల లంచం స్వీకరించారు. నిందితులైన వరప్రసాద్ వంశీకృష్ణ లు తమ విధిని సక్రమంగా, నిజాయితీ లేకుండా సక్రమంగా తమ విధుల్ని నిర్వర్తించకుండా అనవసర ప్రయోజనం పొందుతున్నారని ఏసీబీ అధికారులు అన్నారు. అందువల్ల వరప్రసాద్ వంశీకృష్ణ లను అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పర్చనున్నట్లు చెప్పారు. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగిన సందర్భంలో, చట్టం ప్రకారం చర్య తీసుకోవడానికి ప్రజలు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ అంటే 1064 ను సంప్రదించాలని చెప్పారు.

# పాన్ మసాలాను దొంగలించిన దుండగుల అరెస్టు

- ఇద్దరి దుండగులను జైలుకు తరలింపు
- ఇతర దుండగుల కోసం ముమ్మర గాలింపు
- వివరాలను వెల్లడించిన జహీరాబాద్ డిఎస్పీ

**న్యాల్‌కల్, నవంబర్ 13, (జనం సాక్షి) :** కర్ణాటకలోని బీదర్ నుండి మధ్యప్రదేశ్‌కు అక్రమంగా పాన్ మసాలాను తరలిస్తున్న ఓ లారీని.. మేము పోలీసుల మంటూ పట్టపగలె చోరీకి పాల్పడ్డ దుండగులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. ఇద్దరు దుండగులను జైలుకు తరలించగా.. పరారీలో ఉన్న మరికొందరి దుండగుల కోసం ముమ్మర గాలింపు చేపట్టారు. జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ ఆదేశం మేరకు గురువారం సాయంత్రం జహీరాబాద్ డిఎస్పి సైదా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బీదర్ లోని ఆర్ కే ప్రొడక్ట్స్ కర్మాగారం నుండి పాన్ మసాలాను ఈ నెల 10న మధ్యాహ్నం జహీరాబాద్ – బీదర్ రోడ్డు, న్యాల్ కల్ మండలంలోని గంగువార్ గ్రామ శివారు వద్ద రూ:19.59 లక్షల విలువచేసే పాన్ మసాలాను లారీలో తరలిస్తుండగా.. కొందరు దుండగులు మాటువేసి.. మేము పోలీసులమంటూ, భయభ్రాంతులకు గురిచేసి పాన్ మసాలాను తరలిస్తున్న లారీని అదుపులోకి తీసుకొని పరారయ్యారు. లారీలో ఉన్న ఓ వ్యక్తివద్ద నుండి రూ:42 వేల నగదును దోచుకున్నారు. రవి సూర్యకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి వెంటనే ముమ్మర గాలింపు చేపట్టారు. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు పర్యవేక్షణలో.. స్థానిక ఎస్సై సుజిత్, రాయికోడ్ ఎస్సై చైతన్య కిరణ్, ఝరాసంఘం ఎస్సై పాటిల్ క్రాంతి, జహీరాబాద్ రూరల్ పోలీసుల బృందం సుభాష్, రాజశేఖర్, అశోక్, సాయికిరణ్, మహేష్, శ్రీకాంత్, అప్రోచ్, సాయికుమార్, తదితరులు పాన్ మసాలా తోపాటు లారీని అపహరించిన దుండగుల కోసం మూడు రోజుల పాటు ముమ్మర గాలింపు చేపట్టారు. ఇద్దరు నిందితులు, లారీని పట్టుకోవడంలో సఫలీకృతమయ్యారు.

### మమ్మద్ ఖరీం, సక్లేన్‌ల అరెస్ట్, జైలుకు తరలింపు...

పట్టపగలే చోరీకి పాల్పడ్డ పలువురి నిందితుల్లో ఇద్దరినీ అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం స్థానిక హద్నూర్ పోలీస్ స్టేషన్ లో డి.ఎస్.పి వివరాలను వెల్లడించారు. జహీరాబాద్ చెందిన మమ్మద్ ఖరీం (32), బీదర్ కు చెందిన సక్లెన్ (26) లను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరికొందరి దుండగుల కోసం గాలింపు చేపడుతున్నట్లు, అతి త్వరలోనే అదుపులోకి తీసుకొని.. అరెస్టు చేసి, జైలుకు తరలించినట్లు డి.ఎస్.పి వెల్లడించారు. రూ:19.59 లక్షల విలువగల పాన్ మసాలా, రూ:15 లక్షల విలువగల లారీని అదుపులో తీసుకున్నట్లు వెల్లడించారు. రూ:42 వేలను దొంగలించిన దుండగుడు పరారీలో ఉన్నట్టు తెలిపారు. పట్టపగలే చోరీకి పాల్పడ్డ దుండగుల (ఇద్దరు)ను, లారీని త్వరితగతిన అదుపులోకి తీసుకోవడం పట్ల.. స్థానిక సీఐ, ఎస్సైలు, పోలీసుల బృందాన్ని డి.ఎస్.పి అభినందించారు.



జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
14 నవంబర్ 2025

# రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలి

- **వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే**
- **సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వాలి**
- **ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**



**సదాశివపేట, నవంబర్ 13 (జనం సాక్షి) :** రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. గురువారం సదాశివపేట మార్కెట్ యార్డులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడం ప్రభుత్వం బాధ్యత అని పేర్కొన్నారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాలు తగినంత గనులు, బరువులు, గోడౌన్ సౌకర్యాలు, తూకం పరికరాలు సిద్ధంగా ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొలత, రవాణా నిల్వ, చెల్లింపు ప్రక్రియలో పారదర్శక తప్పనిసరిగా పాటించాలని రైతులను ఎక్కడ ఇబ్బంది పెట్టకూడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దళారీ వ్యవస్థ లేకుండా చేసి దేశానికి ఆదర్శంగా ధాన్యం పండించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ రత్నాకర్ రెడ్డి, వ్యవసాయ శాఖ ఏవో రమేష్, మార్కెట్ కమిటీ అధికారి శ్రీనివాస్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ పాండు నాయక్,బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న,పట్టణ ప్రధాన కార్యదర్శి పిల్లి గుండ్ల వీరేశం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడిల సుమిత్ర సుధీర్ రెడ్డి, మాజీ రైతు సమన్వయ సమితి చైర్మన్ అమరేందర్ రెడ్డి, మాజీ మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు మునిగే నవీన్ ,మాజా ఎంపీటీసీలు సునీత సుధాకర్, అహమ్మద్, రవి, శివకుమార్, అశోక్, మాజీ సర్పంచ్లు లక్ష్మారెడ్డి, దశరథ్, సంగమేశ్వర్, మానయ్య, చంద్రన్న, సలావుద్దీన్, సిద్ధన్న, నల్లల్ల కుమార్, శేఖర్, రాములు, హనుమంత్ రెడ్డి, మాణిక్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ మైపాల్, బిఆర్ఎస్ నాయకులు నాగేష్, అనురాధ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి,చోటు, శ్రీరాములు గౌడ్, గోపాల్ రెడ్డి, వీరారెడ్డి, శంభో ప్రసాద్, శ్రీశైలం, తొంట రాజు, అక్షయ్, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన




**సంగారెడ్డి, నవంబర్ 13 (జనం సాక్షి) :** జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం లో భాగంగా నంది కంది గ్రామపంచాయతీ లోని జిల్లా ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలనిర్మూలన పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంలో జిల్లా మహిళా సాధికారిత కేంద్రం సమన్వయ కర్త పల్లవి మాట్లాడుతూ... బాల్య వివాహాలు నిషేధ చట్టం 2006 గురించి, పోష్ యాక్ట్ , పోక్స్ యాక్ట్,హెల్ప్ లైన్ నంబర్స్, సోషల్ మీడియా, ఆడపిల్లల ప్రాముఖ్యత, విద్య యొక్క ప్రాముఖ్యత తదితర అంశాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త, పంచాయతీ సెక్రెటరీ, మెడికల్ ఆఫీసర్, పాఠశాల ప్రిన్సిపాల్, జెండర్ స్పెషలిస్ట్, హెల్త్ ఎడ్యుకేటర్, ఏ యన్ యమ్, ఆశ వర్కర్స్, అంగన్వాడీ టీచర్స్ , స్కూల్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు సజావుగా జరగాలి

- **అదనపు కలెక్టర్ నగేష్**



**కౌడిపల్లి, నవంబర్ 13 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ గురువారం రోజు జిల్లా పరిధిలోని కౌడిపల్లి మండలం రాయిలాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు జరుగుతుందో లేదో స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... రైతులకు ప్రభుత్వం మద్దతుధర కింద ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతోందని తేమ శాతం నిర్దేశిత ప్రమాణాలకు లోబడి ఉండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని ఎలాంటి భయాందోళన లేకుండా కొనుగోలు కేంద్రాలకు తేవాలని కోరారు. అలాగే ధాన్యం తూకాలు సక్రమంగా జరుగుతున్నాయా గోదాముల్లో నిల్వ సదుపాయాలు ఉన్నాయా గన్ని బ్యాగ్ లు సమృద్ధిగా ఉన్నాయా వంటి అంశాలను ఆయన పరిశీలించారు. అధికారులు రైతులకు సకాలంలో చెల్లింపులు జరగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో వ్యవసాయ, సివిల్ సప్లైస్, మార్కెటింగ్ శాఖ అధికారులలో పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- **గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్**



**గద్వాల నడిగడ్డ, నవంబర్ 13 (జనం సాక్షి) :** జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు అంగన్వాడి కేంద్రాల్లో పెండింగ్ లో ఉన్న వివిధ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో అంగన్వాడి కేంద్రాల్లో చేపట్టిన వివిధ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఐసిడిఎస్,ఎన్ఆర్ఈజీఎస్,ఆర్థిక సంఘం నిధులతో ఆయా కేంద్రాల్లో మరుగుదొడ్లు, నీటి వసతి,విద్యుత్ సౌకర్యం,తదితర పనులు సకాలంలో పూర్తి కాకపోవడానికి కారణాలేంటని అడిగారు. ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించి డిసెంబర్ 15 లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న పలు అంగన్వాడీ కేంద్రాల భవనాలు కూడా ఫిబ్రవరిలోగా పూర్తి కావాలన్నారు. జిల్లాలోని 69 అంగన్వాడీ కేంద్రాల ఆవరణలో కూరగాయల సాగుకు పోషణ్ వాటికల నిర్మాణ పనులు కూడా ఈనెల చివరిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ సౌకర్యం లేని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్దేశిత గడువులోగా కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాల్లో పనుల పురోగతిపై తాను తరచు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానన్నారు. ఆయా మండలాల్లో చేపట్టిన పనులను సంబంధిత ఇంజనీర్లు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు.విధుల్లో అలసత్వం వహించే అధికారులపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, జిల్లా సంక్షేమ అధికారిని సునంద, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి,జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అక్బర్, మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రెడ్డి, పలువురు డిప్యూటీ ఈఈలు, ఏఈఈ లు, సిడిపిఓలు, తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేద్దాం

- **సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తాజుద్దీన్**




**సదాశివపేట, నవంబర్ 13 (జనం సాక్షి) :** డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. తాజుద్దీన్ పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. సదాశివపేట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో సిపిఐ పార్టీ పుట్టి డిసెంబర్ 26 నాటికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సీపీఐ రాష్ట్ర కమిటీ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసిందన్నారు. ఈ బహిరంగ సభకు 40 దేశాల నుండి ప్రతినిధులు హాజరవుతారని, వంద సంవత్సరాల సీపీఐ ప్రస్థానంలో ఆ రోజుల్లో భారతదేశాన్ని బ్రిటిష్ వాళ్ళు ఏలుతున్న సమయంలో ఈ దేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని డిమాండ్ చేసింది సిపిఐ పార్టీ అని తెలిపారు. బ్రిటిష్ హయంలో సిపిఐ పార్టీ మీద అనేక కుట్ర కేసులు పెట్టినప్పటికీ అన్నిటిని తట్టుకొని నిలబడి ప్రజల కోసం కనబడిందని, మహత్తర చరిత్ర కలిగిన సిపిఐ పార్టీ సభకు సదాశివపేట ఈ ప్రాంతం నుండి అధిక సంఖ్యలో జనం పాల్గొని సభను జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లాకార్యవర్గ సభ్యులు ఎండి షఫీ , ఏఐ టియుసి మండల కార్యదర్శి శంకరప్ప, బి కే ఎం యు మునిపల్లి మండల కార్యదర్శి గంగమ్మ సాధిక్ అలి బుజ్జమ్మ వెంకట్ గౌడ్ బీ పాషా, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## భూ కబ్జాదారులను గుర్తించి కఠినంగా శిక్షించాలి

- **బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడెల్లి రవీందర్**



**అమీన్‌పూర్, నవంబర్ 13 (జనం సాక్షి) :** భూకబ్జారాయుళ్లు తప్పుడు డాక్యూమెంట్లు సృష్టిస్తూ ప్రభుత్వ స్థలాలు ప్రయివేటు స్థలాలు కబ్జాచేస్తున్నవారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని వారి ఆస్తులు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడెల్లి రవీందర్ డిమాండ్ చేశారు. భూకబ్జారాయుళ్లను కఠినంగా శిక్షించాలని కోరుతూ గురువారం అమీన్పూర్ ఇన్స్పెక్టర్ నరేష్, పటాన్చెరు డి.ఎస్.పి ప్రభాకర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు భూకబ్జాదారులకు వరంగా మారినాయన్నారు. తప్పుడు డాక్యూమెంట్లతో ప్రభుత్వ స్థలాలు కబ్జాచేస్తూ వందల కోట్ల రూపాయలు సంపాదిస్తూన్నారని, వారిని గుర్తించి జైల్లలో పెట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల భూకబ్జాదారులు తహసీల్దార్ పై దాడిచేయడం విలేకరిపై దాడి చేయడం భూకబ్జారాయుల్లా బరితెగింపుకు నిదర్శమనివారిని తక్షణమే జైళ్లకు పంపాలని సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.డీఎస్పీని కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడెల్లి రవీందర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆగరెడ్డి, అమీనాపూర్ పట్టణ అధ్యక్షులు అనీల్ చారి, కిరణరెడ్డి, కొత్తరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పుస్తకాలతో పాటు మైదానంలో విజయం సాధించాలి



**వనపర్తి బ్యూరో, నవంబర్ 13 (జనం సాక్షి) :** పుస్తకాలతో పాటు మైదానాల్లోనూ విజయం సాధించగలిగితేనే నిజమైన విద్యార్థిగా నిలుస్తారని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, అన్నారు. గురువారం,వనపర్తి జిల్లా చిట్యాల గ్రామ శివారులోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో ఉమ్మడిమహబూబ్ నగర్,జిల్లాస్థాయి క్రీడల ముగింపు కార్యక్రమానికి వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారిగా బాధ్యతలు నిర్వర్తించడం కేవలం విధి కాదని,అది ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశమని, సీసీఎస్ విభాగం నేర నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి దర్యాప్తులో వాస్తవాలను ఆధారంగా తీసుకుని పారదర్శకంగా, సమయపాలనతో వ్యవహరించాలన్నారు. ప్రజల విశ్వాసం పొందడం పోలీసు శాఖకు అత్యంత ముఖ్యమైనదని, అశోక్ కుమార్ గత అనుభవాన్ని, వనపర్తి జిల్లాలో వినియోగించి సమర్ధత, క్రమశిక్షణతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని నేను ఆశిస్తున్నాను అన్నారు. అనంతరం క్రీడలలో గెలుపొందిన విజేతలకు ఎస్పీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- **జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్**

**ఉప్పునుంతల, నవంబర్ 13 (జనం సాక్షి) :** పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు మండల కేంద్రమైన ఉప్పునుంతల పోలీస్ స్టేషన్ ను వారు గురువారం పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్షిక తనిఖీలో భాగంగా ఉప్పునుంతల పోలీస్ స్టేషన్ను పరిశీలించడం జరిగిందని రికార్డులను పరిశీలించి పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచనలు చేయడం జరిగిందన్నారు అదేవిధంగా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదని వారు సిబ్బందికి సూచించారు ఈ కార్యక్రమంలో వారితోపాటు డిఎస్పి పల్లె శ్రీనివాసులు, సిఐ నాగరాజు, ఎస్సై వెంకట్ రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రతిభావంతులైన క్రీడాకారులకు నెలవు మెదక్ జిల్లా




**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 13 (జనం సాక్షి) :** ప్రతిభావంతులైన క్రీడాకారులకు నెలవు మెదక్ జిల్లా అని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. పాఠశాల క్రీడా సమాఖ్య మెదక్ జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 14 నుండి 16వ తేదీ వరకు నల్లగొండలో జరగనున్న ఎస్ జి ఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్బాల్ పోటీలలో పాల్గొననున్న 17 సంవత్సరాలలోపు బాలబాలికల ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు ఫుట్బాల్ కిట్స్ గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ నగేష్ అందించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతిభావంతులైన క్రీడాకారులకు నెలవు మెదక్ జిల్లా అని, క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేసిన దాత ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ సర్వీసెస్ ఎం.డి హర్ష సేవా దృక్పథాన్ని కొనియాడారు. ఫుట్బాల్ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి మన జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఫుట్‌బాల్ పట్ల మీకున్న మక్కువ మైదానాన్ని మరింత ఉత్తేజపరుస్తూనే ఉండనివ్వండని, చివరి నిమిషంలో గెలిచిన గోల్‌తో ఉత్సాహంగా గడపాలని కోరుకుంటున్నానని, ఈ సంవత్సరం ఆనందం, విజయం, ప్రేమతో హ్యాట్రిక్ సాధించండి అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా విద్యాధికారి విజయ, పాఠశాల క్రీడా సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్ నాగరాజు. పీడీలు జి మాధవరెడ్డి, జట్టు కోచ్ స్వాతి పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్నిరంగాలపై అవగాహన కలిగి ఉండాలి



**హత్నూర, నవంబర్ 13 (జనం సాక్షి) :** విద్యార్థులు విద్యనభ్యసించడంతో పాటు వ్యవసాయ, వ్యాపార తదితర రంగాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని సామాజిక కార్యకర్త వెంకట్ రెడ్డి అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని నస్తీపూర్ గ్రామంలో గురువారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల చేత కూరగాయల సంత నిర్వహించారు. కూరగాయలు విక్రయించే క్రమంలో వస్తు కొనుగోలు, అమ్మకాలు, ధరలు, డిమాండ్ తదతర అంశాలపై విద్యార్థులకు అవగాహన కలుగుతుందన్నారు.అంతే గాకుండా ప్రజలతో మాట్లాడే విధానం, వస్తువులను విక్రయించే విషయంలో శ్రద్ధ, నగదు తీసుకుని మిగతా డబ్బులు ఇచ్చే క్రమంలో లెక్కలు తెలుస్తాయన్నారు.కూరగాయల సంత నిర్వహించడం ద్వారా విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో శిక్షణ ఇచ్చినట్లయిందని గ్రామ పంచాయతీ కార్యదర్శి యాదయ్య అన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోక్ నాథ్,శ్రీనివాస్,ప్రవళిక, సాయిలు,నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

# ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల ప్రక్రియను వేగవంతం చేయాలి

- **అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 13 (జనం సాక్షి) :** ప్రస్తుత విద్యా సంవత్సరంలో షెడ్యూల్ కులాలకు సంబంధించి ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం పెండింగ్‌లోని రెన్యూవల్, నూతన రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సంబంధిత ప్రిన్సిపల్స్‌ను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని అడిటోరియంలో వసతి గృహాల సంక్షేమాధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా వాటిని విద్యార్థులకు స్కాలర్షిప్ల రూపంలో ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. చదువుకునే పేద పిల్లలకు ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు అండగా ఉంటాయని, డబ్బు సమస్య లేకుంటే విద్యార్థి చదువుపై ధ్యాస ఉంటుందని, చదువులో చక్కగా రాణిస్తారన్నారు. అర్హులైన ఏవిద్యార్థి నష్టపోకుండా ఉపకార వేతనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. 2025-26కు సంబంధించి పాఠశాల మరియు కళాశాల స్థాయిలో పెండింగ్‌లో దరఖాస్తుల పునరుద్ధరణ (రెన్యూవల్), ప్రస్తుత విద్యా సంవత్సరంలో పెండింగ్‌లోని నూతన రిజిస్ట్రేషన్ ప్రక్రియతో పాటు బయోమెట్రిక్‌ను పూర్తి చేయాలని సూచించారు. గడువులోగా హార్డ్‌కాపీలను సంబంధింత కార్యాలయాల్లో అందజేయాలని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల మరియు కశాశాలల ప్రిన్సిపాళ్లకు, ప్రతినిధులకు సూచించారు. విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో సత్వర చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. విద్యార్థులు ఎక్కువ సంఖ్యలోని కళాశాలలో బయోమెట్రిక్ ద్వారా పూర్తి చేయాలని, ఈ-పాస్ లాగిన్‌లో విద్యార్థుల బ్యాంకు వివరాలు తప్పుగా నమోదైతే సరిచేయాలన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన ధ్రువపత్రాలు అన్ని సిద్ధం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు ఉపకార వేతనాలకు నిధుల కొరత లేదన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ జిల్లా విద్యాశాఖాధికారి విజయ, కళాశాలల ప్రిన్సిపాళ్లు, వసతిగృహాల సంక్షేమాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ భూమి ఇస్తామని ఇవ్వట్లేదు

- మూడేళ్లుగా కరువులో బతుకుతున్నాం
- ఆదివాసీల ఆవేదన
- త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం : కలెక్టర్, ఎమ్మెల్యే



ఖానాపూర్ నవంబర్ 13 (జనం సాక్షి) : మైసంపేట, రాంపూర్ గ్రామాల ను అటవీ ప్రాంతం నుండి టైగర్ జోన్ పేరుతో మైదాన ప్రాంతాలకు తరలించే క్రమంలో పునరావాసం కల్పిస్తూ కడెం మండలంలోని కొత్త మద్దిపడిగా శివారులో 94 మంది ఆదివాసీలకు ప్రభుత్వం ఆవాసాలు ఏర్పాటు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా తమకు వ్యవసాయ భూములు కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికి వర్తింపచేయడం లేదని వారు కలెక్టర్ అభిలాష అభినవ్ తో పాటు ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్, అటవీశాఖ అధికారులతో ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నియోజకవర్గ సమస్యలపై అధికారులతో రివ్యూ సమావేశం సందర్భంగా వారు అధికారులు ఎమ్మెల్యేలు కలిశారు. ఈ సందర్భంగా ఒక్కో కుటుంబానికి 2.32 గుంటల వ్యవసాయ భూమి వర్తింపజేశారని ఈ లెక్కలు కాగితాలకే పరిమితం కావడం శోచనీయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఆవాసాలు ఏర్పాటు చేసినప్పటికీ సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని నాసిరకం నిర్మాణాలు చేసి తమ ప్రమేయం లేకుండానే బిల్లులు కాజేశారని వారు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. భూములు కేటాయించారు ఆన్లైన్లో ఎక్కించారు పాసు పుస్తకాలు ఇవ్వలేదు, రైతుబంధు వర్తించట్లేదు అని వారు ఆవేదనతో చెప్పారు. భూమి చదును పేరుతో అధికారులు రావడం ఆగమాగం చేయడం అక్కడి నుండి వెళ్లిపోవడం తప్ప మాకు ఒరగబెట్టిందేమీ లేదని వారు కలెక్టర్ కు విన్నవించుకున్నారు. వ్యవసాయ భూములు కేటాయిస్తామని, త్రీ పేస్ కరెంటు ఇస్తామని, వ్యవసాయ క్షేత్రానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని, పించింగు వేయిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి తమను అటవీ ప్రాంతం నుండి మైదాన ప్రాంతానికి తరలించారని ఇప్పటికి ఏ ఒక్క ఎకరా భూమి మాకు వర్తించకపోవడం బాదేస్తుందని వారు ఈ సందర్భంగా వాపోయారు. గత మూడు సంవత్సరాల కాలంగా వ్యవసాయం చేసుకోలేక కూడుకు కష్టమై దినదిన గండంగా బ్రతుకుతున్నామని వారు స్పష్టం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను వెంటనే ఆదేశించారు. వెంటనే సర్వే చేయించాలని, భూమి చదును చేయించాలని ఆదివాసీలకు వర్తింపజేయాలని అన్నారు. స్పందించిన కలెక్టర్ అతి త్వరలో ఈ సమస్యను పరిష్కరిస్తామని కచ్చితంగా హామీ ఇవ్వడంతో వినతిపత్రం సమర్పించి ఆదివాసీలు వెనితిరిగారు.

# విద్యార్థుల్లో జీవన నైపుణ్యాల వృద్ధికే 'స్ఫూర్తి'

- వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద
- రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్ఫూర్తి కార్యక్రమం
- మానసిక దృఢత్వాన్ని పెంపొందేంచే మూడు షార్ట్ ఫిలింలను విద్యార్థులతో కలిసి వీక్షించిన కలెక్టర్



వరంగల్ ప్రతినిధి, నవంబర్ 13 (జనంసాక్షి): విద్యార్థుల్లో జీవన నైపుణ్యాల వృద్ధికి, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడానికే "స్ఫూర్తి" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద అభిప్రాయపడ్డారు. గురువారం వరంగల్ నగర పరిధి రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో జరిగిన స్ఫూర్తి కార్యక్రమంలో కలెక్టర్ సత్య శారద, జిల్లా పరిషత్తు సీఈఓ, ఇంచార్జి డిఆర్డీఓ రామిరెడ్డి లతో కలసి హాజరైనారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించి వారు భవిష్యత్తులో ఏం కావాలనుకున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని కనుగుణంగా క్రమశిక్షణతో ఇష్టపడి చదవాలన్నారు. ఈ సందర్భంగా మానసిక దృఢత్వాన్ని కల్పించే మూడు వీడియోలను ప్రదర్శించి అందులో ఉన్న నీతిని కలెక్టర్ విద్యార్థుల నుండి రాబట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు భయం వీడితే ఏదైనా సాధించగలరని జిల్లా స్థాయి లో పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని నెలకొల్పే విధంగా ప్రేరణ కలిగిస్తున్నామని తెలిపారు. విద్యార్థులలో ధైర్యం లోపించడం వలన సరైన విద్యను అభ్యసించలేకపోతున్నారని, సమాజంలో జరుగుతున్న ప్రతి విషయం పట్ల ధైర్యం ప్రదర్శించి నప్పుడే విద్యార్థుల్లో నిజమైన సృజనాత్మకత వెలు వడు తుందన్నారు. ఆరోగ్యకరమైన పిల్లలను నిర్మించడానికి, శారీరక అభివృద్ధితో పాటు మానసిక అభివృద్ధిపై దృష్టి సారించి ఈరోజు స్ఫూర్తి కార్యక్రమం ద్వారా నేడు దాదాపు 100 పాఠశాలల్లో జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, విశ్రాంత ఉపాధ్యాయులు, వివిధ రంగాల నిష్ణాతులతో విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలు, పోటీతత్వం, అడ్డంకులు, సవాళ్లు, సమయం స్ఫూర్తి, ఒత్తిడిని జయించి సామర్థ్యాలు పెంపొందించు. కోవడం పై వివరించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో నిర్వహిస్తున్న స్ఫూర్తి కార్యక్రమాన్ని త్వరలో ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలకు విస్తరిస్తామని అన్నారు. విద్యార్థి వారి నుండి భయాన్ని తొలగిస్తే వారు మరింత సృజనాత్మకంగా మరియు తెలివిగా తీర్చి దిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. అంతకుముందు ఉపాధ్యాయులు హాజరు రిజిస్టర్, ఫిర్యాదుల పెట్టెలో ఫిర్యాదులను, మధ్యాహ్న భోజనం, రాగి జావా నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు మెరుగైన విద్య బోధించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే నేరుగా ఫిర్యాదుల పెట్టెలో వేయాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. మెనూ పాటిస్తూ నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయురాలు వనజ, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమాజానికి మెరుగైన వైద్య సేవలు అందించాలి

- విద్యార్థులు విద్యలో నైపుణ్యం పొందాలి
- ప్రభుత్వం రాష్ట్రాన్ని మెడికల్ హబ్ గా అభివృద్ధి చేసేందుకు చర్యలు
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 13 (జనంసాక్షి) : వైద్య కళాశాలలో వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు ఏకాగ్రతతో చదివి సమాజానికి విలువలతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో 2025 సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సులేమాన్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వైద్య విద్యార్థులు ఏకాగ్రతతో చదివి సమాజానికి మంచి వైద్య నైపుణ్యం, విలువలతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, వసతి గృహంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 31 నాటికి గుడిపేటలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రాన్ని మెడికల్ హబ్ గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో 300 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జిల్లాలోని లక్షెట్టిపేట, చెన్నూర్, బెల్లంపల్లి ప్రాంతాలలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రతిరోజు దాదాపు 500 మంది ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆసుపత్రులు, వైద్య కళాశాల ద్వారా సమీప జిల్లాల నుండే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల నుండి ప్రజలు మెరుగైన వైద్య సేవలు ఆశిస్తారని, తదనుగుణంగా విద్యార్థులు విద్యలో నైపుణ్యం పొందాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య రంగాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, నర్సులు, సిబ్బందిని నియమించడం జరుగుతుందని, పీడియాట్రీషియన్, అనస్తీసియా, ఇతర వైద్య నిపుణులను తయారు చేసి ప్రజలకు సేవలు అందించడం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా మెడికల్ కౌన్సిల్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, నిరుపేదలకు వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 2047 రైసింగ్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా దేశానికి స్వాతంత్రం వచ్చి 100 సంవత్సరాలు 2047 నాటికి పూర్తవుతున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరం సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులకు భోజన వసతి



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : రైతుల సౌకర్యార్థం మార్కెట్ యార్డులో భోజన వసతి కల్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గురువారం ఆదిలాబాదు మార్కెట్ యార్డ్ లో ఇస్కాన్ ట్రస్ట్ సహకారముతో రైతులకు 10 రూపాయల మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని స్థానిక శాసన సభ్యులు పాయల శంకర్ తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే, డిసిసిబి అడ్డి భోజారెడ్డి రైతులకు వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల సౌకర్యార్థం ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ఇస్కాన్ వారి సహకారంతో పది రూపాయలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు బయట మార్కెట్ లో ఎక్కువ ధర ఉన్నందున తక్కువ ధరతో నాణ్యత, హైజీన్ గా ఇక్కడ భోజనం అందించడం జరుగుతుందన్నారు. అమ్మకాల కొరకు మార్కెట్ కు వచ్చిన రైతులకు, వారి వాహనాల డ్రైవర్ లకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఒక్క పూట భోజనానికి 35 రూపాయలు ఖర్చు అవుతున్నట్లు అంచనా వేసి, 15 రూ. మార్కెటింగ్ శాఖ కాంట్రిబ్యూషన్‌తో, 10 రూ. ఇస్కాన్ ట్రస్ట్ కాంట్రిబ్యూషన్‌తో, 10 రూ. రైతుల కాంట్రిబ్యూషన్ తో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి అనుమతి ఇచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇస్కాన్ ట్రస్ట్ సహకారంతో ఈ రోజు ఆదిలాబాద్ మార్కెట్లో మధ్యాహ్న భోజనం కార్యక్రమం ప్రారంభించడం శుభపరిణామనని, దేశానికి అన్నం పెట్టే రైతన్నకు ఒకపూట భోజనం పెట్టే అవకాశం దొరికిందన్నారు. జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డుల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, ఇతర అధికారులు, ఇస్కాన్ ట్రస్ట్ ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# సమాన వాటా దక్కాలంటే బీసీలకు రిజర్వేషన్లు తప్పనిసరి



హనుమకొండ ప్రతినిధి నవంబర్ 13 (జనంసాక్షి) : హన్మకొండలోని ఏకశిలా పార్క్ వద్ద బీసీ జేఏసీ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అధ్యక్షతన "బీసీల ధర్మ పోరాట దీక్ష" కార్యక్రమాన్ని జరిగింది. ఈ దీక్షను సామాజిక ఉద్యమ నాయకులు కూరపాటి వెంకటనారాయణ మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి బీసీల ధర్మపోరాట దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతో పాటు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో అగ్రవర్ణాలు కూడా వారి జనాభా ప్రకారం వారికి రిజర్వేషన్లు అనుభవిస్తుంటే, జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలకు మాత్రం బీసీల జనాభా ప్రకారం రిజర్వేషన్లను కల్పించడంలో అగ్రవర్ణాల పార్టీలు కుట్రలు చేస్తున్నాయని, బీసీలకు రిజర్వేషన్లను కల్పిస్తే, ఆధిపత్య కులాల పెత్తనం నడవదని భావించి బీసీల రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఇక నుండి బీసీలు చేసే ఉద్యమాలతో ఢిల్లీ పెద్దల దిమ్మ తిరగాలేనని ఆయన బీసీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మద్దత్తు తెలపడానికి వచ్చిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను తగ్గించి, బీసీలకు తీవ్రమైన అన్యాయం చేసి, భూగర్భంలో కలిసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదింపజేసిన బీసీ బిల్లును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటుంది.. ఆలా ఐయ్యేతే బీజేపీ కాలగర్భంలో కలవడం ఖాయమన్నారు. బీసీ ధర్మ పోరాట దీక్ష కు మాజీ స్పీకర్ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూనాచారి, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మధు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.కామారెడ్డి డిక్లరేషన్ అంటూ, బీసీలకు రిజర్వేషన్లను కల్పిస్తామంటూ, ఎన్నికల ముందు వాగ్దానాలను ఇచ్చి బీసీల ఓట్లను దండుకొని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తూతూ మంత్రంగా కులగణన చేసి, బీసీలను మభ్య పెట్టేందుకు అసెంబ్లీలో బీసీ బిల్లును ప్రవేశపెడితే తాము మద్దతు ఇచ్చామని తెలిపారు.

# రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): దొడ్డిదారిన రైతులను ముంచాలనే ఆలోచన మానుకోవాలని, రైతును ముంచే పరిస్థితి చేస్తే కఠిన చర్యలు తప్పవని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణరావు హెచ్చరించారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా పౌర సరఫరాల శాఖ, సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, డిఆర్డీఓ, రవాణా తదితర శాఖలతో వానాకాలం ఖరీఫ్ 2025-26 ధాన్యం కొనుగోలుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు జరిగిన వెంటనే రైతులకు ట్రక్ షీట్ ఇవ్వాలని, ధాన్యం విక్రయయించిన తరువాత రైతుకు ఎలాంటి సంబంధం లేదని కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలదే బాధ్యతని తెలిపారు. తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యం రవాణాలో ఇబ్బందులకు గురిచేస్తే లైసెన్సు లు రద్దు చేస్తామని తెలిపారు. పోలీస్, రవాణా అధికారులు లారీలు తనిఖీ చేయాలని ఆదేశించారు. లారీలు సకాలంలో రాక రైతులు ట్రాక్టర్లు ద్వారా రవాణా చేస్తున్నారని, ట్రాన్స్ పోర్టర్లు రైతులకు డబ్బులు ఇవ్వక ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైస్ మిల్లర్లు, ట్రాన్స్ పోర్టర్లు రైతులు పక్షాన ఉండాలని వ్యాపార దృష్టితో కాకుండా రైతుల పక్షాన ఉండాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండాలని తెలిపారు. అకాల వర్షాలు వస్తే ధాన్యం తడవ కుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎత్తు ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కొనుగోలు సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులను వ్యవసాయ రెవిన్యూ పోలీస్ అధికారులు తనిఖీ చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు ఇన్చార్జిలు రవాణాలో ఎన్ని క్వింటాలు ధాన్యం పంపిస్తున్నాం అన్నది వివరాలు నమోదు చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, ఆర్టిఓ సంధాని, సహకార అధికారి వాలియా నాయక్, వ్యవసాయ అధికారి బాబూరావు, డిఆర్డీఓ బాలకృష్ణ, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, డిఎస్పీ సంపత్ రావు, సింగిల్ విండో చైర్మన్లు, కొనుగోలు కేంద్రాల సీఈఓలు, ఏపీఎంలు, డిపిఎంలు, రైస్ మిల్లర్లు సంగం అధ్యక్షులు తిరుపతి పాల్గొన్నారు.

# విధులకు 'డుమ్మా' కొట్టిన హాస్టల్ వార్డెన్

- హాస్టల్లో సరిగ్గా విధుల్లో ఉండడం లేదంటూ గ్రామస్తుల ఆరోపణ





మంగపేట నవంబర్ 13(జనంసాక్షి) : మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహములో విధులను నిర్వహిస్తున్న వార్డెన్ గురువారం విధులకు 'డుమ్మా ' కొట్టాడు. గురువారం జనంసాక్షి తిమ్మంపేట ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహంలో చలికాలం పిల్లలకు అందుతున్న వసతుల వివరాల కోసం వెళ్లగా హాస్టల్ వార్డెన్ అందుబాటులో లేడు. ఈ విషయంపై హాస్టల్ సిబ్బందిని అడగగా బుధవారం ఉదయమే వార్డెన్ ఇంటికి వెళ్లడం జరిగిందని ఈరోజు కూడా విధులకు హాజరుకాలేదని ఏదో వ్యక్తిగత కారణాలు ఉన్నాయని ఈరోజు కూడా విధులకు రావడం లేదని వార్డెన్ తెలిపినట్లు సిబ్బంది తెలిపారు. ఈ విషయంపై ఏటీడీవో అధికారిని వివరణ అడగగా సంబంధిత వార్డెన్ ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని సెలవు కూడా పెట్టలేదని తెలిపారు. ఈ విషయంపై గ్రామస్తులను అడగగా వార్డెన్ హాస్టల్ లో అందుబాటులో సరిగ్గా ఉండడం లేదని గతంలో ఇక్కడ విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన వార్డెన్ నిరంతరం హాస్టల్ లోనే ఉండేవారని కానీ ఈ వార్డెన్ సరిగ్గా విధుల్లో ఉండడం లేదు అని వారు తెలిపారు. ఇలా విధులకు హాజరుకాకుండా వ్యక్తిగత పనులతో వెళితే హాస్టల్లో ఉండే నిరుపేద విద్యార్థులు పరిస్థితి ఏంటి అని విద్యార్థులకు ఏమన్నా జరిగితే ఎవరు బాధ్యులు అని గ్రామస్తులు ఆరోపించారు. అలాగే రాత్రి సమయాల్లో హాస్టల్ లోని బియ్యం కూడా బయటకు తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా వారు కోరారు.

**విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు : ఏటీడీవో అజయ్ కుమార్**

తిమ్మంపేట గిరిజన బాలుర వసతి గృహం వార్డెన్ విధులకు గైహాజరైనట్టు తమకు తెలవదని ముందస్తుగా ఎటువంటి సమాచారం కూడా ఇవ్వలేదని సెలవు కూడా ఇవ్వలేదని విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఈ విషయంపై విచారణ చేపట్టి కచ్చితంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# వరద బాధితులకు అండగా నిలిచిన ప్రభుత్వం

- విపక్షాలు బురద రాజకీయాలు చేయడం సిగ్గుచేటు
- వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి



హనుమకొండ ప్రతినిధి నవంబర్ 13 (జనం సాక్షి) : వరదల కారణంగా దెబ్బతిన్న ఇళ్లకు ప్రభుత్వం సత్వరమే ఆర్థిక సహాయం అందిచడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,ప్రభుత్వానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గురువారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని అధ్యక్షతన మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ మీడియా సమావేశంలో పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య,ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు,నగర మేయర్ గుండు సుధారాణి,వరంగల్ జిల్లా అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ కూడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి . పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూమొంథా తుఫాన్ కారణంగా హనుమకొండ, వరంగల్, కాజీపేట ప్రాంతాల్లో తీవ్రంగా దెబ్బతిన్న ప్రజల ఇళ్లకు నష్టపరిహారం మంజూరు చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు .తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ఇళ్లను ముఖ్యమంత్రి క్షేత్ర స్థాయిలో పరిశీలించి, బాధితులకు అండగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి బాధితులకు అండగా నిలబడి ఆర్థిక సహాయం.మొత్తం రెండు జిల్లాలకు హనుమకొండ జిల్లాకు రూ. 7.03 కోట్లు, వరంగల్ జిల్లాకు రూ. 5.05 కోట్లు,మొత్తం రూ. 12.08 కోట్ల వరద సాయం మంజూరు చేయడం జరిగింది. ప్రత్యేకంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 48 కాలనీలు నీట మునిగాయి. మొత్తం 4,790 ఇళ్లు వరద నీటిలో దెబ్బతిన్నాయి. ఆ నష్టానికి ప్రభుత్వం రూ. 7,18,50,000 నిధులు విడుదల చేసింది.మీ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిని అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదు అని ఎమ్మెల్యే నాయిని అన్నారు.ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇవి శ్రీనివాస్ రావు,గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,మునిసిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు కార్పొరేటర్లు,ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
14 నవంబర్ 2025

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 13 (జనంసాక్షి) :** బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో జిల్లా బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బీసీల ధర్మ పోరాట దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ చలమల్ల నర్సింహ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హసేన్, బీసీ కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ జనాభాలో 60 శాతమున్న బీసీలను ఓట్లు వేసే యంత్రాలు లాగా చూస్తున్నారే తప్ప వారి సంక్షేమం,అభివృద్ధి కోసం కృషి చేయలేదని అన్నారు. ఇప్పటికైనా పార్టీలకతీతంగా అన్ని రాజకీయ పార్టీల బీసీ నాయకులు,అన్ని బీసీ కుల సంఘాల నాయకులు, ప్రజా సంఘాలు, ఏకమై పెద్ద ఎత్తున పోరాటాలు చేసి 42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా వచ్చే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా నాయకులు మట్టపల్లి సైదులు, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు గట్ల రమశంకర్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నిద్ర సంపత్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# దయనీయ స్థితిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- కన్నేకల్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో కనిపించని కనీస సౌకర్యాలు
- చోద్యం చూస్తున్న అధికారులు ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు

**మాడ్గులపల్లి, నవంబర్ 13 (జనంసాక్షి) :** అన్నదాతలుఆరుగాలంకష్టపడివ్యాయాప్రాయాసాలను ఓర్చుకొని పండించిన పంటను ప్రభుత్వం మద్దతు ధరలు అందించి ఆదుకోవాలని ఆలోచనతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని జిల్లా కలెక్టర్ ముందస్తుగా ఆదేశించినప్పటికీ నిబంధనలు పాటించడంలో కొంతమంది అధికారులువిఫలం అవుతున్నారు. మాడ్గులపల్లి మండలం కన్నెకల్ గ్రామంలో నిడమనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసర మైన కనీస సౌకర్యాలు కల్పించకపోవడం శోచనీయం. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు త్రాగునీరు, టెంటు, విద్యుత్ , పట్టాలు, ఇతర వసతులు ఏవి కల్పించకపోవడంతో అన్నదాతలు ధాన్యాన్ని ఆరబెట్టినందుకు వచ్చి మండుతున్న ఎండలతో ఇబ్బందులు



పడుతున్నారు. అంతే కాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్చార్జిగా వ్యవహరిస్తు న్న స్థానిక వ్యక్తి తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుం డడంతోరైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో సీరియల్ ను పాటించకపో వడం, నిబంధనలకు విరుద్ధంగా అధికం ధాన్యం తూకం వేయడం, ధాన్యం ఎగుమ తి చేసేందుకు వచ్చిన లారీకి రైతుల నుండి బస్తాకి ఒక్క రూపాయి వసూలు చేయడం, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీ రాని పరిస్థితిలో రోడ్డుపైన నిలిపిన లారీ వద్దకు ధాన్యాన్ని చేరవేసేందుకు ట్రాక్టర్ ను ఏర్పాటు చేసి బస్తాకు 5 రూపాయలు రైతుల నుండి వసూలు చేయడంతో పాటు హమాలీ మాములు తదితర కారణాలతో రైతుల నుండి ధాన్యాన్ని డబ్బులను వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన రైతులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నత అధికారులకు విన్నపించినప్పటికీ నిర్వాహకుడి ప్రవర్తనలో మార్పు రాకపోవడం విశేషం. ఇంత జరుగుతున్నప్పటికీ ఇటు అధికారులు కానీ అటు సహకార సంఘం పాలకవర్గం కానీ ఇతనిపై చర్యలు చేపట్టకపోగా అతన్ని తప్పులను కప్పిపుచ్చి రైతులకు నచ్చజెప్పి వెళ్లిపోవడం విశేషం. దీంతో తనకు ఎవరు అడ్డు లేరనే అహంభావంతో కాంటాలు వేసిన వందలాది ధాన్యం బస్తాలను ఎండలోనే దిగుమతి చేయకుండా ఉంచడంతో బరువు తగ్గిపోయి మిల్లర్లు దిగుమతి చేసుకునే సమయంలో కొర్రీలు పెట్టే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతు న్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో కుప్పలు తెప్పలుగా ధాన్యం వచ్చి ఉండగా 17 శాతం తేమ వచ్చి తూకం వేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ అవసరమైన బస్తాలు లేకపోవడంతో కాంటాలు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని బట్టి ఈ కేంద్రంలో ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టారో అర్థం అవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు స్పందించి కన్నేకల్ ధాన్యం కొనుగోలు కేంద్రంపై దృష్టి పెట్టి కేంద్రంలో జరుగుతున్న అవినీతి కి అడ్డుకట్ట వేసి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు అవసరమైన వసతులు కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## సహజ సిద్ధంగా పండించే పంటలతో ఆరోగ్యకరం

**మునుగోడు, నవంబర్ 13 (జనం సాక్షి) :** జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మునుగోడు నియోజకవర్గంలోని కిష్టాపురం గ్రామంలో రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా యువరైతు జక్కుల వెంకటేశ్ పండిస్తున్న సహజ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహజ పంటలను ఏ విధంగా పండిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ పంటల వలన లాభాలు, పంటలు ఏ విధంగా ఉన్నాయి,ఈ పంటలకు కావలసిన సహజ ఎరువులు వాటి వివరాలు అడిగారు. జీవామృతం, జీవగణామృతం,వాడతామని రైతు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్, ఆర్డీవో శ్రీదేవి,జిల్లా అనంతరెడ్డి,ఏడి వేణుగోపాల్ రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల మేరకే ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్




**నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 13 (జనం సాక్షి) :** జిల్లాలో గుర్తించిన ప్రాంతాలలో నిబంధనల మేరకే ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో కలెక్టర్ అధ్యక్షతన డి.ఎల్.ఎస్.సి (డిస్టిక్ లెవెల్ స్యాండ్ కమిటీ) సమావేశం ఏర్పాటు చేశారు. మాగనూర్ మండలం గజరాన్ దొడ్డి గ్రామానికి చెందిన రైతు పట్టా భూమిలో దాదాపు 7743 క్యూబిక్ మీటర్ల ఇసుకను తొలగించాలని దరఖాస్తు చేసుకోగా గురువారం నాటి సమావేశంలో ఆ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఇసుక తరలింపు విషయంలో మైనింగ్, రెవెన్యూ, భూగర్భ జల శాఖ, సర్వే ల్యాండ్, నీటి పారుదల,వ్యవసాయ శాఖల అధికారుల నివేదికలు, అభిప్రాయాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మైనింగ్ ఏడి గోవింద రాజు మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు ఇచ్చిన నివేదికలన్ని సరిగ్గా ఉన్నాయని, దరఖాస్తుదారుని పట్టా భూముల నుంచి ఇసుక తొలగించేందుకు అనుమతులు ఇవ్వ వచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. అన్ని శాఖల అధికారులు రిపోర్టుల ఆధారంగా అనుమతికి కలెక్టర్ అంగీకారం తెలిపారు. అంతకు ముందు జరిగిన సమావేశంలో కొడంగల్ నియోజక వర్గంలోని కోస్గి, కొత్తపల్లి, గుండుమల్, మద్దూరు మండలాల్లో పీ ఆర్, అర్ అండ్ బి, పాఠశాలలు, కళాశాలలు, బీటీ రోడ్లు, వసతి గృహాల నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక, అలాగే జిల్లా కేంద్రంలోని అప్పక్ పల్లి జిల్లా ఆసుపత్రి పక్కన నిర్మిస్తున్న నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణానికి, ఎం.సీ. హెచ్ (మదర్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్) భవన నిర్మాణానికి ఎంత ఇసుక అవసరం అనే విషయమై కలెక్టర్, అదనపు కలెక్టర్ సంబంధిత అధికారుల నుంచి వివరాలను తీసుకున్నారు.

# రైతుల భూ సమస్యలను వెంటనే పరిష్కరించండి



**కల్లూరు, నవంబర్ 13 (జనం సాక్షి) :** రైతులకు చెందిన న్యాయపరమైన భూములకు సంబంధించిన సమస్యలు వెంటనే పరిష్కరించాలంటూ రాష్ట్ర రెవెన్యూ సమాచార గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సత్తుపల్లి నియోజకవర్గం 5 మండలాల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని నారాయణపురం స్వగ్రామంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గృహం వద్దకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. చిన్న చిన్న సమస్యలు కూడా నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని, అన్ని హక్కులు ఉన్నప్పటికిని తమ భూములను వేరే వాళ్ళకి రాశారని, ఇతరత్రా వాస్తవమైన భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని మంత్రి దృష్టికి వినతి పత్రాల ద్వారా తెలియపరిచారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొంతమంది చేతివాటం చూపిస్తూ రైతుల దగ్గర గన్ని సంచుల కోసం, మెయింటెనెన్స్ కోసం అంటూ డబ్బులు వసూలు చేస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని పలువురు రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సిద్ధం చేసుకున్న ధాన్యాన్ని కాటాలు వేయట్లేదని, అధికారుల పర్యవేక్షణ లేదని, నిర్వాహకులు ఇతర వ్యక్తుల ప్రమేయంతో ఇష్టారాజ్యంగా మారిందని రైతులు మంత్రికి తెలపడంతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి వెంటనే జిల్లా కలెక్టర్ తో ఫోన్లో ఈ విషయం చెప్పి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం నారాయణపురం గ్రామంలో కిక్క రెడ్డి ఈశ్వర్ రెడ్డి పద్మ లక్ష్మీ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ గృహాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాసిల్దార్ పులి సాంబశివుడు, సత్తుపల్లి తాసిల్దార్ పున్నం సత్యనారాయణ, పెనుబల్లి తాసిల్దార్ శ్రీనివాస్ యాదవ్, అగ్రికల్చరల్ ఆఫీసర్ మాధ బత్తుల రూప , ఏసిపి అని శెట్టి రఘు, సీఐ ముత్తులింగం, ఎస్సై డి హరిత తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

**కొండమల్లేపల్లి, నవంబర్ 13 (జనంసాక్షి) :** రైతుల వ్యవసాయానికి, ఇంటి అవసరాలకు, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ జోన్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సాయి కృప ఫంక్షన్ హాల్ లో దేవరకొండ డివిజన్ విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఈ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ గతంలో భారీ వర్షాలకు నిలిచిపోయిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను వెంటనే పునరుద్ధరించాలన్నారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వేసవి కాలంలో విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ప్రాణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ వెంకటేశ్వర్లు, డిఈ విద్యాసాగర్, ఏడిఈలు సైదులు, సాగర్ రెడ్డి, జేఎల్ఎంలు, ఏఎల్ఎంలు, ఏఈలు, విద్యుత్



అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ ఐక్యతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 13 (జనంసాక్షి) :** జాతీయ సమైక్యత, దేశభక్తిని పెంపొందించడం, ప్రత్యేకించి జాతిని ఏకీకృతం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర మరువలేనిది రాజ్యసభ ఎంపీ కేస్రీదేవ్ సిన్హా ఝూలా అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని ప్రజలలో జాతీయ సమైక్యతను, దేశభక్తిని పెంపొందించేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్, ఎన్ఎస్ఎస్ సహకారంతో గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సర్దార్ ఏ150 యూనిటీ మార్చ్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ్, డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా క్రీడల యువజన శాఖ అధికారి వెంకట్ రెడ్డి,తహసీల్దార్ కృష్ణయ్య,యూత్ కో–ఆర్డినేటర్ రాజేష్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అధిక లాభాలు ఇచ్చే ఆయిల్‌ఫామ్‌ను సాగు చేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 13 (జనంసాక్షి) :** అధిక లాభాలు చేకూర్చే ఆయిల్ పామ్ పంటను రైతులు సాగు చేసేలా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లో జిల్లాలోని పిఎసిఎస్ అధ్యక్ష కార్యదర్శులు,ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ, సహకార శాఖ అధికారులతో ఆయిల్ ఫామ్ సాగుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం మలేషియా,ఇండోనేషియా, ఆగ్నేషియా దేశాల నుండి లక్ష కోట్లు ఖర్చు పెట్టి ఏడిబుల్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటున్నదని అన్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాలలోని భూములు ఆయిల్ ఫామ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు చేయాలని లక్ష్యంగా ముందుకెళ్తుందని అన్నారు. జిల్లాలో ఇప్పటికే 5560 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేయడం జరిగిందని తెలిపారు. 2025–26 సంవత్సరానికి 3000 ఎకరాలు లక్ష్యంగా ఎంచుకోగా 2011 ఎకరాలను గుర్తించి, 1139 ఎకరాలకు సబ్సిడీ మంజూరు చేయగా 696 ఎకరాలలో ఆయిల్ పామ్ మొక్కలను నాటడం పూర్తయినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి ప్రవీణ్, ఉద్యానవన అధికారి నాగయ్య, వ్యవసాయ అధికారి నివేదిత,నాబార్డ్ డీడీఎం వినయ్ కుమార్, అసిస్టెంట్ రిజిస్టర్ అంజయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు, కార్యదర్శులు,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తండ్రికి దహన సంస్కారాలు చేసిన కూతురు



**పెనుబల్లి, నవంబర్ 13 (జనం సాక్షి) :** సహజంగా హిందువులలో పున్నామ నరకం నుండి రక్షించేవాడు కన్న కొడుకు అంటారు, ఓ తండ్రికి కొడుకు లేకపోవడం వల్ల ఆ బాధ్యత కన్నకూతురు ద్వారా జరిగింది, పెనుబల్లి మండలం బయన్నగూడెం గ్రామానికి చెందిన ఉయ్యూరి చంద్ర శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయమై మృతి చెందడంతో అతని దహన సంస్కారాలుగురువారం కన్న కూతురు నిర్వహించింది,శ్రీనివాసరావు దంపతులకు వివాహమైన పదిహేను సంవత్సరాలకు ఆలస్యంగా కూతురు జన్మించింది, వ్యవసాయ కుటుంబంలో పుట్టిన శ్రీనివాసరావు వ్యవసాయంతో పాటు, పాడిగేదలను పెంచి పాలవ్యాపారం చేస్తున్నాడు, కూతురు ఇంటర్ చదువు తుంది, అర్ధాంతరంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో ఆచిన్న కుటుంబానికి తీరని లోటు ఏర్పడింది.

# అంతర్ జిల్లా మేకల దొంగల ముఠా అరెస్ట్

**చింతపల్లి, నవంబర్ 13 (జనం సాక్షి) :** ఖరీదైన కార్లలో రాత్రి సమయాల్లో మేకల దొంగతనాలకు పాల్పడుతున్న 5 మందితో కూడిన అంతర్ జిల్లా దొంగల ముఠాలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు దేవరకొండ ఎఎస్పీ మౌనిక తెలిపారు. నిందితుల వద్ద నుండి లక్ష ఇరవై వేల రూపాయల నగదు, ఐదు సెల్ ఫోన్లు మరియు 36 లక్షల విలువ గల 3 కార్లు సీజ్ చేశారు. గత కొంత కాలంగా జిల్లాలో మేకలు, గొర్రెలు దొంగతనం జరుగుతున్న నేపధ్యంలో జిల్లా ఎస్పీ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఇట్టి దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తులపై నిఘా ఉంచి పట్టుబడాలని ఆదేశించగా 13 తేదిన తెల్లవారుజామున సుమారు 04.00 గంటల ప్రాంతంలో చింతపల్లి పోలీస్ చింతపల్లి ఎక్స్ రోడ్ వద్ద వాహన తనిఖీ చేపడుతున్న సమయంలో వారిని చూసి ఒక స్కార్పియో కారు వాహనం వారి నుండి తప్పించుకొని పోవడానికి ప్రయత్నించగా వెంటనే చింతపల్లి పోలీస్ వారు అట్టి వాహనాన్ని పట్టుబడించి అందులో (03) మగవారు, ఒ02) మహిళా ఉన్నారు. వారిని మా వద్ద ఉన్న ఫింగర్ ప్రింట్ స్కానర్ తో చెక్ చేయగా వారిపై గతంలో మేకల దొంగతనం కేసులు ఉన్నట్టు తేలింది. వెంటనే అదుపులోకి తీసుకొని విచారించగా వారి పేర్లు 1) అమ్మలూరి విజయ ప్రసాద్ 2) దాసర్ల వినోద్ కుమార్ 3) గుంజ కార్తీక్ ఏ చిన్న 4) సంపంగి శారద 5) అమ్మలూరి నందిని ఏ బేబీ వీరి పైన గతంలో నల్గొండ రూరల్ పిఎస్, కనగల్, చండూర్, విజయపురి, నార్కట్పల్లి, నల్గొండ 2 టౌన్, మర్రిగూడ, దేవరకొండ, శాలిగౌరారం, నాంపల్లి, మునుగోడు, చింతపల్లి పిఎస్ లలో మేకల దొంగతనాల నేరాలలో నిందితులు. వీరు గతంలో జైలుకు వెళ్ళినా బైలు పై వచ్చిన ప్రవర్తన మార్చుకోకుండా తిరిగి నేరాలు చేయాలనీ నిర్ణయించుకున్నారు. అనుకున్న ప్రకారంగా వీరికీ పరిచయం ఉన్న వారందరూ కలిసి గ్యాంగ్ లుగా ఏర్పడి ఎవరికీ అనుమానం రాకుండా ఖరీదైన కార్లలో వచ్చి పగటి పూట రెక్కి నిర్వహించి రాత్రి సమయాలలో



ఖరీదైన కార్లలో వచ్చి మేకలను కార్లలో వేసుకొని మేకల దొంగతనాలకు పాల్పడుతుంటారు. పట్టుబడిన నేరస్థులు చెప్పిన వివరాల ప్రకారంగా చింతపల్లి, దేవరకొండ, గుడిపల్లి, కల్వకుర్తి పోలీస్ స్టేషన్ల పరిధిలో మేకల దొంగతనాలకు పాల్పడినట్టు తెలిపారు. వీరు దొంగలించిన మేకలను సంతలలో గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మి వచ్చిన డబ్బుతో జల్సాలు చేసుకుంటారు. ఇట్టి నేరాలలో సంబంధించి నిందితుల నుండి లక్ష ఇరవై వేల రూపాయల నగదు మరియు 36 లక్షలు విలువచేసే మూడు ఖరీదైన కార్లను సీజ్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

## రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరి బాధ్యత



**నల్లగొండ, నవంబర్ 13 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదాల నివారణకు నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ వినూత్న కార్యాక్రమం ద్వారా వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నారు. నేషనల్ హైవే 65, చిట్యాల మండలం వెలిమినేడు వద్ద "నీ వాహనం వేగంగా వెళ్తుంది.. కానీ నీ జీవితం ఆగిపోతుంది" అనే నినాదం ద్వారా యాక్సిడెంట్‌కి గురైన కారును చూపుతూ హోల్డింగ్ ఏర్పాటు చేసి వాహనచోదకులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ డిఎస్పి శివరాం రెడ్డి, చిట్యాల సిఐ నాగరాజు, చిట్యాల ఎస్ఐ మధు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## ఆ 'సర్దుబాటు'పైనే వొడాఫోన్ ఐడియా ఆశలన్నీ..




**న్యూఢిల్లీ:**అప్పుల ఊబిలో కూరుకుపోయిన వొడాఫోన్ ఐడియా(వీఐ).. సర్దు బాటు చేసిన స్థూల ఆదాయ (ఏజీఆర్) బకాయిల విషయంలో తగిన, దీర్ఘకా లిక పరిష్కారాన్ని ఆశిస్తోంది. ఈ సమస్యపై ప్రభుత్వంతో చురుగ్గా సంప్రదిం పులు జరుగుతున్నాయని కంపెనీ సీఈఓ అభిజిత్ కిశోర్ పేర్కొన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి దాదాపు రూ.78,500 కోట్ల ఏజీఆర్ బకాయిలు పేరుకుపోగా, దీనికి సంబంధించి తగిన నిర్ణయం తీసుకోవాలని తాజాగా సుప్రీం కోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే.కాగా, క్యూ2 ఫలితాల అనంతరం అభిజిత్ ఇన్వెస్టర్లతో మాట్లాడుతూ.. నిధుల సమీకరణ కోసం బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలతో సహా పలు మార్గాలను అన్వేషి స్తున్నామని చెప్పారు. ఏజీఆర్ పరిష్కారంపైనే ఈ ప్రయత్నాలన్నీ ఆధారపడి ఉంటాయన్నారు. కాగా, 2025-26 సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్ధంలో వీఐ నికర నష్టం రూ.12,132 కోట్లుగా నమోదైంది. కంపెనీ మొత్తం రుణ భారం రూ.2.02 లక్షల కోట్లకు చేరింది.

## ఏరోక్స్-ఈ వచ్చేస్తోంది

**106 కిమీ రేంజ్!**

**న్యూఢిల్లీ:**యమహా కంపెనీ ఎలక్ట్రిక్ వాహన విభాగాన్ని విస్తరించడంతో భాగంగా.. ఏరోక్స్-ఈ ఆవిష్కరించింది. ఇప్పటికే పెట్రోల్ వెర్షన్ రూపంలో అందుబాటులో ఉన్న ఈ స్కూటర్ త్వరలో ఎలక్ట్రిక్ రూపంలో దేశీయ విఫణి లాంచ్ కానుంది. ఇందులో 1.5 కిలోవాట్ రిమూవబుల్ బ్యాటరీ 106 కిమీ రేంజ్ అందిస్తుందని సమాచారం. కాగా 9.5 కేడబ్ల్యు ఎలక్ట్రిక్ మోటారు 48 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది.యమహా ఏరోక్స్ ఈ స్కూటర్ చూడటానికి.. సాధారణ మోడల్ మాదిరిగా కనిపించినప్పటికీ, ఇది ఎలక్ట్రిక్ స్కూటర్ కావదంతో కొన్ని కాస్మెటిక్ అప్డేట్స్ పొందుతుంది. అంతే కాకుండా ఇందులో డ్యూయెల్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, యాబ్ బేస్డ్



కనెక్టివిటీతో కూడిన %ఖీ% ఇన్‌స్ట్రుమెంట్ కన్సోల్ కూడా ఉన్నాయి. ఎకో, స్టాండర్డ్, పవర్, ఓవర్‌టేకింగ్ చేసేటప్పుడు ఉపయోగించగల అదనపు బూస్ట్ మోడ్ వంటి రైడింగ్ మోడ్స్ ఉన్నాయి.సస్పెన్షన్ సెటప్ స్టాండర్డ్ వెర్షన్ నుంచి తీసుకున్నారు. కాబట్టి దీని ముందు భాగంలో టెలిస్కోపిక్ ఫోర్క్, వెనుక భాగంలో డ్యూయల్ షాక్ అబ్జార్బర్‌లు ఉన్నాయి. రెండు చివర్లలో.. డిస్కులు బ్రేక్స్ ఉన్నాయి. కాబట్టి పనితీరు పరంగా బాగుంటుందని భావిస్తున్నారు. కాగా దీని ధరలను కంపెనీ లాంచ్ సమయంలో వెల్లడించనుంది.

# పరుగెడుతున్న కొనుగోళ్లు.. అప్రమత్తతే అత్యుత్తమం




**న్యూఢిల్లీ:**భారతదేశంలో పండుగలు, ఆఫర్లు లేకపోయినా ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా వస్తువుల కొనుగోళ్లు జోరుగా సాగుతుంటాయి. గత కొన్నేళ్లుగా ఈ కొనుగోళ్ల సరళిలో మార్పులు వస్తున్నాయి. ముఖ్యంగా సోషల్ కామర్స్ కారణంగా ఈ-కామర్స్ రంగం కొత్తపుంతలు తొక్కుతోంది. పండుగల వేళ వస్తువుల కొను గోళ్లు పెరగడానికి సోషల్ కామర్స్ ఒక ముఖ్య కారణమనే వాదన బలంగా వినిపిస్తోంది. సోషల్ కామర్స్ ద్వారా ఆన్‌లైన్ షాపింగ్ ఎలా ప్రభావం చెందుతుందో చూద్దాం.

**సోషల్ కామర్స్ అంటే ఏమిటి?**

సోషల్ కామర్స్ అనేది ఈ-కామర్స్ లో ఒక భాగం. దీనిలో వస్తువుల కొనుగోలు, అమ్మకం ప్రక్రియ మొత్తం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా జరుగుతుంది. సాధారణ ఈ-కామర్స్‌లో సోషల్ మీడియాలో ఒక ప్రకటన చూసినా లేదా ఉత్పత్తి గురించి తెలుసుకున్నా కొనుగోలు చేయడానికి అధికారిక వెబ్‌సైట్‌కి లేదా యాప్‌కి వెళ్లాల్సి ఉంటుంది. కానీ, సోషల్ కామర్స్‌లో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ లేదా యూట్యూబ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లోనే ప్రొడక్ట్‌ను పరిశోధించవచ్చు, ఆర్డర్ చేయవచ్చు, చెల్లింపు కూడా పూర్తి చేయవచ్చు.


**లక్షణాలు ఇవే..**

ప్రస్తుతం యూజర్ వాడుతున్న యాప్ నుంచి బయటకు వెళ్లకుండానే కొనుగోలు(ఇన్-యాప్ కొనుగోళ్లు) చేసే అవకాశం ఉంటుంది. పోస్ట్‌లు లేదా లైవ్ వీడియోల్లో నేరుగా ఉత్పత్తులను ట్యాగ్ చేసి దానిపై క్లిక్ చేసి కొనుగోలు చేయవచ్చు. ఇందులో ప్రముఖులు, ఇన్‌ఫ్లూయెన్సర్‌ల ద్వారా ఉత్పత్తుల ప్రచారం సాగుతుంది. వినియోగదారులు సమూహాలుగా ఏర్పడి డిస్కౌంట్‌పై కొనుగోలు చేయవచ్చు. యూజర్ల ఫీడ్‌బ్యాక్, రివ్యూలు, ఫొటోల ద్వారా ఇతర వినియోగదారులను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది.పండుగల వేళ యూజర్లు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు లేదా నమ్మకమైన ఇన్‌ఫ్లూయెన్సర్‌ల సిఫార్సులపై ఆధారపడుతున్నారు. సోషల్ కామర్స్ ఈ సిఫార్సులను, రివ్యూలను నేరుగా పర్చేజ్ సెంటర్లుగా మారుస్తుంది. సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నప్పుడు అకస్మాత్తుగా నచ్చిన వస్తువును వెంటనే కొనేందుకు వీలు కల్పించడం వల్ల తక్షణ కొనుగోళ్లు పెరుగుతున్నాయి. పండుగ ఆఫర్లు, డిస్కౌంట్లు కూడా దీనికి తోడవుతాయి.



**వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

*సోషల్ మీడియా ద్వారా కొనుగోలు చేయాలనుకునే ప్రొఫైల్‌కు బ్లూ టిక్ ఉందో లేదో చూడాలి. అమ్మకందారుని రివ్యూలు, రేటింగ్‌లు, ఫాలోవర్ల సంఖ్యను పరిశీలించాలి. కొత్త లేదా తక్కువ ఫాలోవర్లు ఉన్న ప్రొఫైల్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.చాలా మంది విక్రేతలు సోషల్ మీడియాలో ప్రకటనలు ఇచ్చినప్పటికీ ఉత్పత్తులను కొనుగోలు చేసేప్పుడు అధికారిక వెబ్‌సైట్‌లో కూడా తనిఖీ చేయాలి. ధరలు, ఆఫర్లను పోల్చి చూడాలి.కొనుగోలు ప్రక్రియలో సోషల్ మీడియా యాప్ నుంచి వేరే పేజీకి వెళ్లాల్సి వస్తే ఆ పేజీ సురక్షితమైనదో లేదో నిర్ధారించుకోవాలి. అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేసి క్రెడిట్/డెబిట్ కార్డ్ వివరాలు లేదా యూపీఐ పిన్‌ను నమోదు చేయకూడదు. వీలైతే క్యాష్ ఆన్ డెలివరీ ఆప్షన్‌ను ఎంచుకోవాలి.90% డిస్కౌంట్.. వంటి అతి తక్కువ ధరలకు వచ్చే ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అలాంటి ప్రకటనలు నకిలీ ఉత్పత్తులు లేదా స్కామ్‌లు అయ్యే అవకాశం ఉంది.ప్రొడక్ట్ నచ్చకపోతే లేదా డ్యామేజ్ అయితే తిరిగి ఇచ్చే విధానం రీఫండ్ నిబంధనలు ఎలా ఉన్నాయో కొనుగోలుకు ముందే స్పష్టంగా తెలుసుకోవాలి.*




## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

దేశీయస్టాక్మార్కెట్లుగురువారంఫ్లాట్గాముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 0.01 శాతం లేదా 12.16 పాయింట్లు పెరిగి 84,478.67 వద్ద స్థిరపడింది. మరోవైపు నిఫ్టీ సూచీ కూడా 0.01 శాతం లేదా 3.35 పాయింట్లు పెరిగి 25,879.15 వద్ద ముగిసింది.బీఎస్ఈలోఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్ గ్రిడ్ టాప్ గెయినర్లుగా ఉండగా, ఎటర్నల్, టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ (టీఎంసీవీ), ఎంఅండ్ఎం ప్రధానంగావెనుకబడినవాటిలో ఉన్నాయి.

## వేదికపైనే కుప్ప కూలిన రోబో

**మాస్కో:**టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో.. చాలా దేశాల్లో ఇప్పటికే హ్యూమానాయిడ్ రోబోలు అందుబాటులో ఉన్నాయి. అయితే రష్యా ఇటీవల తన మొట్టమొదటి కృత్రిమ మేధస్సుతో నడిచే హ్యూమనాయిడ్ రోబోను ఆవిష్కరించింది. కానీ ప్రారంభంలోనే విఘాతం అన్నట్టు.. రోబో కిందపడింది.రష్యా తయారు చేసిన రోబోట్ పేరు 'ఐడల్' దీనిని నవంబర్ 10న మాస్కోలోని యారోవిట్ హాల్ కాంగ్రెస్ సెంటర్‌లో జరిగిన టెక్నాలజీ షోకేస్ సందర్భంగా ఆవిష్కరించారు. ప్రారంభంలో మెల్లగా అడుగులు వేసుకుంటూ వేదికపైకి వచ్చిన రోబోట్.. అక్కడున్నవారికి అభివాదం చేస్తున్నట్లు చెయ్యి పైకెత్తింది. ఆ తరువాత ఓ రెండడుగులు ముందుకు వేసి కిందకు పడిపోయింది. దీంతో అక్కడే ఉన్న సిబ్బంది దానిని పైకిలేపి కష్టం మీద తీసుకెళ్లారు. కానీ అనుకున్నదొకటి, అయినది ఒకటిగా జగడంతో.. కార్యక్రమం మధ్యలోనే నిలిచిపోయింది.ఐడల్ రోబోట్ కిందికి పడగానే.. దానికి ఫిక్స్ చేసిన కొన్ని భాగాలు కూడా ఊడిపోయాయి. రష్యన్ రోబోటిక్స్ సంస్థ రూపొందించిన ఈ ఐడల్ ప్రస్తుతం ఇంకా టెస్టింగ్ దశలోనే ఉంది. ప్రజల సందర్శనార్థం దీనిని ప్రదర్శించాలనుకున్నప్పుడు ఈ సంఘటన జరిగిందని కంపెనీ సీఈఓ పేర్కొన్నారు. కాగా ఇంజనీర్లు ఐడల్.. బ్యాలెన్స్ సిస్టమ్, కంట్రోల్ సాఫ్ట్‌వేర్ వంటి వాటిని ఇంకా పరిశీలించాల్సి ఉందని ఆయన అన్నారు.

## నెలకు రూ.7.5 లక్షల జీతం.. మూడునెలల్లో వదిలేసాడు!

**న్యూఢిల్లీ:**చాలామంది ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగం చేయాలని కలలు కంటారు. అలాంటి అవకాశం వస్తే బాగుంటుందని ఎదురు చూస్తారు. కానీ నెలకు రూ.7.5 లక్షల జీతం వచ్చే ఉద్యోగాన్ని ఒక వ్యక్తి వదులుకుని. .బెంగళూరులోని గూగుల్ కంపెనీలో జాబ్ చేస్తున్నారు. దీనికి కారణం ఏమిటి?, ఇతరత్రా వివరాలను ఈ కథనంలో చూసేద్దాం. బెంగళూరులోని గూగుల్‌లో.. ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్న టెక్నీషియన్ 'అద్వైన్ నెట్టో' యూఏఈలోని అబుదాబిలో అధిక జీతం వచ్చే ఉద్యో గాన్ని మూడు నెలల్లోనే వదులుకుని భారతదేశానికి ఎందుకు తిరిగి వచేసాడు. ఈ విషయాన్ని అతడు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పేర్కొన్నారు.అద్వైన్ నెట్టో ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో వెల్లడించిన సమాచారం ప్రకారం.. నెలకు రూ.7.5 లక్షల జీతం వచ్చే ఉద్యోగాన్ని ఆరు సంవత్సరాలకు ముందు వదిలిపెట్టేశాను అని పేర్కొన్నాడు. యూఏఈ వర్క్ వీసా రావడానికి దాదాపు ఐదు నెలలు పట్టింది. కానీ మూడు నెలల్లోనే ఉద్యోగన్ని వదిలేశాను. ఎక్కువ పనిగంటలు, ప్రతి రోజూ ఉదయం 9 గంటలకు పంచ్ వేయకపోతే.. సగం రోజు జీతం కట్ అవుతుంది.మౌలిక సదుపాయాలు, భౌతిక అభివృద్ధిలో యూఏఈ చాలా అద్భుతంగా ఉంది. కానీ డిజిటల్ రంగంలో చెప్పుకోదగ్గ స్థాయిలో ఇంకా అభివృద్ధి చెందలేదు. ఇక్కడ డబ్బు సమస్య కాదు. అత్యున్నత పదవులు అర్హత కంటే.. జాతీయతపై ఆధారపడి ఉన్నాయని, దీనివల్ల నిజమైన నైపుణ్యం వృద్ధి చెందడం కష్టమైందని పేర్కొన్నారు. నేను యూఏఈలో నెలకు నెలకు 30000 సంపాదించడం చాలా పెద్దదిగా అనిపించవచ్చు. కానీ అక్కడ హాయిగా జీవించడానికి, సులభంగా 10000 ఖర్చు చేయాల్సి ఉంటుంది. అంటే యూఏలో నెలకు 20000లను పొదుపుచేయగలిగాను. ఎంత సంపాదించిన అక్కడి పని వాతావరణం ఇబ్బందిగా అనిపించింది. నా పరిస్థితిని వెల్లడించినప్పుడు.. నువ్వు కంపెనీని మార్చి ఉండవచ్చు, దేశాన్ని (యూఏఈ) ఎందుకు వదిలి వెళ్లావని కొంతమంది స్నేహితులు అన్నారు. అలా కూడా ట్రై చేసాను. కొంతమంది సన్నిహితులను అడిగాను. వాళ్ల పరిస్థితి కూడా దాదాపు అలాగే ఉంది. అంతే కాకుండా కొందరు వారానికి ఆరు రోజులు పనిచేస్తున్నట్లు చెప్పారు. కాబట్టే ఆ దేశంలో ఉద్యోగాన్ని వదిలేయాల్సి వచ్చిందని అద్వైన్ నెట్టో పేర్కొన్నారు.

## పుల్వామా మాస్టర్‌మైండ్‌తో షహీన్‌కు లింకులు?



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఫరీదాబాద్ పేలుడు పదార్థాల కేసులో అరెస్టయిన డాక్టర్ షహీన్ సయీద్‌పై ఎన్ఐఏ జరుపుతున్న దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పుల్వామా దాడుల మాస్టర్ మైండ్ ఉమర్ ఫారుక్ భార్య అఫీరా బీబీతో సంబంధాలున్నట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి.అంతేకాకుండా జైషే-మహమ్మద్ చీఫ్ మసూద్ చెల్లెలితోనూ తను సంప్రదింపులు జరిపినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.పుల్వామా అటాక్ ఈపదం వింటే చాలు భారతావని గుండె బరువెక్కుతోంది. 2019లో సీఆర్పీఎఫ్ సిబ్బంది కాన్వాయ్ పై జైషే-మహమ్మద్ అనే ఉగ్రసంస్థ జరిపిన ఈ దాడిలో 40 మంది జవాన్లు వీరమరణం పొందారు. ఈ దాడుల వ్యూహకర్తగా ఉమర్ ఫారుక్ భావిస్తారు. తాజాగా ఫరీదాబాద్‌లో అరెస్టయిన డా.షహీన్ సయీద్‌కి ఫారుక్ భార్య అఫీరా బీబీతో సంబంధాలున్నట్లు ఎన్ఐఏ అనుమానిస్తుంది.ఇటీవలే ఏర్పాటైన జైషే మహమ్మద్ మహిళా విభాగం జమాత్-ఉల్-మెమినాత్ లో అఫీరా బీబీది ప్రధానపాత్రని దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. డా. షహీన్ కేవలం అఫీరాతోనే కాకుండా జైషే మహమ్మద్ చీఫ్ మసూద్ అజర్ చెల్లెలితోనూ సంప్రదింపులు జరిపినట్లు ఎన్ఐఏ ఆరోపిస్తోంది.ఫరీదాబాద్ పేలుడు పదార్థాల అక్రమ రవాణా కేసులో డాక్టర్ షహీన్‌ను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ అరెస్టు చేసింది. విచారణలో జైషే మహమ్మద్ మహిళా విభాగాన్ని ఇండియాలో ఏర్పాటు చేయడానికి ప్రయత్నించినట్లు తేలింది. దీంతో ఎన్ఐఏ మరింత లోతుగా విచారణ జరుపుతుంది.

# ఉద్యోగులు కావలెను

**అమెరికాలో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది:ఫోర్డ్ సీఈఓ**





**వాషింగ్టన్:**ప్రఖ్యాత ఆటోమొబైల్ సంస్థ ఫోర్డ్ లో ఉద్యోగాల కొరత ఏర్పడినట్లు ఆ సంస్థ సీఈఓ జిమ్ ఫార్లీ పేర్కొన్నట్లు ఫార్చ్యూన్ నివేదిక తెలిపింది. ఫోర్డ్ సంస్థలో 5వేల మంది మెకానిక్‌లు అవసరమున్న ఆనైపుణ్యం గల వ్యక్తులు లేరన్నారు.ఈ సమస్య కేవలం ఫోర్డు కంపెనీకి చెందింది మాత్రమే కాదని ప్రస్తుతం ఇటువంటి పరిస్థితులే తయారి రంగంలో అమెరికా వ్యాప్తంగా ఏర్పడ్డాయని జిమ్ ఫార్లీ పేర్కొన్నారు. అమెరికాలో స్కిల్డ్ లేబర్స్ కొరత ఏర్పడినట్లు ఫోర్డ్ సీఈఓ జిమ్ ఫర్లీ తెలిపినట్లు ఫార్చ్యూన్ నివేదిక పేర్కొంది. యూఎస్ స్కిల్డ్ లేబర్ మార్కెట్ లో పది లక్షలకు పైగా జాబులు ఖాళీగా ఉన్నాయని పలు నివేదికలు తెలుపుతు న్నాయి. అ?త్యవసర సర్వీసులైన, ప్లంబర్స్, ఫ్యాక్టరీ వర్కర్స్, ఎలక్ట్రిషన్స్, ట్రక్ డ్రైవర్స్ ఉద్యోగాలలో భారీగా ఖాళీలు ఉన్నప్పటికీ వాటిని భర్తీచేసే నిపుణుల కొరత తీవ్రంగా ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. బ్యురో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ డేటా ఆగస్టు రిపోర్టు ప్రకారం కేవలం తయారి రంగంలో 4 లక్షలకుపైగా ఉద్యో గాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దేశంలో నిరుద్యోగిత రేటు 4.3 ఉన్నప్పటికీ ఈ రంగం లో ఉద్యోగాల ఖాళీలు అధికంగా ఉన్నాయన్నా రు.ఫోర్డ్ కంపెనీ మెకానిక్ జాబులకు వార్షిక వేతనం లక్ష 20 వేల డాలర్లు ఇస్తుందని, ఈ ప్యాకేజీ అమెరిన్స్ తలసరి ఆదాయం కంటేఇది రెట్టింపని తెలిపారు. ఇంత మంచి ప్యాక్టేజ్ ఉన్నప్పటికీ మెకానిక్ ల భర్తీ జరగడం లేదన్నారు. 2024లో నిర్వహించిన ఒక సర్వే ప్రకారం మ్యానుఫాక్చరింగ్ సెక్టార్ లో అవస రమున్న ఉద్యోగాలలో సగం మందిని నియమిం చుకోవడం చాలా కష్టమని ఒకవేళ వారి భర్తీ చేపట్టిన వారు ఎక్కువ కాలం ఈ జాబులలో ఉండడం లేదని సర్వే తెలిపిందని పేర్కొన్నారు. దేశ అధ్యక్షుడు ట్రంప్ తయారీరం గాన్ని అమెరికాకు తీసుకొస్తున్నానని ప్రకటిస్తున్నారని అయితే పరిస్థితులు చూస్తుంటే అమెరికన్స్ ఆ రంగంలో ఉద్యోగాలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపించడం లేదని తెలిపినట్లు ఫార్చ్యూన్ నివేదిక పేర్కొంది.



## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో బాహుబలి

**దర్శనమిచ్చిన అతిపెద్ద కార్గో విమానం ఏఎన్-124**

**హైదరాబాద్:**ప్రపంచంలోని అతిపెద్ద కార్గో విమానాల్లో ఒకటైన ఆంటనోవ్ ఏఎన్-124 రుస్లన్ తాజాగా హైదరాబాద్‌లోని శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దర్శనమిచ్చింది.ఈ భారీ విమానం ల్యాండింగ్ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. విమానాశ్రయానికి తరచూ కార్గో విమానాలు వస్తుంటాయి. కానీ, రుస్లన్ వంటి దిగ్గజ ఎయిర్‌క్రాఫ్ట్ రాక విమానయాన ప్రియులను, స్థానికులను ఆకర్షించింది.

ఆంటనోవ్ ఏఎన్-124 రుస్లన్ ప్రత్యేకతలు..

'రుస్లన్'గా పిలువబడే ఆంటనోవ్ ఏఎన్-124.. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన కార్గో విమానాల్లో రెండో స్థానంలో ఉంది (మొదటి స్థానం ఏఎన్-225). ఈ విమానం గరిష్టంగా 150 టన్నుల వరకు కార్గోను మోయగలదు. దీని లోపల కార్గో కంపార్ట్‌మెంట్ పరిమాణం అధికంగా ఉంటుంది. సుమారు 36.5 మీటర్ల పొడవు, 6.4 మీటర్ల వెడల్పు, 4.4 మీటర్ల ఎత్తు కలిగి ఉంటుంది. దీంతో భారీ , పొడవైన వస్తువులను సులభంగా రవాణా చేయవచ్చు.

కార్గో లోడింగ్, అన్‌లోడింగ్ సులభతరం చేయడానికి విమానం ముందు భాగం పూర్తిగా పైకి లేస్తుంది. అంతేకాకుండా దీని ల్యాండింగ్ గేర్ ప్రత్యేకమైన విధానాన్ని కలిగి ఉంది. దీని ద్వారా విమానం తన ఎత్తును తగ్గించుకుని వస్తువులను వాహనాల నుంచి నేరుగా లోడ్ చేయడానికి వీలు కల్పిస్తుంది. లోపల 30 టన్నుల బరువును ఎత్తగల క్రేన్ సిస్టమ్ అమర్చబడి ఉంటుంది. దీని వల్ల సుదూర ప్రాంతాల్లో గ్రౌండ్ సపోర్ట్ లేకపోయినా లోడింగ్, అన్‌లోడింగ్ పనులు నిర్వహించవచ్చు. గరిష్ట ఇంధనంతో దాదాపు 14,000 కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణించగల సామర్థ్యం దీని సొంతం.

**ఎలాంటి వస్తువులను రవాణా చేస్తారు?**

ఆంటనోవ్ ఏఎన్-124 రుస్లన్‌ను ముఖ్యంగా ఓవర్‌సైజ్డ్, హెవీ-లిఫ్ట్ కార్గో రవాణా కోసం ఉపయోగిస్తారు. విద్యుత్ ఉత్పత్తికి వాడే భారీ టర్బైన్లు, ఆయిల్ అండ్ గ్యాస్ పరిశ్రమకు సంబంధించిన భారీ డ్రిల్లింగ్ యంత్రాలు, బరువైన ఎర్త్ మూవర్స్, క్రేన్లు, లేదా 25 మీటర్ల పొడవున్న యంత్ర భాగాలను ఇందులో రవాణా చేస్తారు. మిలిటరీ వాహనాలు (ట్యాంకులు), కంప్లీట్ మిస్సైల్ సిస్టమ్స్, లేదా బోయింగ్ 777 వంటి పెద్ద విమానాల టర్బోఫ్యాన్ ఇంజిన్లు, రాకెట్ భాగాలను చేరవేస్తారు.




## బంపర్ ఆఫర్..

**ఇటలీలో పిల్లలను కంటే రూ. 30 లక్షలు**



రోమ్: ఆధునిక యువత పెళ్లి చేసుకోవడం, పిల్లలను కనడాన్ని భారంగా భావిస్తోంది. దీనికి ఆర్థిక అంశాలతో పాటు, ఉరుకులు పరుగుల జీవితం కూడా ఒక కారణంగా నిలుస్తోంది.ఇటువంటి నేపథ్యంలో జననాల రేటు తగ్గుతున్నదనే వాదన కూడా వినిపిస్తోంది. దీనిని గుర్తించిన ఒక దేశం పరిష్కార మార్గాన్ని కనుగొంది. పెళ్లి చేసుకునే యువతకు భారీ నగదు బహుమతులు, గ్రాంట్‌లను ప్రకటించింది.ఇటలీ అసాధారణ జనాభా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశ ఏకీకరణ (1861) తర్వాత 2024లో కేవలం 370,000 జననాలతో అత్యల్ప సంఖ్యను నమోదు చేసింది. ప్రతి మహిళకు జనన రేటు రికార్డు స్థాయిలో 1.13కి పడిపోయింది. నిపుణులు దీనిని 'జనాభా శీతాకాలం'(తక్కువ సంతానోత్పత్తి రేట్లు, వృద్ధాప్య జనాభా, పెరిగిన మరణాల రేటుతో ఏర్పడిన పరిస్థితి) గా అభివర్ణిస్తున్నారు.ఆర్థిక అనిశ్చితి, పెరుగుతున్న జీవన వ్యయాలు, పరిమిత ఉద్యోగ అవకాశాల కారణంగా యువ ఇటాలియన్లు వివాహం చేసుకునేందుకు, పిల్లలను కనేందుకు ఆలస్యం చేస్తున్నారు. ఇది ఇటలీ ఆర్థిక, సామాజిక స్థిరత్వానికి తీవ్రమైన ముప్పుగా పరిణమించింది. యువతలో ఉన్న ఈ ధోరణిని తిప్పికొట్టేందుకు, జనాభా పెరుగుదలను ప్రోత్సహించేందుకు తక్షణమే చర్యలకు ఇటలీ ప్రభుత్వం ఉపక్రమించింది.తగ్గుతున్న జననాల సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఇటాలియన్ ప్రభుత్వం యువతకు విస్తృతమైన ప్రోత్సాహకాలను ప్రకటించింది. దీనిలో గ్రామీణ పునరావాస గ్రాంట్ ఒకటి. దీని కింద గ్రామాలలో వదిలివేసిన ఇళ్లను కొనుగోలు చేసి,వాటిని పునరుద్ధరించే వారికి ఆ30,000(రూ.30 లక్షలు) వరకు అందించనున్నారు. పుగ్లియాలోని ప్రెసిస్-అక్వారికా తదితర చిన్న పట్టణాల్లో నివాస స్థిరత్వం కోసం అక్కడి ప్రజలకు నెలవారీ స్టైపెండ్‌లు, వ్యాపార మద్దతును అందిస్తున్నారు. ఈ పథకం ముఖ్యంగా ఇటలీలో ఖాళీ అవుతున్న చిన్న,చారిత్రక పట్టణాలకు ఊపిరి పోయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది అక్కడి జనాభా పెరిగేందుకు దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.



## నెతన్యాహును క్షమించండి.. ట్రంప్ లేఖ

జెరూసలేం: ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహును క్షమించాలంటూ ఆ దేశ అధ్యక్షుడు ఇసాక్ హెర్జోగ్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది.నెతన్యాహుపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. కోర్టుల్లో విచారణ జరుగుతోంది. దోషిగా తేలితే పదవి నుంచి తప్పుకోవాల్సిందే.ఈ నేపథ్యంలో నెతన్యాహుకు మద్దతుగా ట్రంప్ లేఖ రాయడం గమనార్హం. నెతన్యాహుపై ఆరోపణలన్నీ రాజకీయ ప్రేరేపితమని ట్రంప్ పేర్కొన్నారు. ఆయనను విచారించడం న్యాయ సమ్మతం కాదని అభిప్రాయపడ్డారు. ఇజ్రాయెల్‌ను శాంతి మార్గంలో నడిపిస్తున్నారంటూ నెతన్యాహును ప్రశంసించారు. మరోవైపు ఇజ్రాయెల్ అంతర్గత వ్యవహారాల్లో ట్రంప్ పెత్తనం పెరిగిపోతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ట్రంప్ గత నెలలో ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగించారు. అప్పుడు కూడా నెతన్యాహును వెనకేసుకొచ్చారు. ఆయనను పెద్ద మనసుతో క్షమించాలని అన్నారు.

## బంగ్లాదేశ్‌లో మళ్లీ ఆందోళనలు

రాజధాని నగరంలోకి ప్రవేశించే మార్గాల వద్ద పలు చెక్ పాయింట్లను ఏర్పాటు చేసి, ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. కాగా బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఆ దేశ ప్రస్తుత తాత్కాలిక ప్రధాన సలహాదారు, నోబెల్ గ్రహీత ముహమ్మద్ యూనస్‌పై తీవ్ర విమర్శలతో మండిపడ్డారు.ఆర్థికవేత్తగా అంతర్జాతీయ ఖ్యాతి ఉన్న ఆయన దానిని దుర్వినియోగం చేస్తున్నారని హసీనా ఆరోపించారు. సీఎన్ఎన్- న్యూస్ 18కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ యూనస్‌పై అంతర్జాతీయ సమాజానికున్న భ్రమలు తొలగిపోతున్నాయని, ఆయనను అందరూ ఎన్నికకాని దేశాధినేతగా చూస్తున్నారన్నారు. అతని పరిపాలన రాజ్యాంగాన్ని కూల్చివేస్తున్నదని, మైనారిటీలను రక్షించడంలో విఫలమవుతున్నదని షేక్ హసీనా ఆరోపించారు.దేశాన్ని మతోన్మాదంగా మారుస్తూ, సామాజికంగా తిరోగమన దేశీయ ఎజెండాను అనుసరిస్తున్న యూనస్ 'ఉగ్రవాదుల ఫ్రంట్‌మన్'గా ఉన్నారంటూ హసీనా తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన మంత్రివర్గంలో రాడికల్ తీవ్రవాదులు ఉన్నారని, ఫలితంగా మైనారిటీలు అణచివేతకు గురవుతున్న వాతావరణం ఏర్పడిందని హసీనా పేర్కొన్నారు. యూనస్ ప్రజాస్వామ్య ఆధారాలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
14 నవంబర్ 2025

# 45వ డివిజన్‌లో ఉచిత ఓటరు నమోదు

- కేంద్రాన్ని ప్రారంభించిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 13 (జనంసాక్షి):** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనదని, నిర్ణయాత్మకమైనదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, వివిఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అల్ఫోర్స్ డా.వి.నరేందర్ రెడ్డి స్థానిక కరీంనగర్ లోని 45వ డివిజన్లో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి ఉచిత ఓటరు నమోదు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఇది వారి ప్రాథమిక కర్తవ్యం అని గుర్తు చేశారు. ఓటు ద్వారా ప్రభుత్వం ఏర్పడుతుందని, ఆ ప్రభుత్వం ద్వారా ప్రజలకు కావలసిన వసతులను కల్పించబడతాయని తెలిపారు. అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారత దేశంలో ఓటు హక్కుకు చాలా విలువ, ప్రత్యేకత ఉన్నదని ఓటరును చాలా గొప్పగా పరిగణించబడతారని గుర్తు చేశారు.18 సంవత్సరాలు నిండిన వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేయించుకోవాలని ప్రతిష్టాత్మకమైన ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకొని పౌరునిగా బాధ్యతలను చక్కగా నిర్వర్తించాలని సూచించారు. ఓటు హక్కు పొందిన వారు ప్రభుత్వాన్ని ప్రభావితం చేయవచ్చుని, ప్రజలకు వసతులు కల్పించడానికి ఈ ఓటు హక్కు చాలా ఉపయోగపడుతుందని తెలుపుతూ ప్రతి పౌరుడు ఓటు హక్కును సక్రమంగా ఎటువంటి ప్రలోభాలకు ఆకర్షితులు కాకుండా సరైన రీతిలో వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రజిత రెడ్డి, ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ శ్రావణ్ నాయక్, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ వాసు, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ అభిలాష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు, తాళ్లపల్లి శ్రీకాంత్, రాహుల్, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ జాఫర్, ఆశీష్ గౌడ్, ప్రవీణ్ అంజన్ స్వామి, అజీత్ పండిత్, మహమ్మద్ ఎంజాయ్ తదితరులు పాల్గొన్నారు.

## శాతవాహన ఆర్ట్స్ కళాశాలలో
# యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు




**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్13 (జనంసాక్షి):** శాతవాహన విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్లో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుజాత అధ్యక్షతన యాంటీ ర్యాగింగ్, మహిళా భద్రత మాదకద్రవ్య నియంత్రణపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సుకు వచ్చేసిన రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి మాట్లాడుతూ... విద్యార్థులు తోటి విద్యార్థులతో సోదర భావంతో ఉండాలని రాగింగ్ ను అరికట్టడానికి ప్రయత్నాలు చేయాలని నేటి సీనియర్ విద్యార్థులు ఒకప్పుడు జూనియర్ విద్యార్థులని మరవరాదన్నారు. ర్యాగింగ్ చేసినట్టు తెలిస్తే కళాశాల నుండి డిస్మిస్ చేయడమే కాకుండా పోలీస్ కేసు అవుతుందన్నారు. కొత్తపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ కోటేశ్వర్ మాట్లాడుతూ... విశ్వవిద్యాలయ విద్యార్థులు విలువలతో ఉండాలని వారు చదువు కోసం వచ్చారని మాదకద్రవ్యాల వల్ల వారి జీవితం చెడిపోతుందని ఇంటలిజెన్స్ వర్గం చాలా క్రియాశీలకంగా పనిచేస్తుందని మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, సేవించడం చట్టరీత్యా నేరమని అలాంటి విద్యార్థులు శిక్షాఅర్హులు అవుతారని అన్నారు. షీ టీమ్స్ విభాగానికి చెందిన సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీలత మాట్లాడుతూ... విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో అమ్మాయిలను ఎటువంటి వేధింపులకు గురి చేయవద్దని ఏదైనా జరిగినట్లయితే కేసు నమోదు అవుతే జీవితంలో వారికి ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగము రాదని, అమ్మాయిలు కూడా తోటి అమ్మాయిలతో బాధించే విధంగా మాట్లాడవద్దని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సుజాత మాట్లాడుతూ... విశ్వవిద్యాలయంలోకి ఉన్నత చదువు కోసం రావాలని అనవసరంగా తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు హిత బోధ చేశారు.

కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ డా. హరికాంత్ మాట్లాడుతూ... ర్యాగింగ్‌ను అంతం చేసి స్వచ్ఛ శాతవాహనగా మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ రమాకాంత్, చీఫ్ వార్డెన్ డా. నజీముద్దీన్ మున్వర్, హాస్టల్ వార్డెన్స్ డా.కృష్ణకుమార్, సావిత్రి, కేర్ టేకర్ సంధ్య, రమేష్ కామర్స్, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నిర్ణీత సమయంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

### మంథని నియోజకవర్గం అభివృద్ధి పనులుపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**మంథని, (జనంసాక్షి) :** మంథని నియోజకవర్గ పరిధిలో వివిధ ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను నిర్మిత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగిరి సింగరేణి గెస్ట్ హౌస్‌లో మంథని నియోజకవర్గం అభివృద్ధి పనులపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. డిసెంబర్ 7 వరకు మిషన్ భగీరథ సంబంధించి మంథని నియోజక వర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, పైప్ లైన్ పనులు, మరమ్మతు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మంథని నియోజకవర్గ సంబంధించి అడవి సోమనపల్లి యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణం సకాలంలో పూర్తి కావాలని కలెక్టర్ తెలిపారు. మంథని పరిధిలోని రామగిరి కేజీబీవీ కాంపౌండ్ వాల్, ఆదర్శ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలో మంజూరు చేసిన అభివృద్ధి పనులను, పీఎం శ్రీ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ నిర్మాణం, హాస్టల్ భవన నిర్మాణ వేగవంతంగా పూర్తి చేసే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని రావాలని అన్నారు. ఈ సమావేశంలో మంథని ఆర్.డి.ఓ. సురేష్,ఈఈ మిషన్ భగీరథ ఇంట్రా శ్రీనివాస్, మిషన్ భగీరథ గ్రిడ్ పూర్ణ చందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, వికలాంగులు, వయోవృద్ధుల, ట్రాన్స్ జెండర్స్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**జగిత్యాల బ్యూరో నవంబర్ 13 ( జనం సాక్షి) :** వడ్ల కొనుగోలుకు సంబంధించి ప్రత్యేకంగా రైతుల నుండి చివరి గింజవరకు ధాన్యాన్ని కోనుగోలు చేయుటకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం రోజున కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్, డాక్టర్ సంజయ్, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్లు బి. ఎస్. లత, రాజ గౌడ్ లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధాన్యం సేకరణలో మన జగిత్యాల జిల్లాకు సంబంధించి ఎంత ధాన్యాన్ని సేకరించారు అని అడిగి తెలుసుకున్నారు. మన జిల్లాలో వరి మీదనే ఎక్కువగా రైతులు ఆధార పడ్డారని, వారికి ఎటువంటి సమస్యలు రాకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. గన్ని బ్యాగులు, టార్పలిన్ కవర్లు, మరియు వివిధ రకాల యంత్రాలు అందుబాటు లో ఉండే విధంగా చూసుకోవాలని అధికారులను సూచించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిచిందని, తడిచిన ధాన్యాన్ని గంటలో అరబెట్టే మిషన్ ను జగిత్యాల, కోరుట్ల, ధర్మపురికి సంబంధించి 3 మిషన్లను కేటాయించడం జరిగిందని, అవసరమైతే ఇంకా తెప్పిస్తామని మరో 7 కు ప్రతిపాదనలు తయారు చేయాలని మంత్రి ఆదేశించారు. రైతులు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకువచ్చి తూకం అయిన తర్వాత ధాన్యం కు సంబంధించి పూర్తి బాధ్యత ఆ సెంటర్ ఇంచార్జులు, అధికారులు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం రవాణాకు సంబంధించి మిల్లర్ల దగ్గర వాహనం ఆగిపోతే రైతుల బాధ్యత కాదని, మిల్లర్ల బాధ్యత అని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో క్లస్టర్ అధికారులు, జిల్లా అధికారులు, ఆర్డీఓలు, అదనపు కలెక్టర్ రెవెన్యూ ప్రతి రోజు సెంటర్లను సందర్శించాలని, సెంటర్లలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ ధాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా సమన్వ యంతో పనిచేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ప్రతి రోజు డిఎస్ఓ, డిసిఓ, డిఎం, డిఆర్‌డిఓ, డిఏఓలతో రోజు వారి పర్యవేక్షణ చేయాలనీ కోరారు. సింగిల్ విండో ఛైర్మన్లను రైతులచే ఎన్నుకోబడతారు కావున వారికి రైతుల సమస్యల గురించి అవగాహన ఉంటుందని, ప్రభుత్వం సానుకూలంగా ఉండి చైర్మన్ పదవి కాలం పొడిగించిందని, ప్రతి సెంటర్ వద్ద సింగిల్ విండో చైర్మన్ లు ఉండే విధంగా చూడాలని కోరారు. సమస్యలకు తావు లేకుండా గ్రౌండ్ లెవల్ లో రైతుల పక్షాన ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.
అకాల వర్షాల వల్ల ధాన్యాన్ని కొనుగోలు చేయడం ఆలస్యం జరిగిందని, తడిచిన ధాన్యాన్ని, కలర్ మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ధాన్యం కొనుగోలు సజావుగా జరిగే విధంగా అధికారులు, నిర్వాహకులు, మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లు అందరూ సమన్వయంతో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లను విజయవంతం చేయాలనీ కోరారు. మళ్ళీ 15 రోజుల్లో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలనీ అంతలోపు ఇప్పటి వరకు ఎదురైనా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మార్క్ ఫెడ్ అధికారులతో సమీక్షించి మొక్కజొన్న రైతుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా మంత్రిగా నిత్యం అందరికీ అందుబాటులో ఉంటానని అందరు కలిసి సమన్వ యం తో పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని కోరారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్యాడికి సంబంధించి తెలంగాణలో పెరుగుతుందని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సమన్వయం చేసుకుంటూ ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల, మెట్ పల్లి ఆర్డీఓ లు మధు సుధన్, శ్రీనివాస్, ట్రైని డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి, వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు, క్లస్టర్ అధికారులు, ప్యాక్స్ చైర్మన్ లు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు, ట్రాన్స్ పోర్ట్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# అధిపత్య కులాల కుట్రలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలి

- దీక్షలో మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గీకురు రవీందర్




**చిగురుమామిడి నవంబర్13 (జనంసాక్షి):** రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు మండల బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చిగురుమామిడి మండల కేంద్రములో గురువారం ఏర్పాటుచేసిన బీసీల ధర్మ పోరాట దీక్ష దద్దరిల్లింది.ఈ కార్యక్రమానికి మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గీకురు రవీందర్ హాజరై మాట్లాడుతూ బీసీలు ఏకం కాకుండా వారిలోని ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్న ఆధిపత్య కులాల కుట్రలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని పిలుపునిచ్చారు.బీసీ రిజర్వేషన్ 42 శాతం అమలయ్యేంత వరకు పోరాటం కొనసాగించి, హక్కులను సాధించుకుంటామన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో జనాభా దామాషా పద్దతిలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం రాజ్యాంగబద్ధమని, దేశములో బడుగు బలహీన వర్గాల సంక్షేమం, అభ్యున్నతి ప్రభుత్వాల లక్ష్యమన్నారు. అగ్ర కుల ఆధిపత్యములో నడిచే రాజకీయ పార్టీలన్నీ బీసీలను ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకుంటున్నారన్నారు. 2019లో బీజేపీ ప్రభుత్వం 10శాతం కూడా లేని అగ్రకులాలకు ఇ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ కల్పించినప్పుడు, 56శాతం ఉన్న బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడంలో అభ్యంతరం ఏమిటో చెప్పాలన్నారు. ఎడ్డి తెలంగాణ, గుడ్డి తెలంగాణా కాదని, చైతన్య స్ఫూర్తితో, త్యాగాలతో ఎన్నో ఉద్యమాలకు ఊపిరిలూదన్నారు. ఏ రాజకీయ పార్టీయైన, నాయకుడైన కుట్ర పూరితంగా వ్యవహరిస్తే బీసీల ఆక్రోశానికి గురై, రాజకీయ సమాధి కాక తప్పదన్నారు. తెలంగాణ అసెంబ్లీ తీర్మానాన్ని గౌరవించి, కేంద్ర ప్రభుత్వం తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చి రాజ్యాంగ సవరణ చేసి రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో మండల అధ్యక్షులు శ్రీరామోజు రాజ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు తాళ్ల నరేష్, జిల్లా కార్యదర్శి చెల్పూరి విష్ణుమా చారి, గ్రామ శాఖల అధ్యక్షులు సిరవేణి సంపత్, పెసరి మొగిలి, కందుకూరి శ్రీనివాస్, పెసరి శ్రీనివాస్, సుధగోని రాజు, మూసాపూర్ సంపత్ కోశాధికారి పెసరి శ్రీనివాస్,సోషల్ మీడియా ఇంచార్జ్ గుజ్జుల రాజు, చొప్పదండి సాయికుమార్ బిసి సంఘం మండల నాయకులు నిలిగొండ దశరథం, అనువోజు బాలకృష్ణ చారి, నిలిగొండ కిషన్, రామ్మెట్టి లక్ష్మీనరసింహ, జింకల హరీష్, అనువోజు వెంకటాద్రి, పొన్నం రాజు, కాశవెని ఐలయ్య, పొగాకుల హరీష్, పొన్నం కనకయ్య, గోపగోని అనిల్, జింకల రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.



## 17% లోపు తేమతో
# ధాన్యం తీసుకొచ్చేయండి

- నాణ్యమైన వడ్లు వెంటనే కొనుగోలు.. మిల్లులకు తరలింపు
- రాత్రిపూట ప్లాస్టిక్ కవర్లు కప్పండి
- భవిత సెంటర్ పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి, నవంబరు 13 (జనంసాక్షి) :** రైతులు వరి కోతల తర్వాత ధాన్యాన్ని బాగా ఆరబెట్టి 17 శాతం లోపు తేమ ఉన్నప్పుడే కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. పొలం నుంచి నేరుగా తేవద్దని, లేకపోతే కాంటా 4-5 రోజులు ఆలస్యమవుతుందని హెచ్చరించారు. బుధవారం ఒక ప్రకటనలో ఆయన రైతులకు ఈ మేరకు పలు సూచనలు చేశారు. నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి సంబంధిత మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తేమ ఎక్కువగా ఉన్న వడ్లు తీసుకొచ్చిన రైతుల కంటే తర్వాత వచ్చిన ఆరిన ధాన్యాన్నే ముందు కాంటా వేస్తామని, అందువల్ల ఫిర్యాదులు చేయడం వల్ల ప్రయోజనం లేదని స్పష్టం చేశారు. రోజంతా ఆరబెట్టిన ధాన్యం పై రాత్రిపూట ప్లాస్టిక్ కవర్లు కప్పాలని, లేకుంటే మళ్లీ తేమ పెరిగే అవకాశముందని హితవు పలికారు. ఆరిన ధాన్యాన్ని తీసుకొచ్చిన రైతులకు అదే రోజు కాంటా వేసి మిల్లులకు పంపుతామని హామీ ఇచ్చారు. ఇబ్బందులు తప్పాలంటే ఆరబెట్టి తీసుకొచ్చేయాలని మనవి చేశారు. అదే రోజు గురువారం పెద్దపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న భవిత సెంటర్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ పనులను వేగ వంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసు కోవాలని, పక్కన ఉన్న రేకుల షెడ్‌ను కూడా వినియోగించుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో మండల విద్యాధికారి సురేందర్ కుమార్, ఐఈఆర్‌పీ సంధ్యారాణి, అధికారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాము

### రెవిన్యూ చట్టాలపై జీపీవోలకు అవగాహన సదస్సులో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**మహేశ్వరం,నవంబర్13(జనం సాక్షి):** ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అన్నారు.గురువారం కందుకూరు డివిజన్ పరిధిలోని జీపీవోలకు కందుకూరు ప్రజా పరిషత్ కార్యాలయంలో రెవిన్యూ చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ... గ్రామ స్థాయిలో రెవిన్యూ వ్యవస్థను బలోపేతం చేయడానికి గ్రామ పరిపాలన అధికారులను నియమించారన్నారు.జీపీవోలు ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు.ఈ కార్యక్రమంలో కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి,కందుకూరు తహశీల్దార్ గోపాల్,డీటీలు రాజు,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య స్కూల్లో స్పోర్ట్స్ మేట్ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్



**వేములవాడ, నవంబర్ 13 (జనంసాక్షి):** వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్లో డాక్టర్ బి.ఎస్ రావు జ్ఞాపకార్థం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వేములవాడ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం పిల్లలకి ఎంతగానో ఉపయోగపడు తుందని చదువుతో పాటు, ఆటలు పిల్లలకి ఎంతో అవసరమని తెలిపారు. ప్రభుత్వ విప్ తన చిన్ననాటి జ్ఞాపకాలు పిల్లలతో పంచుకున్నారు.ఆటలు ఆడ టం వల్ల పిల్లల్లో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వం పెరుగు తుందని తెలిపారు. పిల్లలకు ఆహారం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, పాఠశాలల చైర్మన్ మల్లెం పాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య,ఏజీఎం ముద్రకోల రాజు, అకాడమిక్ కోఆర్డినేటర్స్ ప్రవీణ్,మమతా రెడ్డి, మిర్యాల మమత ,ప్రిన్సిపాల్ సుదేష్ కుమారి, లీలావతి, ఇన్చార్జులు అంజయ్య, అరుణ్, రజిత, ప్రవళిక, యశస్విని, హరీష, పిఈటిలు సుధాకర్,మారుతి, తిరుపతి, కవిత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆకునూరి సుధీర్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

# పేదల ఆత్మగౌరానికి చిహ్నంగా ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ

- ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు జమ 200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం
- మంథని మండలం అడవి సోమనపల్లి గ్రామంలో పర్యటించి పూర్తయిన 40 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు





**మంథని, (జనంసాక్షి) :** పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ ను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం రాత్రి మంథని మండలం అడవి సోమనపల్లి గ్రామంలో పర్యటించి పూర్తయిన 40 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి ప్రారంభించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి పేద ప్రజలకు ఇచ్చిన మాట మేరకు మొదటి దఫా లోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3500 చొప్పున మొత్తం 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే పేదలు ఎక్కడా ఇబ్బంది పడకుండా ప్రతి సోమవారం డబ్బులు విడుదల చేస్తున్నామని అన్నారు. మన పెద్దపల్లి జిల్లాలో మంథని నియోజకవర్గం పరిధిలో నేడు గృహ ప్రవేశాలు జరుపుకోవడం సంతోషంగా ఉందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. పేద ప్రజల ముఖాలలో సంతోషం చూస్తే తనకు చాలా సంతృప్తి కలుగుతుందని అన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేస్తామని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల లోపు మరో మూడు విడతలలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. పేద ప్రజల ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, ఉగాది నుంచి నిరుపేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ, 11 లక్షల నూతన రేషన్ కార్డుల పంపిణీ చేశామని తెలిపారు. సోమనపల్లి వద్ద 200 కోట్లతో చేపట్టిన యంగ్ ఇండియా గురుకుల పాఠశాల పనులు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో రైతులు తాళ్ళ కట్టింగ్ తో ఇబ్బందులు పడితే మన ప్రజా ప్రభుత్వం కట్టింగ్ కు స్వస్తి పలికి సన్నరకం వడ్లకు క్వింటాళ్ల 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. 25 లక్షల 65 వేల మంది రైతులకు 20 వేల 681 కోట్ల రూపాయల 2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేసామని అన్నారు. వానాకాలం పంటలో సన్న రకం పండించిన ధాన్యానికి 1800 కోట్ల బోనస్ అందించామని అన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ లాభసాటి వ్యవసాయం ఎలా చేయాలి అనే అంశంపై రైతులకు శిక్షణ అందించే కార్యక్రమాన్ని చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ రాజేశ్వరరావు, మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి సురేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



# కేసుల విచారణలో నాణ్యతే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలి

### రైటర్ల సమీక్షలో జిల్లా ఎస్పీ మార్గనిర్దేశం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 13 (జనం సాక్షి)** జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, స్టేషన్ రైటర్లు, సర్కిల్, డీఎస్పీ ఆఫీస్ రైటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, కేసుల దర్యాప్తు, విచారణ మరియు పరిశోధనలో నాణ్యత ప్రమాణాలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా సిసిటిఎన్ఎస్ వ్యవస్థలో కేసులకు సంబంధించిన అన్ని వివరాలు సమయానుసారంగా అప్డేట్ అవుతూ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని రైటర్లకు సూచించారు.సాక్షుల మరియు ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు ప్రతి కేసులో కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ గుర్తుచేశారు. తప్పుడు లేదా నేరస్థులకు అనుకూలంగా ఇచ్చే స్టేట్‌మెంట్లు విచారణ నాణ్యతను దెబ్బతీస్తాయని తెలిపారు.ఎఫ్ఐఆర్ నుంచి చార్జ్‌షీట్ వరకు అన్ని వివరాలు స్పష్టంగా, సమగ్రంగా, తప్పులు లేకుండా నమోదు చేయడం ప్రతి రైటర్ బాధ్యతని సూచించారు. బాధితునికి సమయానికి న్యాయం జరగేలా ప్రతి చర్య ఉండాలని, బాధితునికి న్యాయం లభిస్తేనే చట్టంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని అదే పోలీస్ బాధ్యత అని ఎస్పీ తెలిపారు ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కె. నరసింహ రెడ్డి, ఇతర అధికారులు మరియు జిల్లాలోని అందరు రైటర్లు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా రెసోనెన్స్ 'రెసోఫెస్ట్ 2025'








**హైదరాబాద్, నవంబర్ 13 (జనంసాక్షి) :** రెసోనెన్స్ జూనియర్ కాలేజీలు, స్కూళ్లు సంయుక్తంగా వార్షిక సాంస్కృతిక, విద్యా మహోత్సవం 'రెసోఫెస్ట్ 2025'ను గచ్చిబౌలీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. విద్యార్థుల సృజనాత్మకతకు వేదికగా ఈ వేడుక వైభవంగా సాగింది. రెండు రోజుల ఈ వేడుకలో మొదటి రోజు హైదరాబాద్, తెలంగాణలోని 35 క్యాంపస్‌లకు చెందిన ఏడు వేల మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ప్రారంభ వేడుకకు వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు. వీరిలో తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఎస్ కృష్ణ ఆదిత్య, బ్రహ్మోస్ ఎయిరోస్పేస్ సీఈఓ, ఎండీ డాక్టర్ జయతీర్థ ఆర్ జోషి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకకు ప్రముఖ సినీ తారలు విచ్చేశారు. దర్శకులు నాగ్ అశ్విన్, నటులు శర్వానంద్, కిరణ్ అబ్బవరం, ప్రియదర్శి, యాంకర్ సుమ కనకాల, సినీ నటి ఆనంది పాల్గొన్నారు. ఈవెనింగ్ వేడుకలో నృత్యం, సంగీతం, నాటక రంగాల్లో ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. అంతర్ క్యాంపస్ పోటీల్లో విజేతలైన విద్యార్థులను, ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ప్రవేశం పొందిన వారిని సత్కరించారు. ఈ సందర్భంగా రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్, ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థి ఎన్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ 'రెసోఫెస్ట్' అనేది జిజ్ఞాస, సృజనాత్మకత, స్వభావం అనే మూడు అంశాలపై పండుగ అన్నారు. ఇది ఒక కార్యక్రమం మాత్రమే కాదని, రెసోనెన్స్ ఆత్మను ప్రతిబింబించే ఒక కార్యక్రమం అన్నారు.

# ఆర్టీసీ బస్సు టైర్ల నుంచి పొగలు


- అయిజ-కర్నూలు బస్సులో ఘటన
- 90 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు
- వేరొక బస్సులో ప్రయాణికుల తరలింపు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన శాంతినగర్ పోలీసులు





**రాజోలి / మానవపాడు, నవంబర్ 13 (జనంసాక్షి) :** కర్నూలులో జరిగిన ట్రావెల్ బస్సు విషాదం గుర్తుకు వచ్చిందో లేక బస్సులో పొగలు చూసి భయపడ్డారో కాని ఒక్కసారిగా బస్సులో ఉన్న వారంతా కేకలు వేశారు. మిగతా వారంతా ముందువారిని నెట్టుకుంటూ బయటకు వచ్చేందుకు ప్రయత్నించారు. ఈ గందరగోళం అంతా కొన్ని నిమిషాల పాటు జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని మద్దూర్ స్టేజి వద్ద ఆర్టీసీ బస్సులో గురువారం చోటుచేసుకుంది. ఇక వివరాల్లోకెళ్తే..గద్వాల జిల్లా డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రోజు మాదిరిగానే గురువారం ఉదయం గద్వాల నుండి అయిజ డిపోకు ఉదయం 8:45 రాగానే అనంతరం 90 మంది ప్రయాణికులతో కర్నూలుకి బయల్దేరాగా మద్దూర్ స్టేజి ప్రాంతంలో బస్సు వెనక టైర్‌లోని బేరింగ్ నుంచి అకస్మాత్తుగా పొగలు వచ్చాయి. దీంతో భయభ్రాంతులకు గురైన ప్రయాణికులు ఒక్కసారిగా కేకలు వేయడంతో డ్రైవర్ సత్యారెడ్డి చాకచక్యంగా బస్సును నిలిపివేశాడు. బస్సుకు మంటలు వ్యాపించకుండా సీఓటు సిలిండర్ తో ఆర్పేశారు. ఘటన జరిగిన సమయంలో బస్సులో సుమారు 90 మంది ప్రయాణికులు ఉన్నారు. సమాచారం అందుకున్న శాంతినగర్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం మరో ఆర్టీసీ బస్సులో ప్రయాణికులను గమ్యస్థానాలకు తరలించారు. ఇటీవల తెలుగు రెండు రాష్ట్రాల్లో జరిగిన ప్రమాదాలు ప్రయాణికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. కర్నూల్, చేవేళ్ల బస్సు ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడిన ఘటనలు ఇంకా కళ్లముందే కదలాడుతూనే ఉన్నాయి.

## గ్రామీణ బ్యాంకు సేవలను
# సద్వినియోగం చేసుకోవాలి
### రీజినల్ మేనేజర్ ఎల్ శీల



**కేశంపేట, నవంబర్ 13 (జనంసాక్షి) :** తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అందజేస్తున్న సేవలను ఖాతాదారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు రీజినల్ మేనేజర్ ఎల్ శీల అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు కొత్తపేట శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శీల మాట్లాడుతూ... ఖాతాదారులు తమ భద్రత కోసం ఇన్సూరెన్స్ పాలసీలను చేయించుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఖాతాదారుడు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన బీమా పథకాలలో భాగస్వాములు కావాలన్నారు. ఏటీఎం రూపే కార్డులను వాడి సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు పేరుతో వచ్చే మోసపూరిత ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు నుండి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని అన్నారు. అనంతరం కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డి. సురేష్ కుటుంబ సభ్యులకు 20 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు. మృతి చెందిన సురేష్ బ్యాంకులో వెయ్యి రూపాయలతో ప్రమాద బీమా చేయించుకోని ప్రమాదవశాత్తు మృతి చెందడంతో చెక్కును అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు బిజినెస్ సీఎం పి. కిషోర్, ఎఫ్ఐసి మహేశ్వర్ రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ సోమనాథ్, ఫీల్డ్ ఆఫీసర్ వీరకుమార్, ఏఎంహెచ్ హబ్ మేనేజర్ షాలి, ఏఎంహెచ్ హబ్ డివో సుబ్బారెడ్డి, ఎఫ్ఎల్ సి కౌన్సిలర్ బి. సురేష్ రెడ్డి, ఎస్బిఐ జనరల్ బిడిఎంలు గోపి, ఆలీ, బ్యాంకు మిత్రలు జె. అశోక్, కె. అనిత పాల్గొన్నారు.



# యస్.బిఐటికి ఎడ్యుకేషన్ చేంజ్ మేకర్ అవార్డ్

**ఖమ్మం(జనంసాక్షి) :** ఐ.టి.సి అకాడమీ ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బ్రిడ్జ్ కార్యక్రమంలో 2025వ వార్షిక సంవత్సరానికిగాను ఖమ్మం యస్.బి.ఐ.టి. ఇంజనీరింగ్ కళాశాలకు ఎడ్యుకేషన్ చేంజ్ మేకర్ అవార్డ్ దక్కింది. గురువారం హైదరాబాద్ లో నిర్వహించిన బ్రిడ్జ్ 2025 కార్యక్రమంలో తమిళనాడు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి పళనివేల్ త్యాగరాజన్ చేతుల మీదుగా అవార్డ్ ను కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేవలం మూడు కళాశాలలను మాత్రమే ఎంపిక చేయగా, ఎస్‌బిఐటి కళాశాల మొదటి స్థానంలో నిలిచింది. ఉన్నత విద్యా ప్రమాణాలలో విప్లవాత్మక మార్పులు రూపొందించినందుకుగాను ఈ అవార్డుకు కళాశాల ఎంపికైనట్లు కృష్ణ తెలిపారు.

# నవంబర్ 15న యూనిటీ మార్చ్ నిర్వహణ
### సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా వేడుకలపై పత్రికా సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్ డి.వేణు




**పెద్దపల్లి,నవంబర్ 13(జనంసాక్షి) :** నవంబర్ 15న యూనిటీ మార్చ్ నిర్వహించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ డి.వేణు అన్నారు.గురువారం అదనపు కలెక్టర్ డి.వేణు సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా చేపట్టిన వేడుకల పై పత్రికా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా 763 గ్రామాలలో యూనిటీ మార్చ్ నిర్వహిస్తుందని, మన పెద్దపల్లి జిల్లాలో నవంబర్ 15న యూనిటీ మార్చ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.యూనిటీ మార్చ్ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు , ఎంపీ ప్రజాప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉందని అన్నారు. జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి జిల్లాలోని అన్ని కళాశాలలకు యూనిటీ మార్చ్ పై సమాచారం అందించి విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలని అన్నారు. యూనిటీ మార్చ్ ప్రశాంతంగా జరిగే విధంగా అవసరమైన భద్రత కల్పించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలోని వివిధ విద్యా సంస్థల్లో ఉన్న స్కౌట్, ఎన్.సి.సి బృందాలు పెద్ద ఎత్తున పాల్గొనాలని, నవంబర్ 15న ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ ఐటిఐ కళాశాల నుంచి జూనియర్ కళాశాల వరకు యూనిటీ మార్చ్ నిర్వహించడం జరుగుతుందని ,యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.అనంతరం అదనపు కలెక్టర్ యూనిటీ మార్చ్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు.ఈ సమావేశంలో జిల్లా యువజన అధికారులు సురేష్,వెంకట్ రాంబాబు,కళాశాల ప్రిన్సిపల్స్ రవీందర్ రెడ్డి, నీతా రెడ్డి, సీఐ.ప్రవీణ్ కుమార్, పీటీలు ఎన్ సి సి. అధికారి ధ్రువ కుమార్, సంబంధిత అధికారులు,పాత్రికేయులు ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం రిజర్వేషన్లపై స్పందించకుంటే ఉద్యమం ఉధృతం
### బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష

**పెద్దపల్లి,నవంబర్ 13(జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంలోప్రభుత్వం వెంటనే స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష తెలిపారు. తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించాలనే ముఖ్య డిమాండ్‌తో గురువారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద బీసీ జేఏసీ నాయకులు ధర్మ పోరాట దీక్ష నిర్వహించారు. ఈ ధర్మ పోరాట దీక్ష శిబిరాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ సందర్శించి సంఘీభావం తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష మాట్లాడుతూ రిజర్వేషన్ల సాధనకు పోరాటం కోసం గ్రామ స్థాయి వరకు అన్ని కమిటీలు వేసి ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ ఉద్యమం తెలంగాణ పోరాటం, స్వాతంత్ర్య పోరాటం తరహాలో ఉంటుందన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక నాయకుడు తయారయ్యే విధంగా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.దీక్షలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి శంకర్, జిల్లా వైస్ చైర్మన్ కొండి సతీష్, జిల్లా మహిళా కన్వీనర్ సిరవేన స్వప్న, జిల్లా కన్వీనర్ సలేంద్ర కొమరయ్య యాదవ్ పాల్గొన్నారు.

# మసీదులోకి దుర్గంధం

- ఖమ్మం మక్కా మసీదు పక్కన ఖాళీ స్థలంలో చెత్త ట్రాక్టర్లు
- దోమల విహారంతో అల్లడితల్లడి
- నెరవేరని కమిషనర్ హామీ
- నాలుగు నెలలైనా చర్యలు శూన్యం




**ఖమ్మం బ్యూరో (జనంసాక్షి) :** ఖమ్మం కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న మక్కా మసీదు పక్కనే ప్రభుత్వ ఖాళీ స్థలం చెత్త ట్రాక్టర్లకు నిలయంగా మారింది. మసీదులో ప్రార్థనలకు వచ్చే భక్తులు, బస్సులో ప్రయణించే ప్రయాణికులు దుర్గంధంతో పాటు దోమల విహారం వల్ల ఫీవర్ ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై గత నాలుగు నెలల క్రితమే ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కు వినతిపత్రం సమర్పించిన నేపథ్యంలో ఒక నెలలోపు ఈ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి, ఇప్పటికీ నాలుగు నెలలు గడిచిన ఈ పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించలేదని ఇమామె ఖతిబ్ మస్జిద్ ఎ జైన్, అవామే హింద్ వెల్ఫేర్ అండ్ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ హాఫిజ్ మొహమ్మద్ జవ్వాద్ అహ్మద్ ఒక ప్రకటనలో విమర్శించారు. దీనివల్ల ప్రజలు అనారోగ్యానికి గురై మంచాన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పవిత్ర ప్రదేశాలైన మసీదు, గుడి ,చర్చి, గురుద్వార్ వంటి పవిత్ర ప్రదేశాలు శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిది. ఖమ్మం నగరం పారిశుధ్యం సరిగ్గా లేకపోతే సీజన్ వ్యాధుల కు ఆహ్వానం పలికినట్లేనని పేర్కొన్నారు. జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తోపాటు సంబంధిత డివిజన్ కార్పొరేటర్ ఈ పారిశుద్ధ్యపై దృష్టి సారించాలని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. మసీదు పక్కన ఉన్న ప్రభుత్వ కాలేజీ స్థలంలో మొక్కలు నాటాలని, అక్కడి నుండి చెత్త ట్రాక్టర్లను చెత్తను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను పరిష్కరించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.





# శిశు సంరక్షణ కేంద్రం ప్రారంభించిన డైరెక్టర్

**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి చైర్మన్ అండ్ డైరెక్టర్ యన్.బలరామ్ సారథ్యంలో సింగరేణి సంస్థలో ఉద్యోగులకు సదుపాయాల పట్ల సంక్షేమ దృక్పథం కలిగి ఉంటుంది అనడానికి నిదర్శనానికి ప్రతీకగా గురువారం ఆర్జీ-1 జనరల్ మేనేజర్ కార్యాలయంలో సంస్థ డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్వి సూర్యనారాయణ చేతులమీదుగా క్రెచ్ (అనగా శిశు సంరక్షణా కేంద్రం)ను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు చిన్న పిల్లల సంరక్షణ గురించి ఏర్పాటు చేసిన ఈ క్రెచ్‌లో పిల్లలు సురక్షితమైన, శుభ్రమైన ఆటలతో కూడిన వాతావరణాన్ని సకల సదుపాయాలతో కల్పించడం వలన మహిళా ఉద్యోగులు ఆందోళన లేకుండా పని చేసుకుంటారని ఎల్వీ సూర్యనారాయణ అన్నారు.పిల్లలు సంతోషంగా, సురక్షితంగా ఉండటానికి దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమలో జనరల్ మేనేజర్ డి.లలిత్‌కుమార్, యస్.ఓ.టు జియం కె.చంద్రశేఖర్, ఏఐటీయూసీ (గుర్తింపు సంఘం) పిట్ సెక్రటరీ ఇ.రాజు, సీఎంఓఏఐ ప్రతినిధి డి.శ్రావణ్‌కుమార్,ఏరియా ఇంజనీర్,కె.రామమోహన్, జీడికే.వన్ గ్రూప్ ఏజెంట్ ఎల్.రమేష్, డీజీఎం (సివిల్) కేడిఎన్ ప్రసాద్, సెక్యూరిటి ఆఫీసర్, అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓసీపీలో బొగ్గు నాణ్యతా వారోత్సవాలు



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి సీఎండీ యన్.బలరామ్ సారథ్యంలో సింగరేణి సంస్థలో బొగ్గు నాణ్యత వారోత్సవాలు గురువారం నుంచి ఈ నెల19వ తేదీ వరకు నిర్వహించనున్నామని సింగరేణి యాజమాన్యం ప్రకటించింది.ప్రతిష్టాత్మకంగా క్వాలిటీ డిపార్ట్‌మెంట్ అధ్వర్యంలో నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ప్రపంచ నాణ్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని జీడికే కోల్‌మైన్ ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే.ఓసీపీ -5లో బొగ్గు నాణ్యత వారోత్సవాలను సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్వి సూర్యనారాయణ గురువారం ప్రారంభించారు.కార్యక్రమంలో భాగంగా ప్రస్తుత పోటీ మార్కెట్లో బొగ్గు నాణ్యతకు ఉన్న ప్రాధాన్యతను.. బొగ్గు నాణ్యతను పెంపొందించుకోవడానికి కావలసిన సూచనలు చేశారు.కార్యక్రమంలో సింగరేణి ఆర్జీ-1 ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్‌కుమార్,జనరల్ మేనేజర్ (క్వాలిటీ) రామగుండం రీజియన్ ముజుందార్, జనరల్ మేనేజర్ (సేఫ్టీ) రామగుండం రీజియన్ ఎస్.మధుసూదన్,ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మద్దిఎల్లయ్య, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ అరెల్లి పోశం,సీఎంఓఏఐ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పానుగోటి శ్రీనివాస్,ఎస్ఓటు జిఎం కె.చంద్రశేఖర్,ప్రాజెక్ట్ ఆఫీసర్ డి. రమేష్, జీడికె వన్ గ్రూప్ ఏజెంట్ ఎల్.రమేష్,జీడికె 11 ఏజెంట్ చిలుక శ్రీనివాస్,ఏరియా ఇంజనీర్, రామ్మోహన్,మేనేజర్ డి.రమేష్‌బాబు,ప్రాజెక్ట్ ఇంజనీర్ పి.రమేష్, సీఎంఓఏఐ ఆర్జీ-1 ఏరియా వైస్ ప్రెసిడెంట్ పెరుమళ్ల శ్రీనివాస్, ఏరియా పర్సనల్ అధికారి ఎం.రవీందర్‌రెడ్డి,ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ గుర్రం ప్రభుదాస్, ఏరియా క్వాలిటీ ఇంచార్జ్ బి.బ్రహ్మాజీ, మైన్ క్వాలిటీ ఇంచార్జ్ ఏ.రవి, ఆర్జీ-1 ఏరియా అన్ని గనులు, డిపార్ట్మెంట్ల శాఖా అధిపతులు, జీడీకే.సీఎం అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లకై పోరాటం ఉధృతం

- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం
- నేడు పెద్దపల్లిలో బీసీ సంక్షేమ సంఘం ధర్నా




**పెద్దపల్లి,నవంబర్ 13(జనంసాక్షి) :** తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ ఆదేశాల మేరకు,బీసీల హక్కులు మరియు 42 శాతం రిజర్వేషన్ల సాధన లక్ష్యంగా ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి పెద్దపల్లి జిల్లాలో నూతన కార్యవర్గ నియామకం జరిగింది.పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కందుల సదాశివ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో జిల్లా మరియు మండల స్థాయిలకు నూతన కార్యవర్గ నియామక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గానికి మరియు పలు మండలాలకు నూతన నాయకులను నియమించారు.జిల్లా ఉపాధ్యక్షులుగా గుర్రాల వీరేశం,జిల్లా సహాయ కార్యదర్శులుగా వంగ రవీందర్, కొమ్ము కరుణాకర్,దండే వెంకటేశ్వర్లు,జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి చర్లపల్లి రాజు గౌడ,ధర్మారం మండల ప్రధాన కార్యదర్శి మూల మల్లేశం గౌడ్,ఓదెల మండల ప్రధాన కార్యదర్శి రాపోలు హనుమంతరావును నియమించారు.ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చర్లపల్లి సురేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై,పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల అశోక్ పటేల్,జిల్లా ఉపాధ్యక్షులు దాసరి కొమురయ్య యాదవ్,జిల్లా సలహాదారులు డాక్టర్ మంద భాస్కర్ యాదవ్ లతో కలిసి నూతనంగా నియమితులైన నాయకులకు నియామక పత్రాలను అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ బీసీల ఐక్యతతోనే హక్కులు సాధించుకోగలమని ఉద్ఘాటించారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల లక్ష్యం మేరకు సంఘం పోరాటం చేస్తుందని,రాబోవు రోజుల్లో బీసీ సంఘం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.రిజర్వేషన్ల డిమాండ్ సాధనలో భాగంగా నవంబర్ 13న పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి బీసీ నాయకులు,కార్యకర్తలంతా పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# చస్తే స్మశానానికి బాటలేదు..!
## ఆదర్శ ఉత్తమ గ్రామ పంచాయతీ గ్రామంలో ఇది దుస్థితి

- స్మశాన వాటికకు వెళ్లే దారులు కబ్జా
- అయోమయంలో గ్రామస్తులు









**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) :** 2017లో ఆ గ్రామానికి నేషనల్ ఆదర్శ ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు దక్కింది. పెద్దఎత్తున ఆ గ్రామం పేరు పత్రికల్లో కనిపించింది. కానీ నేడు అదే గ్రామంలో చస్తే స్మశాన వాటికకు శవాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తి చేసుకోవడానికి బాటలేక అయోమయంలో పడ్డారు గ్రామస్తులు. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం గంట్లవెల్లి గ్రామంలో చెరువులో ఉన్న స్మశాన వాటికకు (పానది) కాలువ నుండి వెళ్లే దారులు మొత్తం కబ్జాకు గురి కావడంతో ప్రస్తుతం స్మశాన వాటికకు ఎలా వెళ్లాలని గ్రామస్తులు అయోమయంలో పడ్డారు. ఇప్పుడు ఆ పరిస్థితి ఎందుకు వచ్చిందంటే.. గ్రామానికి చెందిన మంగలి బాలమని వయసు పైబడి చనిపోయారు. ఆమెను స్మశాన వాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తి చేసుకోవడానికి దారి లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత ఎన్నో సంవత్సరాల నుండి ఆ రహదారి నుండి వెళ్లే దారి కూడా కొద్దిగా ఉండడం, ఆ రహదారి కూడా పూర్తిగా లేకపోవడంతో మొత్తంగా స్మశాన వాటికకు వెళ్లే దారి లేకుండా పోయింది. దీంతో గ్రామస్తులు ఎవరు చనిపోయిన స్మశాన వాటికకు ఎలా తీసుకువెళ్లాలని ఆలోచనలో పడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికార యంత్రం స్పందించి గతం నుండి ఉన్న బాటను కబ్జాకు గురైన స్థలాన్ని పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
14 నవంబర్ 2025

# టెక్నాలజీలో ప్రావీణ్యం సాధించాలి

- టీ-సాట్ వేదికపై ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** విద్యార్థులు సక్సెస్ సాధించాలంటే టెక్నాలజీలో మంచి ప్రావీణ్యం సంపాధించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని టి-సాట్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల 'రాష్ట్ర స్థాయి వార్షిక పోటీలు-2025' విజేతల బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ సమాజంలో అత్యంత వేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా కొత్త విషయాలు నేర్చుకుంటూ విద్యార్థులు ఉత్తమమైన ఫలితాలు సాధించాలని, ప్రస్తుత కాలంలో విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానాన్ని అంచనావేయలేకపోతున్నామన్నారు. విద్యార్థుల మేథో సంపత్తికి టి-సాట్ సాంకేతికను ఉపయోగించుకుని తమ తమ భవిష్యత్ కు గట్టి పునాదులు వేసుకోవాలని సూచించారు. విద్యార్థులు విజయం సాధిస్తే టీచర్లు మొదటగా, ఆ తరువాత తల్లిదండ్రులు సంతోషిస్తారని, చదువుల్లో మొదటి స్థానమే కాకుండా ఇలాంటి కార్యక్రమాలు చాలా ముఖ్యం అని, విద్యార్థుల్లో నైపుణ్యం వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. టి-సాట్ పోటీల్లో విజేతలైన 99 మంది విద్యార్థులు, ఒక్కరు సుమారు 2,200 విద్యార్థుల నాలెడ్జితో సమానమనే విధంగా భావించాలని గుర్తుచేశారు. అందుకే ప్రజా ప్రభుత్వం విద్యకు అధిక ప్రాదాన్యత నిస్తుందని, డిజిటల్ విద్యలో టి-సాట్ నెట్వర్క్ అందిస్తున్న సాంకేతికతను ప్రభుత్వ పాఠశాలలు, మారుమూల ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని, తద్వారా రాష్ట్ర ప్రభుత్వ కలలను తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిజం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు టి-సాట్ డిజిటల్ పాఠాలు చాలా ఉపయోగపడ తాయన్నారు. సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం




పక్షాన మంత్రి శ్రీధర్ బాబు టి-సాట్ కు సంపూర్ణ మద్దతు అందచేస్తూ, తెలంగాణ విద్యార్థులు, యువతకు పరోక్షంగా చేయూనిస్తున్నారని కొనియాడారు. ప్రతి రోజా గంట పాటు విద్యార్థులు టి-సాట్ నెట్వర్క్ ను చూడాలని కోరారు. ప్రతి రోజు ఒక్క గంటైనా టి-సాట్ ప్రసారాలు చూడాలని విద్యార్థులకు సూచించారు. తెలంగాణ గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.రాజ్ గంగారెడ్డి, ఎస్.గిరిధర్ గౌడ్ మాట్లాడుతూ టి-సాట్ నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని విద్యార్థులకు అందించే విధంగా తాము సంధాన కర్తలుగా వ్యవహరిస్తూ మా బాధ్యతను నిర్వర్తిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి టి-సాట్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఎం.డి సాధిక్ స్వాగతోపన్యాసం చేయగా జనరల్ మేనేజర్ లింగారెడ్డి వందన సమర్పన చేశారు.

### విజేతలు వీరే...

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 'రాష్ట్ర స్థాయి వార్షిక పోటీలు 2025' పేరుతో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు గురువారంతో ముగిసాయి. నవంబర్ నాల్గవ తేది నుండి 13వ తేది వరకు మండల, జిల్లా, జోనల్ స్థాయితో పాటు బుధ, గురువారాల్లో టి-సాట్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో 33 జిల్లాల నుండి జిల్లాకు ఒకరు చొప్పున 33 మంది విద్యార్థులు పాల్గొనగా వక్తృత్వ పోటీల్లో 31 జిల్లాల నుండి 31 మంది పాల్గొన్నారు. క్విజ్ ప్రథమ విజేతగా రాజన్న సిరిసిల్ల జోన్, ద్వితీయ విజేతగా కాళేశ్వరం జోన్ నిలవగా, మూడవ స్థానంలో బాసర జోన్ నిలిచింది. జోగులాంగ గద్వాల జోన్ సైతం అత్యంత ప్రతిభ కనబరిచి ప్రత్యేక విజేతగా నిలిచింది. రాష్ట్రంలోని ఏడు జోన్ల నుండి ఒక్కో జోన్ కు ఐదుగురు విద్యార్థులతో కూడిన టీం చొప్పున 35 మంది విద్యార్థుల మధ్య ఏడు జోన్లకు క్విజ్ పోటీలు జరిగాయి. వక్తృత్వ (బాలవృక్త) పోటీల్లో ప్రథమ విజేతగా జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన 10వ తరగతి విద్యార్థి కె.కేశవర్ధన్ నిలిచారు. రెండవ స్థానంలో మేడ్చల్ మల్కాజ్ గిరికి చెందిన కె.వి.యషశ్విని ద్వితీయ, నిర్మల్ జిల్లాకు చెందిన వంగా వెంకటకృష్ణ తృతీయ విజేతలుగా నిలిచారు. వ్యాస రచన పోటీల్లో ప్రథమ విజేత నిజామాద్ జిల్లాకు చెందిన టి.హర్షిత, నారాయణ్ పేట్ కు చెందిన ఎం.కీర్తన, మూడవ స్థానంలో మేడ్చల్ జిల్లాకు చెందిన డి.తేజస్విని గెలుపొందారు. వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ టి-సాట్ పార్టిసిపేషన్ సర్టిఫికేట్లను అందచేసి ప్రోత్సహించింది.

# కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఉదారత

- సర్కారు స్కూళ్లలోని 10వ తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు కట్టాలని నిర్ణయం




**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** విద్యార్థుల చదువు, వారికి కనీస సదుపాయాలు కల్పించే విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ కనబరిచే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మరోసారి.. విద్యార్థుల పట్ల తన ఉదారతను చాటుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులపై ఫైనల్ పరీక్ష ఫీజు భారం పడకుండా.. తానే ఆ ఫీజును చెల్లించేందుకు ముందుకొచ్చారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ శ్రీమతి దాసరి హరిచందనకు కేంద్రమంత్రి లేఖ రాశారు. 'ఏ ఒక్క విద్యార్థి కూడా ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదనేది నా అభిమతం. గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ గారు ఇచ్చిన అంత్యోదయ స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పదో తరగతి పిల్లలకు నా వంతుగా సహాయం చేయాలని అనుకుంటున్నాను. అందుకే, నేను ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులందరికీ తెలంగాణ ఎస్సెస్సీ బోర్డు పరీక్ష ఫీజు మొత్తాన్ని నా జీతం నుంచి చెల్లించాలని నిర్ణయించాను. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. భవిష్యత్తులో గొప్పస్థాయికి చేరుకోవాలని మస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను' అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.. గత కొన్నేళ్లుగా సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల్లో మౌలికవసతుల కల్పన, విద్యార్థులకు అవసరమైన వస్తువుల పంపిణీ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణం, మెకనైజ్డ్ టాయిలెట్ క్లీనింగ్ మెషీన్స్ అందజేస్తున్నారు. దీంతోపాటుగా.. డబుల్ డెస్క్ బెంచీలను కూడా కిషన్ రెడ్డి సమయానుగుణంగా అందజేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో.. నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్నారు. పలు పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌రూమ్స్ కు కూడా కేంద్రమంత్రి సహకారం అందించిన సంగతి తెలిసిందే. విద్యార్థులకు అందిస్తున్న సహకారంలో భాగంగా.. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థుల ఫైనల్ ఎగ్జామ్ ఫీజును పార్లమెంటు సభ్యుడిగా అందుకుంటున్న వేతనం నుంచి చెల్లించాలని నిర్ణయించారు.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

- 3వేలకు పైగా పెరిగిన బంగారం

**హైదరాబాద్, నవంబర్13 (జనంసాక్షి) :** బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కొలొచ్చాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల పసిడి ధర ఒక్కరోజే దాదాపు రూ.3 వేలకు పైగా పెరిగి రూ.1,31,500కు చేరుకుంది. 22 క్యారెట్ల పుత్తడి ధర ధర రూ.1,17,150 పలుకుతోంది. కిలో వెండి ధర ఒక్కరోజే రూ.10వేలకు పైగా పెరిగి రూ.1,71,300కు చేరింది. అంతర్జాతీయంగా మార్కెట్‌లో పసిడి ధర ఔన్సు మళ్లీ 4200 స్థాయిని దాటి 4,218 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 54.10 డాలర్ల వద్ద కొనసాగుతోంది. దీన్ని అనుసరించి దేశీయంగా బంగారం, వెండి ధరలు పెరిగాయి. అమెరికా చరిత్రలో అత్యధిక కాలం పాటు కొనసాగిన ప్రభుత్వ షట్‌డౌన్ ఎట్టకేలకు ముగిసింది. దీంతో ఆర్థిక కార్యకలాపాలు ఎప్పటిలానే యథావిధిగా కొనసాగనున్నాయి. ముఖ్యంగా ఎకనామిక్ డేటా వెలువడనుంది. దీంతో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతకు మార్గం సుగమం కానుంది. ఈ కారణంతోనే బంగారం ధర పెరుగుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. దీనికితోడు డాలర్ ఇండెక్స్ బలహీన పడడం, సెంట్రల్ బ్యాంకుల నుంచి కొనుగోళ్లు ఎప్పటిలానే కొనసాగుతుండడం కూడా పసిడి డిమాండ్‌కు కారణమని పేర్కొంటున్నారు.

# హైదరాబాద్‌లో హైఅలర్ట్

- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు
- పర్యాటక ప్రాంతాలు, షాపింగ్ మాల్స్‌లోనూ సోదాలు



**హైదరాబాద్, నవంబర్13 (జనంసాక్షి) :** భాగ్యనగరంలో హైఅలర్ట్ కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో మెట్రో నగరాల్లో హై అలర్ట్ కొనసాగుతోంది. బస్టాండ్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు , శంషాబాద్ ఎయిర్ పోర్టులలో విస్తృత తనిఖీలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్‌లో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో అధికారులు తనిఖీలు నిర్వహించారు. మతపరమైన ప్రాంతాలు, పర్యాటక ప్రాంతాలు, షాపింగ్ మాల్స్‌లోనూ సోదాలు జరుగుతున్నాయి. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిటీ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. హోటల్స్‌పై పోలీసులు నిఘా పెంచారు. ఇక.. దేశంలో ఎక్కడ, ఏ ప్రాంతంలో పేలుళ్లు జరిగినా వాటి మూలాలు హైదరాబాద్‌లో ఉండటం తీవ్ర కలకలం రేపుతున్న విషయం. ఎన్ఐఏ, వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసులు రాష్ట్రంలో తనిఖీలు చేయగా అనుమానిత వ్యక్తులు పట్టుబడటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల రాజేంద్రనగర్‌లో ఉగ్రవాద ఆరోపణలతో డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్‌ను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. గత అర్ధరాత్రి సయ్యద్ ఇంట్లో సోదాలు జరిపిన గుజరాత్ పోలీసులు.. పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజుల క్రితం ఢిల్లీలో భారీ పేలుడు ఘటన దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఎర్రకోట మెట్రోస్టేషన్ సిగ్నల్ వద్ద నిలిచిన ఓ కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఢిల్లీ బ్లాస్ట్‌తో దేశవ్యాప్తంగా మెట్రో నగరాల్లో హైఅలర్ట్ కొనసాగుతోంది.

# మూడో కారు కోసం దర్యాప్తు ముమ్మరం

- ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారు స్వాధీనం
- కారు నడిపిన వ్యక్తి ఫహీమ్ అరెస్ట్

**న్యూఢిల్లీ, నవంబర్13 (జనంసాక్షి) :** ఢిల్లీ పేలుడు కేసులో తాజాగా మరో అరెస్ట్ చోటు చేసుకుంది. పేలుడు కేసులో ప్రధాన అనుమానితుడైన డాక్టర్ ఉమర్ ఉన్ నబీకి సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న డీఎల్10సీకే0458 అనే ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. హర్యానాలోని ఖండవలి గ్రామంలో బుధవారం కనుగొన్నారు. అయితే, ఆ కారును అక్కడ పార్క్ చేసిన వ్యక్తిని ఫరీదాబాద్ పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. అతడిని ఫహీమ్‌గా గుర్తించారు. ఈ మేరకు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు నిఘా వర్గాల ద్వారా తెలిసింది. మరోవైపు ఎర్రకోట వద్ద పేలుడుతో సంబంధం ఉన్న మూడో కారు కోసం దర్యాప్తు సంస్థలు వేట కొనసాగిస్తున్నాయి. సోమవారం సాయంత్రం తెలుపు రంగు హుందయ్ ఐ20 కారుతో డాక్టర్ ఉమర్ నబీ ఆత్మాహుతి దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఉగ్రకుట్ర కోసం మూడు కార్లు వాడినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును ఫరీదాబాద్‌లో గుర్తించిన విషయం తెలిసిందే. ఇప్పుడు మూడో కారు మారుతీ బ్రీజా కోసం పోలీసులు అన్వేషిస్తున్నారు. ఆ కారు ఆచూకీ చిక్కడం లేదు. నిందితులు ఆ మూడో కారును తప్పించుకోవడం కోసం వాడాలని భావించి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. దర్యాప్తు సంస్థలకు చెందిన బృందాలు ఆ కారు కోసం వేట కొనసాగిస్తున్నాయి.



# ఆర్టీసీ ఆదాయ మార్గంలో పయనించాలి

- కొత్త కాలనీలకు బస్ సౌకర్యాలు కల్పించాలి
- అధికారులతో సమీక్షలో మంత్రి పొన్నం ఆదేశం

**హైదరాబాద్, నవంబర్13 (జనంసాక్షి) :** ఆర్టీసీ రెవెన్యూ పెంచేందుకు మార్గాలు అన్వేషించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త కాలనీలకు బస్సు రూట్‌లు పెంచేలా అధ్యయనం చేయాలన్నారు. కారుణ్య నియామకాల కింద ఎంపికైన కండక్టర్ల ప్రొవిజన్ పీరియడ్ రెండేళ్లకు తగ్గించాలని చెప్పారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ డిపోలు లాభాల్లోకి వచ్చేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఆరంఘర్‌లో బస్సు టెర్మినల్ కోసం పోలీసు శాఖ భూములపై చర్చించాలన్నారు. హైదరాబాద్‌లో కొత్త డిపోలకు స్థల పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బస్సు ప్రమాదాలను తగ్గించడానికి డ్రైవర్ మానిటరింగ్ సిస్టం అమలు చేస్తామని వివరించారు. త్వరలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మహాలక్ష్మీ పథకం వచ్చిన తర్వాత సంక్షోభంలో ఉన్న ఆర్టీసీ క్రమక్రమంగా లాభాల బాటలోకి వస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి నెల వారిగా వస్తున్న మహాలక్ష్మి టికెట్ ఆదాయమే కాకుండా అదనపు ఆదాయంపై దృష్టి సాధించాలని సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. తాజాగా ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్టీసీ లో ఇప్పటి వరకు మహిళలాలు 237 కోట్ల జీరో టికెట్ ఉపయోగించుకున్నారని తెలిపారు. 7980 కోట్ల రూపాయలు ఆర్టీసీ కి ప్రభుత్వం చెల్లించిందని వెల్లడించారు. టికెట్ ఆదాయంతో పాటు టికెట్ యేతర ఆదాయంపై దృష్టి సారించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులకు దిశా నిర్దేశర చేశారు. ఆర్టీసీ బస్సులు ,బస్ స్టేషన్ లలో / టీమ్ మిషన్ ల ద్వారా వచ్చే టికెట్ పై అడ్వటంల్ల÷జ్మెంట్స్ ద్వారా ఆదాయాన్ని మరింత పెంచాలని సూచించారు. ప్రస్తుతం నష్టాల్లో కొనసాగుతున్న తాండూరు, వికారాబాద్, బీహెచ్ఈఎల్, మియాపూర్, కుషాయిగూడ, దిల్‌సుఖ్‌నగర్, హకీంపేట్, రాణిగంజ్, మిథానితో పలు డిపోలు నష్టాల బారిన పడటానికి కారణాలు, స్థానిక పరిస్థితులు ఆయా డిపోలు లాభాల బాట పట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయడానికి ప్రత్యేక కమిటీ వేయాలని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి నీ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుకునేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ఇప్పటికే 500 వరకు ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. పీఎం ఈ -డ్రైవ్ కింద హైదరాబాద్ కి కేటాయించిన 2 వేల బస్సులు విడతల వారిగా రానుండడంతో అందుకు సంబంధించిన ఛార్జింగ్ స్టేషన్లు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

# నిజామాబాద్ అభివృద్ధికి సుదర్శన్‌రెడ్డిది పెద్దన్న పాత్ర





- టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**నిజామాబాదు (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లాకు అనుభవ పూర్వకంగా ఆలోచనపరంగా సుదర్శన్ రెడ్డిది పెద్దన్న పాత్ర అని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సన్మాన సభలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలను సొంత సమస్యగా సుదర్శన్ రెడ్డి భావిస్తారని, సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ సలహాదారు మాత్రమే కాదు జిల్లాకు మంత్రి అని, ఏదైనా పని మొదలు పెడితే అకుంఠిత దీక్ష,పట్టుదలతో సుదర్శన్ రెడ్డి పూర్తి చేస్తారని తెలిపారు. సుదర్శన్ రెడ్డి వ్యాపారం, రాజకీయం పరంగా రాణించారని, జిల్లాకు మెడికల్ కాలేజ్ రావడంలో సుదర్శన్ రెడ్డి పాత్ర కీలకమని తెలిపారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా జిల్లాకు 21,22 పాళ్లు ప్యాకేజీలు తీసుకురావడంలో సుదర్శన్ రెడ్డి ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. కెనాల్ ఆధునీకరణ, నిధులు తీసుకువచ్చిన ఘనత వారిదేనని, ప్రాజెక్టుల ప్యాకేజీలను బిఆర్ఎస్ ప్రభుత్వం అటకెక్కించిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్ష ఇరవై వేల కోట్ల ప్రజాధనాన్ని గోదావరి నదిలో పోసిన ఘనత బిఆర్ఎస్ పార్టీదని, ప్రజాధనాన్ని కేసీఆర్ దుర్వినియోగం చేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం చరిత్రాత్మకమని, 15 మాసాల్లో 21 వేల్ కోట్ల రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే నిలబెట్టుకుంటుందని తెలిపారు. పిసిసి అధ్యక్షుడిగా జిల్లాకు 35 ఏళ్ల ఇంజనీరింగ్ కళాశాల నిరీక్షణకు ఏడాదిలో మంజూరు చేపించి తెరదించారని, అగ్రికల్చర్ కళాశాల యూనివర్సిటీలో ఏర్పాటు కాబోతోందని, కరీంనగర్ ధర్మపురి,కొండగట్టు, వేములవాడ, లింబాద్రి గుట్ట నుంచి బాసర వరకు 350 కోట్లతో రోడ్డు మంజూరైందని, కరీంనగర్ నుంచి నిజామాబాద్ వరకు రోడ్డు సదుపాయం త్వరలో అందించబోతున్నామని తెలిపారు. ఈ రోజే భీమ్గల్ లింబాద్రి గుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఆవరణలో టూరిజం గెస్ట్ హౌస్ నిర్మాణం కొరకు 4 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370